ISSN No:2581-7477

సాహిత్య

# ప్రస్థానం

అక్టోబర్ 2019

వెల రూ. 20



సాహితీస్రవంతి




జారీచేసినవారు: కమిషనర్, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం.

సాహిత్య ప్రస్థానం
అక్టోబర్ 2019

సంపుటి : 18 | సంపాదకీయం | సంచిక : 10

# తెలుగుకు దిగులు

ఇంగ్లీషు మీడియం మోజులో పడిన సమాజంలో ఇప్పటికే కొత్త తరాల విద్యాధికులకు దూరమవుతున్న తెలుగు భాషకు అలాగే ఇతర దేశీయ భాషలకూ మరో సవాలు ఎదురవడం ఆందోళనకరం. హిందీ దివస్ సందర్భంగా దేశ ప్రజలందరూ రెండవ భాషగా హిందీ నేర్చుకోవాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ఇచ్చిన పిలుపు ఇతర భాషలవారిలో ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలలో దుమారం రేపింది.రాజ్యాంగం ఎనిమిదవ షెడ్యూలులోని ఇరవై రెండు భాషలకూ సమాన అధికార ప్రతిపత్తి కల్పిస్తున్న రాజ్యాంగ స్ఫూర్తికి ఇది విరుద్ధం. వందలాది భాషలు మరెన్నో వందల మాండలికాలు లిపి లేని తెగల భాషలతో అలరాలే ఈ భారతావని విశాల వారసత్వానికీ వ్యతిరేకం. 42-46 శాతం మంది మాత్రమే మాట్లాడే హిందీ నిజానికి భోజ్‌పురి, ఉర్దూ, పంజాబీ, అవధ్ తదితర అనేక పలుకుబడుల సంగమం. దాన్ని రాసేది దేవనాగరి అంటే సంస్కృత లిపిలో. ఉర్దూ లిపిలోనూ రాయొచ్చు. దాంతో పోలిస్తే తెలుగు, తమిళం తదితర దక్షిణాది భాషలు వేల సంవత్సరాల చరిత్ర, సాహిత్యం కలిగివున్నాయి. విశిష్ట భాష హోదా కూడా పొందాయి. వాటిపై హిందీని రుద్దే ప్రయత్నం రాజ్యాంగ నిర్మాణ దశలో వీగిపోయింది. 60 వ దశకం మరో పెద్ద ప్రకంపనాలకే దారితీసింది. అయినా మరోసారి అదే దుస్సాహస వాక్కులు కేంద్రం నుంచి రావడం ఆశ్చర్య కరం. చాలా విషయాల్లో ఏకపక్ష కేంద్రీకృత ఆధిపత్యాన్ని తెచ్చిపెడుతున్న ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం భాషా వైవిధ్యాన్ని కూడా దెబ్బతీయాలని చూడటం సహించరాని విషయం. తెలుగు వారంతా గొంతెత్తి ఖండించాలి. దీనిపై తెలుగు రాష్ట్రాల పాలకుల నుండి నిరసన వ్యక్తం కాకపోవడం దురదృష్టకరం. చాలా కోణాల నుంచి వ్యక్తమైన అభ్యంతరాలతో కేంద్రం వెనక్కు తగ్గినట్టు మాట్లాడుతున్నా సమస్య వుండనే వుంది. అంతకుముందు విద్యా విధాన ముసాయిదాలోనూ ఈ సంకేతాలు ఇచ్చి సర్దుకున్నారు. బహుభాషల భారత దేశంలో ఏ ఒక్క భాషనో అందరూ నేర్చుకోవాలని శాసించడం చెల్లుబాటు కాదు. అలాగే ఇంగ్లీషు నేర్చుకోవచ్చు గాని మాతృభాషలో బోధనావకాశమే లేని విధంగా ప్రభుత్వాలు నిర్ణయాలు చేయడం కూడా సరికాదు. ♦

సంపాదకవర్గం:
తెలకపల్లి రవి ప్రధాన సంపాదకుడు
వొరప్రసాద్ వర్కింగ్ ఎడిటర్
కె. సత్యరంజన్ ◆ చీకటి దివాకర్
గనారా ◆ శమంతకమణి
కెంగార మోహన్
కె.లక్ష్మయ్య, మేనేజర్

బొమ్మలు: తుంబలి శివాజి, చిదంబరం
గంగాధర్ వీర్ల

కవర్ డిజైన్: బ్రౌన్

రచనలు, చందాలు, విరాళాలు, మనీ ఆర్డర్లు, చెక్కులు, డిడిలు పంపవలసిన చిరునామా:
సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, ఫోన్: 0866-2577248, సెల్: 9490099059
ఇ-మెయిల్ : ssprasthanam@gmail.com, www.prasthanam.com
ISSN No: 2581 - 7477
సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి! తెలుగు భాషా, సాహిత్య కృషిలో భాగస్వాములు కండి!!
1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 /
◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-
Bank A/c Details: A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

## కథలు


మల్లక్క కయ్య - కాశీవరపు వెంకటసుబ్బయ్య......... 5
వృద్ధి - ఆచార్య కొలకలూరి ఇనాక్..................... 25
భీమ్‌రావ్ చెప్పిన అంబేద్కర్ కథ - కుం. వీరభద్రప్ప
- వేలూరి కృష్ణమూర్తి (కన్నడ నుండి తెలుగు)...... 43


## కవితలు


గజల్ - భైరి ఇందిర...................................... 4
జనాశ్రయం - నిఖిలేశ్వర్.................................. 8
ఓ సంధిగ్ధ ప్రశ్న - బండ్ల మాధవరావు.................. 9
బాల్యం అంతరిస్తుందేమో - బంగార్రాజు కంఠ.......... 9
ఉషోదయం సిగ్గుపడుతోంది - పొత్తూరి సుబ్బారావు..... 14
అన్నంకుండ - మార్ని జానకిరామ్ చౌదరి................ 18
భూతం - చిత్తలూరి......................................... 24
ఎన్నాళ్ళని? - నూనెల శ్రీనివాసరావు...................... 24
రంగుకి పేరెందుకు? - కిల్లాడ సత్యనారాయణ......... 30
ఐడెంటిటీ - డా॥ యస్. సత్యప్రసాద్....................... 30
నిశ్శబ్ద విప్లవం - మానాపురం రాజాచంద్రశేఖర్......... 35
ఎడారులన్నీ ఒకటి కాదు - అడిగోపుల వెంకటరత్నం... 36
తృతీయ కృతి - సయ్యద్ జహీర్ అహ్మద్................. 36
అడవి చేతులు కట్టుకొని కూకోదు - పల్లిపట్టు నాగరాజు 39
అక్షర తాండవం - లిఖిత...................................42
నవ్వు - దారల విజయకుమారి............................ 45
మా బ్రతుకు బ్రతుకనివ్వండి - డా॥ వేముల శేఖరయ్య.. 46
వానాకాలం ఒకటుందని.. - తవ్వా ఓబుల్‌రెడ్డి........... 49
అతడి కోసం - చెళ్ళపిళ్ళ శ్యామల........................ 50
అలంకారప్రాయం - కోట్ల వెంకటేశ్వర రెడ్డి.............. 53
కొత్త ఊపిరి - చెట్టుకో విన్నపం.......................... 56
చెట్టుకో విన్నపం - డా॥ వి. ఆర్. రాసాని................. 56
హైకూలు - బి. గోవర్ధనరావు........................... 59
వెలుగు బావుటా - బి. హనుమారెడ్డి.................... 62


## వ్యాసాలు


వీరబ్రహ్మం పద్యాలు - ప్రాసంగికత
- డా॥ రాచపాళెం చంద్రశేఖర రెడ్డి............ 10
తత్త్వాల కాలజ్ఞాని (రూపకం)
- తెలకపల్లి రవి.................................15
సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2019 పురస్కారాలు.... 18
నాలుగు అస్తిత్వాలు - వాస్తవ జీవనశిల్పాలు
- డా॥ పి.సి. వెంకటేశ్వర్లు....................... 19
కథాభారతికి అనువాద హారతి - ఎమ్వీ రామిరెడ్డి..... 31
సీమ మట్టిపరిమళమే 'మట్టిపోగు' కవిత్వం
- కెంగార మోహన్.............................. 37
సహజ వెలుగుల షాండ్లియర్
- టేకుమళ్ళ వెంకటప్పయ్య...................... 40
ఆమె కవిత్వం.. భావోద్వేగాల సమ్మిళితం
- గంగవరపు సునీత............................. 47
తెలుగు సాహిత్యం, సంస్కృతిపై గాంధీజీ ప్రభావం
- అనిల్‌కుమార్ దార్వేముల...................... 51
అణచివేతకు అద్దం పడుతున్న కతలు
- వై.హెచ్.కె. మోహన్‌రావు...................... 54
గాంధీ ప్రభావం - అంతరానితనం నిరసన కవిత్వం
- జడా సుబ్బారావు..............................57
తెలుగు భాష మనది - హిందీ ఆధిపత్యాన్ని సంహించం
- తీర్మానం.......................................60
స్వీకారం...................................................63
డైరీ .......................................................64


కవిత

## గజల్


- భైరి ఇందిర
9849173560


చిన్నిపాపకెవరు నేర్పె ఇన్ని మాటలు
మురిపెముతో ఆడెను చక్కన్ని మాటలు

అనుభవాల పాఠాలే నిన్ను నడుపును
ఎల్లప్పుడు చెల్లవులే అన్ని మాటలు

ఎదుటివారి తత్త్వమేదొ ఎరుగనైతిని
ముందునాళ్ల వినాలి ఎన్నెన్ని మాటలు

ఒంటరివై కుమిలిపోతె ఏమి మిగులును
ఎంత బరువు దించునోయి చిన్ని మాటలు



నిన్ను బయటవేయదులే నీదు మనస్సె
లోలోనే దాచుకోమ కొన్ని మాటలు

దూరమైన, కలతీరే రోజు వచ్చులె
పంచుకొనగ దాగెనవే ఎన్ని మాటలు

భాష్ప జలధిలోన దాగె గజలు ముత్యమె
ఏరుకోవె 'ఇందిరా' మరిన్ని మాటలు ♦

కథ



# మల్లక్క కయ్య

- కాశీవరపు వెంకటసుబ్బయ్య
7382623397

అది జనవరి నెల. సంక్రాంతి ఇంకా పదిరోజులే ఉంది. ఆ యేడు వర్షాలు బాగా పడడం వలన గండేటికి నీళ్లొచ్చి, చదిపిరాల చెరువు నిండింది. చెరువు కిందున్న ఆయకట్టు భూమంతా బాగా పండి, కోతకొచ్చి గాలికి బరువుగా ఊగుతూ ఉంది.

రైతులంతా ఆనందోత్సాహాలతో ఎవరికి అందిన కూలోళ్లను వాళ్లు గుంపుకట్టుకొని వరికోతకు మొదలుపెట్టారు. వరికోత సమయంలో కూలోళ్ల కొరత మామూలుగానే ఎక్కువగా ఉంటుంది. ఏ రైతు ముందుగా కూలోళ్లను వరికోతకు పిలుస్తాడో వాళ్లకే ముందుగా పనిలోకి పోతూవుంటారు కూలోళ్లు. అందుకని రైతులు ఎవరికివారు ముందు జాగ్రత్తపడి కూలోళ్లను ముందుగా పిలుస్తుంటారు.

అదే గ్రామంలో పుల్లారెడ్డి అనే రైతుకు ఓ ఇరవై ఎకరాల వరిమడి ఉంది. పుల్లారెడ్డి భూమి కూడా బాగా పండి కోతకొచ్చింది. అరకొరగా అందిన కూలోళ్లతో వరికోతకు దిగాడు పుల్లారెడ్డి. కూలీతో పాటు మధ్యాహ్నం సంగటి పెట్టే విధంగా ఒప్పందం కుదుర్చుకున్నారు కూలోళ్లు.

ఊరంతా చిర్రాబుర్రా వరికోతలు శరవేగంగా సాగిపోతున్నాయి. పదిరోజుల్లో పంటంతా కల్లాల్లోకి రావాలని సంక్రాంతి కల్లా ఇంటికి గింజలు చేరాలని పట్టుదలతో ఉన్నారు రైతులు.

పుల్లారెడ్డి తన భూమికి ఈశాన్యమూలన రాతి శిలలు పెట్టి పసుపురాసి, కుంకుమ బొట్లుపెట్టి, రాతి శిలలను పూలతో అలంకరించాడు. పప్పులు, బొరుగులు, బెల్లం నైవేద్యంగా పెట్టాడు. ఆకు వక్కా తాంబూలం పెట్టి, అందులో రూపాయి బిళ్ల దక్షిణగా పెట్టి టెంకాయ కొట్టి వరికోత ప్రారంభించాడు.

వరికోత వడివడిగా సాగుతుంది. కూలోళ్లు తమ శ్రమలను మరచిపోవడానికి యాలపాటలు పాడుకుంటున్నారు. ఒకరి పాట ముగియంగానే మరొకరు పాట అందుకుంటూ ఒకరి తరువాత మరొకరు జానపద గీతాలను ఆలపిస్తూ తమ కష్టాన్ని మరచిపోతున్నారు. ఆ జానపదాల గాన మాధుర్యపు అలలు అలలుగా సాగి పరిసరాలను పరవశింపజేస్తున్నాయి. తరతరాలుగా జానపదాలను శ్రమ జీవులే కాపాడుకుంటూ వస్తున్నారు.

♦♦♦

సూరన్న పుల్లారెడ్డి జీతగాడు. అతని భార్య మల్లక్క వారికి ఆరేండ్ల కూతురు, పాలు తాగే చంటిగాడు ఉన్నారు. చాలాయేండ్లుగా పుల్లారెడ్డి పొలంలో పూరి గుడిసె వేసుకొని పొలానికి మడవ కడుతూ కాపురం ఉంటున్నాడు. వారి కాపురం పొరపొచ్చాలు లేని ముచ్చటైన సంసారం. ఈడుజోడు చక్కగా కుదిరిన చక్కని జంట. పొలంలో సూరన్న పని చేస్తే

జీతంలోకే సరిపోతుంది. అతని భార్య కూడా పనిచేస్తే ఆమెకు కూలి ఇస్తాడు పుల్లారెడ్డి.

సూరన్న భార్య మల్లక్క ఆత్మాభిమానం మెండుగా ఉన్న మానవతి. మాటపడకుండా అన్ని పనులు చక్కదిద్దుతూ ఉంటుంది. కష్టం చేయడానికే పుట్టినట్లు సహనం మూర్తీభవించిన స్త్రీమూర్తి. జీతానికి కట్టుబడ్డాక ఇష్టమొచ్చినట్లు ఉండడానికి అడ్డుకట్ట పడ్డట్టే. అందుకే మల్లక్క వినయ విధేయతగా, భయం భక్తిగా మసలుకుంటూ, చెప్పింది చెప్పినట్లు సకాలంలో చేస్తూ యజమానితో పాటు ఊరందరి నోట్లో నాలుకై అభిమానవతిగా, గుణవతిగా పేరు తెచ్చుకుంది. పల్లెత్తు మాట పడకుండా సాగుతున్న ఆమె జీవితంలో ఆ రోజు ఆఖరి దుర్దినం.

ఆ రోజు సూరన్నతో పాటు అతని భార్య మల్లక్క గూడా పుల్లారెడ్డి మడిలో వరికోతకు దిగాల్సి ఉంది. ఆ రోజు సద్దికూడు లేనందున పనిలోకి దిగడానికి ఆలస్యమైంది. ఒక పావు బియ్యం కడిగి పొయ్యిమీద వేసి అన్నం వండింది. దానిలోకి పచ్చికారం నూరి కూతురి కింత పెట్టి, తానింత తిని మొగుని కింత మిగిల్చింది మల్లక్క. అప్పటికే మల్లక్కను పుల్లారెడ్డి నాలుగైదుసార్లు పిలిచాడు పనిలోనికి రమ్మని. “వచ్చాండయ్యా పిల్లోల్లకు బువ్వపెట్టి” అని వినయంగా, భయంగా చెప్పుకుంది.

మొగుడు సూరన్న కూలోళ్లు కోసిన పంట చెత్తను పెద్ద పెద్ద మోపులుగా కడుతున్నాడు. కల్లంలోనికి మోసుకుపోవడానికి వీలుగా.

పుల్లారెడ్డి మరోసారి మల్లక్కను గద్దించి పిలిచాడు. అప్పుడే చంటిగాడు ఏడుపు అందుకున్నాడు. చంటిగాన్ని ఒళ్లోకి తీసుకొని సముదాయిస్తుంది మల్లక్క. పుల్లారెడ్డి కోపం తారాస్థాయికి చేరింది.

“మాల్దాన్ని మల్లమ్మాంటే మరింత నీల్గిందట, వంగి మెట్టు తీస్కుంటే వచ్చాండ పొయ్యాందట” అట్లా ఉందే నీ యవ్వారం ఒళ్లేమన్నా కొవ్వెక్కిందా? ఎంత పిలిచినా పన్లోకి రావ్” అంటూ పుల్లారెడ్డిలో ఆధిపత్య ధోరణి బుసలు కొట్టింది. అతనిలోని జాత్యాంహకారం, పెత్తందారితనం పడగ విప్పి నాట్యమాడాయి.

అంతమంది కూలోళ్లలో అంతేసి మాటలు అనేసరికి మల్లక్క ఆత్మాభిమానం ముక్కలైంది. ఎదలో బాకుతో పొడిచినట్లైంది. కండ్లు చింత నిప్పులైనాయి. గుండె పగిలి నీరైంది. ముఖంలో కత్తిగాటుకు నెత్తురు చుక్క లేదు. ప్రాణం పోయినా మానం పోకూడదన్నది మల్లక్క సిద్ధాంతం. పెత్తందారితనం ఎంత బలంగా, ఎంత పదునుగా ఉంటుందో మల్లక్కకు తెలియంది కాదు. ఎదురు తిరిగి మాటకు మాట బదులిస్తే ఏం జరుగుతుందో మల్లక్కకు బాగా ఎరుకనే. అంతా తమకు అనుకూలంగా లాభదాయకంగా జరుగుతున్నంత వరకే మెత్తగా మంచిగా ఉంటారు. ఏ మాత్రం తేడా వచ్చి తమకు నష్టంగా పరిణమించితే జూలు విధిలించి కర్కశంగా పంజా విసురుతారు. అయితే ఆత్మాభిమానం దెబ్బతిన్నాక బతికి ప్రయోజనమేముంది? అనుకుంది మల్లక్క.

అంతా మౌనంగానే భరించింది. చంటిగాడికి పాలిచ్చింది. ఇంటి ముందున్న మామిడి చెట్టుకు చీరెతో ఉయ్యాలవేసి, అందులో చంటిగాడిని పడుకోబెట్టి జోలపాడి నిద్రపుచ్చింది. చంటిగాడికి పాలుగాచి, సీసాకు పట్టి, చంటిగాడి దగ్గరగా పెట్టింది. ఆ తరువాత మల్లక్క చీర కాశెపోసి గోచి కట్టింది. పైట కొంగు నడుముచుట్టూ చుట్టి గట్టిగా బిగించి రొండిలోకి దోపుకుంది. పిల్లాడిని తేరిపార చూసుకుంది. కూతుర్ని దగ్గరకు తీసుకొని ముద్దుపెట్టుకుంది. “నాయన సెప్పిన మాటిని మంచిగా నడ్చుకోమ్మా, నాయన్ను కట్టపెట్టే పన్లు చేయొద్దు” అని కూతురికి బుద్ధి చెప్పింది. కొడవలి తీసుకొని మడిలోకి దిగింది మల్లక్క.

అందరూ వరికోతకు దిగిన దొంపులో కాకుండా పక్కనున్న ఎకరా దొంపులో తానొక్కతే ప్రత్యేకంగా వరి కోతకు వంగింది. తమ పక్కన కోతకు దిగనందుకు తోటి కూలోళ్లు ఆశ్చర్యంగా చూశారు. ఆమె ముఖంలో గాంభీర్యాన్ని, దృఢత్వాన్ని చూసి ఏమీ అనలేకపోయారు. పుల్లారెడ్డి కూడా మౌనంగా చూస్తూ వుండిపోయాడు.

ఎన్నాళ్లనుంచో మల్లక్క మనస్సు తెలిసిన పుల్లారెడ్డి తొందరపడి అంతేసి మాటలు తూలినందుకు మనసులోనే నొచ్చుకున్నాడు. తరం నుంచి తరానికి అందిపుచ్చుకుంటూ వచ్చిన అగ్రవర్ణ దురహంభావమే నాతో అలా అనిపించిందేమో” అనుకున్నాడు. ప్రొద్దు ఎక్కే కొద్ది ఎండ అంతకంతకూ తీవ్రమవుతున్నది. కూలోళ్ళు రోజూ ఎండలో పనిచేస్తూ ఉండడంవల్ల వారి ముఖాలు నల్లగా కమిలిపోయి ఉన్నాయి. పొలాల్లో పనిచేసే రైతులు, రైతు కూలీలు తక్కువ కాలంలోనే ముసలి వాళ్లైపోతుంటారు.

మల్లక్క వరికోత తీక్షణంగా ఏకాబిగిన సాగుతున్నది.

మధ్యలో ఒకసారి కూలోళ్లు పనిలో నుంచి లేచి, మంచి నీళ్లు తాగి, వక్కాకు వేసుకొని మళ్లీ పనిలోకి దిగారు.

మల్లక్క భర్త సూరన్న కూడా లేచిపోయి అన్నం తినొచ్చి పనిలోకి దిగాడు. మల్లక్క మాత్రం ఉలుకూ, పలుకూ, పక్కచూపూ లేకుండా పనిలో నిమగ్నమై చకచకా కోతలో ముందుకెళ్లుతుంది.

మిట్ట మధ్యాహ్నమైంది. కూలోళ్లందరూ లేచి పంటకాలువలో కాళ్లూ ముఖాలు కడుక్కుని సంగటి తినడానికి చెట్టు నీడకు పోయారు. ఇంతలోపల పుల్లారెడ్డి కోడలు పద్మావతి పెద్ద వెదురు గంపలో రాగి సంగటి, కందిపప్పు, శనక్కాయ కారం తెచ్చి కూలోళ్ల ముందర పెట్టింది. ఒక్కొక్కరూ గంప ముందుకొచ్చి సంగటి ముద్దలు పెట్టించుకున్నారు. పద్మావతి ఒక్కొక్కరికి రెండేసి ముద్దలు పెడుతుంది. కూలోళ్లు ఎడమచేతిలో ముద్ద మీద ముద్ద పెట్టుకొని, పై ముద్ద పై భాగాన పప్పు వేసుకోవడానికి వీలుగా చేతితో గులిగ (గుంత) చేసుకొని అందులో పప్పు నంజుకోవడానికి శనక్కాయ కారం వేపించుకొని పక్కకు పోయి తింటున్నారు. తిన్నాక కొంతమంది మారు సంగటి పెట్టించుకుంటున్నారు. తినడం అయిపోయాక కూలోళ్లు నీళ్లు తాగి కొద్దిసేపు విశ్రాంతి తీసుకున్నారు.

అప్పటికింకా మల్లక్క వరికోస్తూ ఉండడాన్ని అందరూ గమనించారు. వంచిన తల ఎత్తకుండా మల్లక్క వరికోస్తూ ఉంది.

అయ్యో! పాపం వంచిన నడుము ఎత్తకుండా పొద్దుట్నుంచి కోస్తూనే ఉంది బిడ్డా! అనుకొని కొంతమంది కూలోళ్లు ఆమె వద్దకు పోయి "లేమ్మా మల్లమ్మా సంగటి తిందువుగ్గాని, పైటాల గూడా దాటి పోతాంది" అని పిలిచారు. ఉలుకూ లేదు పలుకూలేదు. ఎన్నో విధాల బతిమిలాడారు. చంటిగాడు ఏడ్చేసరికి సూరన్న పోయి సీసాపాలు తాపి, నిద్రపుచ్చి వచ్చి భార్యను కయ్యాలోంచి బయట్కి రమ్మని ప్రాధేయపడ్డాడు. కూలోళ్లల్లో అమ్మలక్కలందరూ "కోతాపి గట్టెక్కిరమ్మని" చాలాసేపు చెప్పి, బతిమలాడి, భంగపోయారు. పుల్లారెడ్డి కూడా వచ్చి, చెప్పి చూశాడు. ఐనా మల్లక్క నుండి ఎట్టి సమాధానమూ లేదు.

మల్లక్క దృష్టంతా వరికోతపైనే లగ్నమై ఉంది. ఒక యంత్రంలా కోత కోస్తూ ముందుకు పోతావుంది. చేసేదిలేక అందరూ పనుల్లోకి దిగారు. సూరన్నకు బెంగవున్నా అస్వతంత్రుడు కనుక దిగులు పడుతూనే పనిలోకి దిగాల్సివచ్చింది.

అప్పటికి అర్ధ ఎకరా పైగానె కోత కోసింది మల్లక్క. బహుశా ఎకరా మొత్తం తానొక్కతే కోయాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లుంది.

సాయంత్రం ఐదైంది. చుట్టు పక్కలా పొలాల్లోని కూలోళ్లందరూ ఇండ్లకు వెళ్లిపోయారు. ఊళ్లో మల్లక్క వరికోత విషయం గుప్పుమంది. ఊరువూరంతా పుల్లారెడ్డి భూమి చుట్టూ ఆందోళనతో మూగారు. అందరి ముఖాల్లో పెనువిషాదం అలుముకుంది.

మల్లక్క ఎవరినీ ఎగాదిగా చూడలేదు. తనకున్న అతితక్కువ సమయంలో తన పని ముగించాలని ఆతృత పడుతుంది. తన కులపోళ్లు కొందరు ఆమె చేత ఎలాగైనా పని మాన్పించి ఆమె ప్రాణాన్ని నిలపాలని కయ్యలోకి దిగారు. అది గమనించిన మల్లక్క ఎక్కడ తన దీక్షకు భంగం కలిగిస్తారోనని తలచి తను వరికోత కోస్తున్న కయ్య నుంచి తల తిప్పకుండా, నడుమెత్తకుండానే ఆమె కొడవలిని తన మెడపై పెట్టుకుంది. కయ్యలోకి దిగినవారికి "బలవంతంగా వరికోతను ఆపుతే మెడ నరుక్కుంటాను' అన్న సంకేతం అది. వాళ్లు భయంతో వెనుతిరిగి, కయ్య గట్టు ఎక్కి నెత్తినోరు కొట్టుకున్నారు. గుండెలు బాదుకుంటున్నారు. బుజ్జగింపు మాటలు చెబుతున్నారు.

"అమ్మా మల్లమ్మా, పని చాలించి బయట్కి రామ్మా, మన బోటోల్లు కోప్పడితే దెబ్బతినేది మన్మేనమ్మా. అనేవాల్లకేమి మచ్చుగా అంటారు. పోయేది మన్మే తల్లీ. పేదోడి కోపం పెదవికి చేటంటారు. ఇట్టా పట్టుదల్కు పోకూడదమ్మా. ఇది మనకర్మ అనుకొని మనస్సు గెట్టి చేస్కోవాలమ్మా" అంటూ సంఘంలో తమ స్థాయి ఎంత అధమస్థానంలో వుందో రకరకాలుగా విప్పి చెప్పిచూశారు. "రోసానికి పోయి పానం మీదికి తెచ్చుకోకమ్మా. పిల్లల్ను, సూరన్నను అన్యాయం సేసి ఒంటరోళ్లను సేయకమ్మా" అంటూ పరిపరి విధాలుగా ఆవేదనతో చెబుతున్నారు. కాని మల్లక్క అందర్లాంటి ఆడది కాదు. ఆత్మాభిమానానికి అగ్రతాంబూలం ఇచ్చే మానవతి. వారి ఆర్దింపులకు చింతాకంత కూడా కదలిక లేదు.

సూరన్న పిల్లోడిని సంకన వేసుకున్నాడు. వాడు ఒక్కటేమైన ఏడుస్తున్నాడు, కూతురు అమ్మకు ఏమైపోతున్నదోనని ఏడుపు అందుకుంది. చుట్టాలు పక్కాలు

## కవిత

# జనాశ్రయం

- నిఖిలేశ్వర్
9177881201



రహదారులన్నీ
వచ్చి చేరే కూడలిలో
ఆ కాస్సేపు
అపరిచితులంతా ఆత్మీయులుగా
విశ్రాంతిగా వేచివున్న చోటే
తప్పిపోయిన వాళ్లు
ఇంటినుంచి పారిపోయిన వాళ్లు
దిక్కుదివాణంలేని అనాధబాలలు
లేచిపోయొచ్చిన జంటలు
స్థావరాలు –
వెతుకుతున్న రహస్య ప్రేమికులు
నిరాదరణ – నిర్లక్ష్యానికి గురై
దీనంగా దిక్కులు చూసే ముసలివాళ్లు
వికలాంగులు – నిరాశ్రయులు,
చేయితిరిగిన జేబుదొంగలు
బిచ్చమెత్తుకునే సోమరిగాళ్లు,
అక్కడే కనుమరుగైతే చాలు
సూట్‌కేసులు కాజేసే దొంగలు
దేశం నలుమూలల నుంచి
అప్‌డవున్‌గా పయనించేవాళ్లు
కలగలిపే ఆయాభాషల
లయ విన్యాసాల్లో
రాని రైళ్లకోసం
నిరీక్షించి నీరసించేవాళ్లు,
సకాలంలో చేరలేక
బండితప్పిన ప్రయాణికులు
ఇడ్లీ వడ చాయ్ కాఫీ అరుపులలో
కదిలే నిరంతర యాత్రికులకు
రైల్వేస్టేషన్ ఒక జనాశ్రయం !! ♦

---

హాహాకారాలు, ఆర్తనాదాలు చేస్తున్నారు. సూరన్న భార్యను "నా మాటవిని పనిచాలించి రమ్మని" బొంగురుబోయిన గొంతుతో మొత్తుకుంటూ దీనంగా వేడుకుంటున్నాడు. పుల్లారెడ్డి "మల్లమ్మా నువ్వు అభిమానవతివని తెల్సిగూడా పొరపాట్న మాటలు తూలాను, ఇంకెప్పుడూ ఇలా జరగదమ్మా, బయటికి రామ్మా, నన్ను చెడ్డోడిగా ముద్రేయకు తల్లీ" అంటూ బాధను వ్యక్తం చేస్తూ పిలుస్తున్నాడు.

కాని అప్పటికే మల్లక్క గొంతు మూగబోయింది. మల్లక్కకు ఎవరి మాటలు వినడానికి చెవులు పనిచేయడం లేదు. మాట్లాడడానికి నోరు రావడం లేదు. పొద్దట్నుంచి అన్నం నీళ్ళూ అనుకోకుండా లక్ష్యం కోసం వేగంగా కోతకోస్తూ వుండడం వల్లా ఆమెలోని శక్తి క్షణక్షణానికి హరించుకుపోతుంది. ఆఖరు మునం అయిపోయే దశకొచ్చింది. పడమట ఎర్రపొద్దుపడింది. ఎర్రకాగులేచింది. పక్షులన్నీ కలకలారావాలు చేస్తూ చెట్లమీది గూళ్లకు చేరుతున్నాయి.

సూర్యుడు కుంకడానికి ఇంకా ఒక్క నిమిషమే ఉంది. మల్లక్క కోయడానికి ఇంకా పది వరిగంటలు మాత్రమే మిగిలి ఉన్నాయి. చూస్తుండగానే కరకరామంటూ పొద్దుకుంకింది ఈ బాధమయదృశ్యం చూడలేనట్లు. మల్లక్క ఆఖరి వరి గంట విజయవంతంగా కోసింది. ఆమె అవసానదశకు చేరుకుంటున్నా ఆమె ముఖంలో విజయగర్వం క్షణకాలం పాటు మెరిసింది. ఎకరా వరిమడి కోత అయిపోయాక మల్లక్క వంగిన నడుమును మెల్లిగా పైకి లేపి నిలబడింది. తల పైకెత్తి భర్తను, పిల్లలను చుట్టూ ఉన్న జనాన్ని తేరిపార చూసింది. అందరికీ ఒకసారి చేతులెత్తి దండం పెట్టింది. కొద్ది క్షణాలు జనానికి నోట మాట రాక స్తంభించిపోయారు. మల్లక్క తన నడుముచుట్టూ చుట్టి రొండిలో దోపుకున్న పైట ఒక్కసారిగా లాగివేసింది. అంతవరకు పైట కొంగు బిగింపులో దాగి ఉన్న ఊపిరి ఒక్కసారిగా బయటికి తన్నుకొచ్చి అనంత విశ్వంలో కలిసిపోయింది. మొదలు నరికిన చెట్టులా ఆమె విగత శరీరం భూమి మీద పడిపోయింది. ఆ ముఖంలో ఆత్మవిశ్వాసం మాత్రం జ్యోతిలా వెలుగుతూ వుంది.

జనమంతా నోటికీ చేతికీ కొట్టుకుంటున్నారు. గావుకేకలతో గుండెలదిరే అరుపులతో ఆ ప్రాంతమంతా శోక సముద్రమైంది. వేదనా భరితమైంది. అంతటా విషాదం పరుచుకుంది. ఊరువూరంతా కన్నీరు పులుముకుంది.

పుల్లారెడ్డి తన అహానికి, అతిశయానికీ బలైపోయిన మల్లక్క మరణానికి మూల్యం చెల్లించుకున్నాడు. మల్లక్క కోత కోసిన ఎకరా మడికయ్యను సూరన్నకు రాసిచ్చాడు. ఆమెకు సమాధి అదే కయ్యలో ఒక మూల నిర్మించారు. కాని పోయిన ప్రాణానికి వెలకట్టడం ఎవరికీ సాధ్యం కాదు.

నాటి నుంచి నేటివరకు ఆ ఎకరా కయ్యను "మల్లక్క కయ్య" అంటూ జనం పిల్చుకుంటున్నారు. మల్లక్క జీవితం జనపథంలో కథలా కాలంతోపాటు దశాబ్దాలుగా ప్రవహించింది. ప్రవహిస్తూనే వుంది. ♦

## కవిత

## ఓ సందిగ్ధ ప్రశ్న

- బండ్ల మాధవరావు
8897623332



ఒకానొక సూర్యోదయ సమయాన
ఏ దిక్కు ఎర్రబారుతుందో తెలియని
సందిగ్ధ కాలాన
విచ్చుకుంటున్న కాలపు రేకులపై
సూర్యోదయాల్ని చెక్కుకుంటూ
ఆకాశపు అంచులకు
దేహాన్ని వేలాడదీసి
కారుతున్న రక్తపు చుక్కల్ని లెక్కబెడుతున్నాను
ఎప్పటికీ అంతం కాని
నిరంతర ధారలోంచి
కొన్ని చుక్కల్ని కుప్పబోసి
రెండు మొక్కలు నాటే ప్రయత్నంలో
దోక్కుపోయిన మోకాళ్లకి మోచేతులకీ
దువ్వమట్టిని ఊదుకుంటూ
దుమ్ము పోసుకొంటున్నాను
రాత్రికి వేలాడుతున్న నగ్నదేహాలు
రేపును పురుడుపోసుకొంటాయో
మృతశిశువులకు జన్మనిస్తాయో
ఓ అనంత సందిగ్ధ ప్రశ్న
నేలకూలిన చెట్టు
మట్టితో తన అనుబంధాన్ని
అంటుకట్టుకోవాలని తపిస్తోంది
ఆకాశపు చూరునుండి
రాలడానికి సిద్ధమైన చినుకు
అక్కడే ఆవిరవ్వడం
ఎప్పటికీ అంతుపట్టని రహస్యమే
మంచు పూలవనాలూ పుప్పొడి రేణువులూ
ఎర్రబారి ఎర్రబారి
మట్టి చెమ్మదేరుతోంది
మట్టి మనిషిని ప్రసవిస్తుందో
మనిషి మట్టిలో కలిసిపోతాడో
ఓ అంతులేని ఎదురుచూపు ♦

---

## బాల్యం అంతరిస్తుందేమో

- బంగార్రాజు కంఠ
8500350464



గళ్ళపుస్తకంలోని అక్షరాలు
వెక్కిరిస్తున్నాయి
నవ్వుపెదాలకు పువ్వులు
ప్లాస్టర్లు అంటించుకుంటున్నాయి
తాజాదనాల తలలు తెగ్గోస్తూ
గాలి భారంగా కదులుతుంది

ఆడీ పాడిన చెలిమి ఆవిరయ్యిందని
బార్బీ గుక్కపట్టి ఏడుస్తుంది
ఫ్యాన్సీ డ్రెస్ షో లో మురిపించిన
ప్రిన్సీ తప్పిపోయిందని డ్రస్ వెతుక్కుంటుంది
డ్రాయింగ్ షీట్ పై గీసిన కోతి బొమ్మ
ఏడుస్తూ వుంది

పసినవ్వుల్లో రసికత వెతుకుతున్న
లోకం ముఖాన ఉమ్మండిరా బాబు ఉమ్మండి
బాల్యాన్ని బలాత్కరిస్తున్న
మగతనాల మీద
ఏ రాచపుళ్ళునో రాజెయ్యండి
లేకపోతే
కాలుష్యానికి కొన్ని పక్షులు అంతరిస్తున్నట్టు
మానవ పరిణామ కలుషిత సిద్ధాంతంలో
ఇక బాల్యం అంతరిస్తుందేమో

చిట్టి గువ్వలారా.., పొట్టి తల్లులారా
మీ నవ్వులేని ప్రపంచం
ప్రాణవాయువు లేని పర్యావరణం
కదులుతున్న కాలం మొనమీద
ఇన్ని అక్షరాల పూలు పట్టుకుని
ఎదురు చూస్తుంటాను
మరణించిన బాల్యాలను
మీ సాక్షిగా మళ్ళీ బతికించడానికి ♦




*2019 అక్టోబర్ 12 కర్నూలు*

# వీరబ్రహ్మం పద్యాలు - ప్రాసంగికత

**- రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**
**7440222117**

***మతము మత్తుగూర్చు మార్గమ్ము కారాదు***
***హితము  గూర్పవలయు నెల్లరకును***
***హితము గూర్పలేని మతము మానగవలె***
***కాళికాంబ !హంస! కాళికాంబ!***

ఏ మతమైనా ప్రజలకు హితం, అంటే మంచిని నేర్పాలి. మంచిని సంపాదించి పెట్టాలి. అంతేతప్ప అది మనిషికి మత్తు కలిగించేదిగా ఉండకూడదు. ఏ మతమైనా సమాజానికి మంచిని సమకూర్చేది కాకపోతే దానిని వదిలేయాలి. మతం మనుషుల్ని కలపాలి. కలిసి ఉన్న మనుషుల్ని విడగొట్టరాదు. మతం మనుషులమధ్య ఉండే అడ్డుగోడల్ని పగులగొట్టాలి. మనుషులమధ్య స్నేహం పెంచాలి. ద్వేషం పెంచరాదు. మతం మానవుల మధ్య సామరస్యం కలిగించాలి. ఇవి చేయలేనప్పుడు మతం అక్కరలేదు.... నిజానికి మతం భావవాద సంస్థ. ప్రకృతి పరిణామాలు ఎలా సంభవిస్తున్నాయో తెలియని కాలంలో, ఆదిమానవునికి మానవాతీతశక్తి మీద నమ్మకం ఏర్పడి, అది క్రమంగా మతావిర్భావానికి దారితీసింది. ఆరాధనా విధానాలు మారుతున్న కొలదీ మతాలు పెరగసాగాయి. అవి మనుషుల్ని విడదీసి మత్తులో ముంచాయి. విశ్వాసానికే తప్ప విజ్ఞతకు అవకాశంలేని మతాలవల్ల ప్రజలలో అనైక్యతలు పొడసూపాయి. వీరబ్రహ్మంగారి కాలానికి హిందూమతంలోనే శాఖోపశాఖల మధ్య అనైక్యత ఉండేది. ఇస్లాం మతం వచ్చినాక మరొకటి తోడయింది. దానినంతా గమనించిన బ్రహ్మంగారు మనుషులకు మత్తు అందించటమే మతమైతే అది వద్దు అని చెప్పారు. మార్క్సిజం మతం మత్తుమందు అని తిరస్కరించింది. బ్రహ్మంగారు ప్రజలకు మంచి చేయలేని మతం వద్దన్నారు.

***అన్నమయములైనవన్ని జీవమ్ములు***
***కూడులేక జీవకోటి లేదు***
***కూడుదినెడికాడ కులభేదమేలొకో***
***కాళికాంబ! హంస!కాళికాంబ!***

అన్ని ప్రాణులూ అన్నం తినే బతుకుతున్నాయి. అన్నం, అది శాకాహారం కావచ్చు, మాంసాహారం కావచ్చు. ప్రతిప్రాణీ ఘనపదార్థమో ద్రవపదార్థమో ఏదో ఒకటి తిని, తాగి బతుకుతున్నది. అలాగే వండినదో, పచ్చిదో, పండినదో ఏదో ఒక ఆహారం తినే అన్ని ప్రాణులూ బతుకుతున్నాయి. ఆహారం లేకుండా ఏ ప్రాణీ బతకదు. ప్రాణులన్నిటికీ బతకడం ఎలా సమానధర్మమో, తిండితినడం కూడా అలాగే సమాన ధర్మం. తిండి అన్ని ప్రాణులనూ ఒక్కచోటికి చేరుస్తున్నది. తిండి లేకుండా ఏ ప్రాణీ బతకదు. ఇలాంటి ప్రాణులలో మనిషి ఒకప్రాణి. మానవేతరప్రాణులకు కులం లేదు. మనిషే కులం సృష్టించాడు. ఇదొక కుట్ర. గుంపుగా అన్యోన్యంగా బతుకుతున్న మనుషులమధ్య కులం అనే అడ్డుగోడ కట్టాడు వెనకటివాడెవడో. ఆ గోడను పగలగొట్టుకోలేక దేశం సతమతమౌతున్నది. ఓ కులంమీద మరోకులం పెత్తనం

చెలాయిస్తున్నది. ప్రతికులమూ తాను మరోకులం కన్నా వేరే అనుకుంటున్నది. ఒక కులాన్ని మరొకకులం పీడించే సాంఘికధర్మం ఏర్పడింది. కులం ఉమ్మడిజీవితాన్ని నాశనం చేసింది. కొన్ని కులాలకు ఎక్కడలేని సామాజికగౌరవం. తక్కినవాటికి తక్కువస్థానం. దీనినే నిచ్చెనమెట్లసమాజం అన్నారు డా.బి ఆర్ అంబేద్కర్. అంతేకాదు కులం సాంఘిక నిరంకుశత్వానికి కేంద్రం అనికూడా అన్నారు. భారతదేశం వందలసంవత్సరాలు పరాయిపాలనలో మగ్గడానికి కులమే కారణం. దుర్మార్గమైన కుల వ్యవస్థను శాశ్వతం చెయ్యడానికి దైవ,కర్మ, జన్మ సిద్ధాంతాలు సృష్టించబడ్డాయి. ఫలితం జనం శకలాలుగా, ముక్కలు ముక్కలుగా విడిపోవడం, పగిలిపోవడం. ఒక ఊరిలోనే కులాలవారీగా అనేక ఊళ్ళు. ప్రపంచంలో కులవ్యవస్థవంటి దుర్మార్గమైన వ్యవస్థ ఇంకొకటి లేదు. అది భారతదేశంలో బలంగా ఉంది. మనదేశం కులాలకుంపటి. ప్రతిదీ నిరంతరం రగులుతూనే ఉంటుంది. ప్రతికులమూ రగిలిరగిలి మరోకులం మీద పడుతూ ఉంటుంది. కులవ్యవస్థలో కొన్ని కులాలు సుఖపడ్డాయి. లాభపడ్డాయి. గౌరవం పొందాయి. అధికకులాలు శ్రమకు పరిమితమయ్యాయి. శ్రమే తప్ప ఫలితంలేదు. గౌరవం అంతకన్నాలేదు. ఎవరి శ్రమ లేకుండా తిండిగింజలు పండవో, ఎవరి శ్రమలేకుండా మిగతా జనం బతుకే గడవదో వాళ్ళు అంటరానివాళ్ళని, శ్వపచులని పేర్లతో ఊరికి దూరంగా, అవమానాలతో, పేదరికంతో బతకాల్సివచ్చింది. అందరూ తిండితినే బతుకుతున్నా ఎక్కువ తక్కువలు. ఈ దుర్మార్గంమీద ప్రాచీన కాలంలోనే ఎందరో యుద్ధం చేశారు. వాళ్ళలో పోతులూరి వీరబ్రహ్మంగారొక్కరు. ఈ పద్యం ఆయన కులవ్యవస్థమీద వేసిన మొట్టికాయ. అన్నిప్రాణులూ తిండితినే బతుకుతూ ఉంటే తిండిదగ్గర కులం ఎందుకు అన్నది ఆయన ప్రశ్న. ఈ ప్రశ్నకు కులం సృష్టికర్తలు, కులాన్ని సమర్థించేవాళు ళ్ళ సమాధానం చెప్పాలి. ఒక చిన్నవాక్యంతో వీరబ్రహ్మంగారు కులవ్యవస్థలోని అసంబద్ధతను ఎత్తిచూపారు. కులంమత్తులో కూరుకుపోయిన మనమొద్దుబుర్రలకు ఎక్కుతుందా? అన్నం అనేవాళ్ళు సంస్కారవంతులని, కూడు అనేవాళ్ళు అనాగరికులని అనుకుంటాం మనం. వీరబ్రహ్మంగారు 'కూడుదినెడికాడ' అని చక్కని తెలుగుమాట వాడారు. ఆయనను అనాగరికుడందామా. అన్నం సంస్కృతం, కూడు తెలుగు. వీరబ్రహ్మంగారు వర్ధిల్లాలి. కులవ్యవస్థ నశించాలి.

*వెలదులకును వేదవిద్యాధికారమ్ము*
*లేదటంచు, బ్రహ్మలిఖితమంచు*
*నోరుతెరచి మరచినారు వాణిని నిన్ను*
*కాళికాంబ!హంస!కాళికాంబ!*

ప్రాచీన, మధ్యయుగాలలో స్త్రీలకు చదువుకునే అర్హత లేకుండా చేసిన దుర్మార్గం మీద ఈ పద్యంలో వీరబ్రహ్మంగారు విమర్శ పెట్టారు. స్త్రీలకు వేదవిద్యనభ్యసించే అర్హత లేదనీ, అది బ్రహ్మ రాసినరాత అనీ ప్రచారం చేస్తూ ఆ విద్యకు అధినేత్రి అయిన నిన్ను మరచిపోయినారమ్మా వాణీ అని వీరబ్రహ్మంగారు సరస్వతికి గుర్తుచేశారు. భారతీయ సామాజిక వ్యవస్థలలో ముఖ్యమైన విద్యావ్యవస్థలోని అసంబద్ధతను అన్యాయాన్నీ వీరబ్రహ్మంగారు ఎత్తిచూపారు. ఇక్కడ ప్రతిదానికీ ఒక దేవుడో దేవతో నాయకత్వంవహిస్తూ ఉంటారని సంప్రదాయం చెబుతుంది. వాయుదేవుడు, అగ్నిదేవుడు, వరుణదేవుడు ఇలా. వీళ్ళంతా మొగవాళ్ళే. విద్యకు మాత్రం ఒక మహిళను నాయకురాలిని చేశారు. ఆమె సరస్వతి. అయితే ఇందులోని అసంబద్ధత ఏమంటే ఒక స్త్రీ నాయకత్వం వహిస్తున్న వ్యవస్థలోకి స్త్రీలకు ప్రవేశం లేకుండా చేయడం. ఈ అన్యాయాన్ని వీరబ్రహ్మంగారు అధిక్షేపాత్మకంగా సమాజం ముందు పెట్టారు. విమర్శలోంచే ప్రగతి. ఇవాళ మహిళలు చదువుకోగలుగుతున్నారంటే ఆ హక్కు గాలిలోంచి ఊడిపడలేదు. వీరబ్రహ్మంగారిలాంటివాళ్ళు చేసిన విమర్శలూ, నడిపిన ఉద్యమాలూ ఆ హక్కును సాధించాయి. మొన్న మొన్నటి దాక కూడా ఆడవాళ్ళకు చదువెందుకు ఉద్యోగాలు చేస్తారా ఊళ్ళేలుతారా అని అనేవాళ్ళు. శ్రీపాద సుబ్రహ్మణ్యంశాస్త్రిగారి 'తల్లిప్రాణం' కథలో ఒక తండ్రి ఇలాగే అన్నాడు. అంటే తల్లి తిరగబడి యేం నాకూతురికి ఉ ద్యోగంజెయ్యడానికి తెలివిలేదా, ఊళ్ళేలడానికి శక్తిలేదా అని తన వితంతుకూతురిని చదివించి మళ్ళీపెళ్ళి చేసింది. విద్య ప్రతిమనిషికీ ఉండవలసిన ఒక సహజమైన హక్కు. ప్రాథమిక హక్కు. ఆ హక్కును దేశజనాభాలో సగంగా (ఆకాశంలో సగం అన్నాడు చైనా కమ్యునిస్టు నాయకుడు మావో. ఇప్పుడు మనం అవనిలో సగం అంటున్నాం) ఉన్న మహిళలకు లేకుండా చేయడం తప్పు. భారతదేశ చరిత్రలో జరిగిన పెద్ద తప్పు విద్య అందరిదీ కాకపోవడం. రెండవది శ్రామికశక్తులను అంటరానివాళ్ళని ముద్రవేసి ఊరికిదూరంగా పెట్టి అవమానించడం. చరిత్రలో జరిగిన తప్పును భారతదేశం

గుర్తించి సరిదిద్దుకోడానికి చాలాకాలం పట్టింది. శతాబ్దాలు గడచిపోయాయి. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా వచ్చిన వత్తిడులకు తలవంచి 'ఇల్లాలి చదువు ఇంటికి వెలుగు' అని ప్రచారం చేసుకుంటున్నాం. ఆలస్యంగానైనా స్త్రీలకు న్యాయం జరగడం సంతోషాత్మకం. అయితే స్త్రీలను విద్యకు దూరం చేయడం చరిత్ర ప్రారంభం నుంచీ ఉన్నదా అంటే, ఉపనిషత్తుల కాలం నుండే ఈ నిషేధం ఉంది, అంతకుముందు లేదు అని ఒక అభిప్రాయముంది. ఉపనిత్తులకాలం నుంచి కూడా మహిళలు చదువుకొని ఉంటే భారతదేశం ప్రపంచంలోనే అగ్రగామిగా ఉండేది. ఎవరో కొందరు అజ్ఞానులైన స్వార్థపరుల తెలివితక్కువ నిర్ణయాన్ని ప్రశ్నించకుండా శిరసావహించడం వల్ల కలిగిన అనర్థం. ఈ అనర్థాన్ని ఇప్పడైనా గుర్తించి తప్పును సరిదిద్దుకోవడం ఆనందదాయకం. తల్లిని పిల్లలకు మొదటి గురువు అంటూనే ఆ గురువుకే విద్యలేకుండా చేస్తే ఆమె తనపిల్లలకు ఏమి నేర్పగలదు? అయితే ఇందుకు అపవాదంగా మనదేశంలోనే చరిత్రలో చదువుకున్న మహిళలు తమబిడ్డలకు విద్యనేర్పిన తల్లులు కనిపిస్తారు. అవన్నీ అరుదైన ఉదాహరణలే తప్ప సార్వజనీనమైనవికావు. తొంభైశాతంమందికి చదువు నిషేధింపబడిన మనదేశంలో అరదుగానైనా కొందరు చదువుకున్న మహిళలు ఉండడం విశేషమే. మైత్రేయి, గార్గి వంటి పేర్లన్నీ అరుదైనవే. వాళ్ళెంత పోరాటం చేశారో. ఒక స్త్రీనాయకత్వంలో ఉండే వ్యవస్థలోకి స్త్రీలకే నిషేధం విధించడంలోని అసంబద్ధతను గుర్తుచేసిన సామాజికసంస్కర్త వీరబ్రహ్మంగారికి నమస్కరించకుండా ఉండలేం. మనుమరాలిని తన వారసురాలిని చేసారు వీరబ్రహ్మం గారు. మీకు వీలయితే ఆచార్య కాత్యాయనీ విద్మహేగారి వ్యాసం 'పురాణేతిహాసాలలో స్త్రీవిద్య... జీవితం' చదవండి. 1983లో ఆమె రాసిన ఈ వ్యాసం "సంప్రదాయసాహిత్యం.. స్త్రీవాద దృక్పథం" అనే గ్రంథంలో ఉంది.

*నాల్గుజాతులకును నాగేటిమొనలోన*
*ప్రాణమున్నదంచు పలికినారు*
*ఇలను దున్నువారు బలభద్రులగుదురు*
*కాళికాంబ!హంస!కాళికాంబ!*

నాలుగువర్ణాలవారికీ శారీరకశ్రమతోకూడిన వ్యవసాయాభివృద్ధిలోనే జీవితమున్నదంటారు. భూమిని దున్నేవాళ్ళనే బలభద్రులని అంటారు. మానవశ్రమను బౌద్ధికశ్రమ, భౌతికశ్రమ అని రెండురకాలుగా విభజించారు మేధావులు. బౌద్ధికశ్రమ సమాజాభివృద్ధికి అవసరమైన ఆలోచనలను, ప్రణాళికలను రూపొందిస్తుంది. శారీరకశ్రమ మానవజీవితం సుఖమయమూ, శాంతమయమూ, ఆనందమయమూ కావడానికి అవసరమైన వస్తువులను ఉత్పత్తి చేస్తుంది. అంతమాత్రంచేత వీటిమధ్య ఎక్కువతక్కువలు లేవు. ఇవిరెండూ విరుద్ధశక్తులు కావు. ఒకదానిపై ఇంకొకటి ఆధారపడినవే. నిజానికి ప్రతిపనిలోనూ ఈ రెండూ కలిసే ఉంటాయి. ఇంజనీర్లూ డాక్టర్లూ ఉపాధ్యాయులూ వంటివారు బౌద్ధికశ్రమకూ! కార్మికులూ కర్షకులూ భౌతికశ్రమకూ ప్రతినిధులు. అయితే వర్గసమాజంలో, విభజిత సమాజంలో ప్రజలందరికీ సమానజీవితముండదు. అల్పసంఖ్యాకులతో నిండిన బౌద్ధికవర్గం అధికసంఖ్యాకులతో కూడిన భౌతికవర్గంపైన పెత్తనం చెలాయిస్తుంది. తాను గొప్పదనీ భౌతికశ్రామికవర్గం తనకన్నా తక్కువదని భావిస్తుంది. హీనంగా చూస్తుంది. ఏ వర్గం శ్రమమీద ఆధారపడి తాను జీవిస్తున్నదో దానిని అవమానిస్తుంది. ఈ అన్యాయాన్ని వీరబ్రహ్మంగారు ఈ చిన్నపద్యంలో విమర్శించారు. ఏ రకమైనశ్రమ చేసేవాళ్ళకైనా వ్యవసాయంద్వారానే ప్రాణం నిలబడుతుందని గుర్తుచేశారు. బ్రహ్మంగారి కాలానికే బౌద్ధికశ్రామికులలో ఒకవర్గం విశ్రాంతివర్గంగా తయారయింది. అది పరాన్నభుక్కుగా రూపుదిద్దుకుంది. ధర్మం, సనాతనం, దైవం, జన్మ, కర్మ వంటి మాటలతో అజ్ఞానంతోకూడిన అహంకారంతో అత్యధికులైన శ్రామికజనంమీద ఆధిపత్యం సంపాదించింది. సంప్రదాయ విజ్ఞానాన్నికూడా శాస్త్రీయంగా తెలుసుకోకుండా చిలకపలుకులవంటి వినికిడి మిడిమిడి జ్ఞానంతో ప్రజలను భయపెట్టి పబ్బం గడుపుకోవడం మొదలుబెట్టింది. నాల్గవ అయిదవవర్ణాల ప్రజల శ్రమతో బతుకుతూనే వాళ్ళను హీనులుగా నీచులుగా చూచే దుర్మార్గం దాపురించింది. మహిమలపేరుతో మహిమాన్వితులపేరుతో రకరకాల వేషాడంబరాలతో శ్రమచెయ్యకుండా పొట్టనింపుకునే దుర్మార్గం ప్రబలిపోయింది. దీనిని బ్రహ్మంగారు గుర్తించారు. అందుకే ఈ చిన్నపద్యంలో ఆ విశ్రాంతివర్గానికి చురకవేశారు. శ్రామికవర్గానికి పతాక ఎత్తారు. 'నాగేటిమొన' ఎంత అందమైన తెలుగు మాట! నాగలికర్రు అని అర్థం. నేలలోకి కర్రు దిగితేనే నోట్లోకి మెతుకులు దిగేది. నాగలికర్రు నేలను చీలుస్తుంది. నేలను పంటకు సిద్ధం చేస్తుంది. అందువల్ల మానవజాతి

ప్రాణమంతా నాగలికర్రలోనే ఉంది. అంటే రైతులోనే ఉంది. నాగలివెూన రైతుకు ప్రతీక. వడ్రంగమూ వ్యవసాయమూ తెలిసిన తాత్త్వికకవి గనక బ్రహ్మంగారు ఈ మాట అనగలిగారు. భూమిని దున్నేవాళ్ళను బలభద్రులన్నారు. బలరాముడు శ్రీకృష్ణునికి అన్న. ఆయన ఆయుధం నాగలి. హలాయుధుడని అందుకే అంటారు. ఆయన వ్యవసాయ సంస్కృతికి ప్రతీక. పొలాలనన్నీ హలాలదున్నీ ఇలాతలంపై హేమం పిండగ....అన్నారు శ్రీశ్రీ. బ్రహ్మంగారు శ్రామిక జనపక్షపాతి. సేద్యం దండగ, వరి పండిస్తే ఉరి వంటి బాధ్యతారహిత ప్రేలాపనలు పలికేవాళ్ళు బ్రహ్మంగారిని చదువుకోవాలి.

***రూపరహితునకును రూపమ్ముగల్పించి***
***కర్మకాండ పెంచి కలుషమతులు***
***ధర్మమార్గములను ధ్వంసమ్ము చేసిరి***
***కాళికాంబ! హంస! కాళికాంబ!***

దైవభావన అత్యంతప్రాచీనకాలంలో ప్రకృతిలో జరిగే పరిణామాలు తెలుసుకునే జ్ఞానం లేనికాలంలో పుట్టింది. ప్రకృతిలో జీవిస్తున్న మనిషి నిరంతరం ప్రకృతిని అర్థం చేసుకుంటూ, ప్రకృతితో స్నేహం చేస్తూ, అవసరమైనపుడు ఎదిరించి పోరాటం చేస్తూ వచ్చాడు. సూర్యచంద్రులు వస్తున్నారు, పోతున్నారు. వెలుగు, చీకటి వస్తున్నాయి పోతున్నాయి. కరువు, వర్షం వస్తున్నాయి పోతున్నాయి. చెట్లు పూలుపూస్తున్నాయి, కాయలుకాస్తున్నాయి, పండ్లుమాగి రాలిపోతున్నాయి. నేలమీద పడిన గింజ మొలకెత్తి మానౌతున్నది. జంతువులలో కొన్ని మనిషితో స్నేహం చేస్తున్నాయి, కొన్ని మనిషిని ఎగబడి చంపుతున్నాయి. ఇవి ఎలా జరుగుతున్నాయి? ఎందుకు జరుగుతున్నాయి? ప్రాచీనమానవునికి అర్థం కాలేదు. తనకన్నా ఏదో బలమైన శక్తి ఉండి వీటిని చేయిస్తున్నది అనుకున్నాడు. తనకన్నా బలమైంది కాబట్టి దానికి ఒదిగి ఉండాలనుకున్నాడు. ఈ రకంగా దైవభావన అజ్ఞానంలోంచి, భయంలోంచి పుట్టింది. దైవభావన కలిగిందేగానీ దానికి పేరు పెట్టలేదు. ఊరు లేదు. రూపం కల్పించలేదు. పూజలు లేవు. మహా అయితే దండంపెట్టి ఉంటాడు. ఇదంతా ప్రకృతివైపరీత్యాలనుండి తననుతాను రక్షించుకోడానికే. గణవ్యవస్థ ఏర్పడేసరికి రాళ్ళను దేవుళ్ళుచేసి రూపం కల్పించాడు. బలివిధానం మొదలయ్యింది. రాచరిక వ్యవస్థ ఏర్పడేసరికి దైవభావన మతరూపం ధరించింది. దైవం దేవుళ్ళయింది. గుళ్ళు, గోపురాలు, మడులు, మాన్యాలు ఏర్పడ్డాయి. ధర్మకర్తలు, పూజారులు పుట్టుకొచ్చారు. దేవుళ్ళచుట్టూ సంపద చేరింది. కర్మకాండ మొదలయ్యింది. పూజలు అభిషేకాలు అర్చనలు ఊరేగింపులు వాహనాలు ఉత్సవాలు మొదలయ్యాయి. భక్తుల కోరికలు తీర్చడం దేవుని బాధ్యతైంది. మొక్కుబడులు హుండీలు పుట్టుకొచ్చాయి. దేవుడు వ్యవస్థరూపం ధరించాడు. ప్రయాణ సౌకర్యాలు పెరుగుతున్నకొలదీ దైవకార్యాలూ కర్మకాండలూ బలిసిపోయాయి. దైవంచుట్టూ స్వార్థపరశక్తులు చేరాయి. భక్తికన్నా దేవుళ్ళసంపద ప్రధానం అయిపోయింది. జనం పెరిగేకొలదీ కొత్తకొత్త కార్యక్రమాలు. మనిషి అవసరాలకు దేవుళ్ళదయకు మధ్య ముడుపుల హుండీలకానుకల ఒప్పందం కుదురుతున్నది. ఈ కర్మకాండమీద వీరబ్రహ్మంగారు విమర్శ పెట్టారు. రూపంలేని దేవునికి రూపం కల్పించడంలోని రాజకీయాన్ని ఎత్తిచూపారు. భక్తిస్థానాన్ని కర్మకాండ ఆవరించడాన్ని విమర్శించారు. ఇది కలుషమతులైనవారి దుర్మార్గమని, ఇది ధర్మాన్ని నాశనంచేసిందని అభిప్రాయపడ్డారు. ఇవాళ దేవస్థానాలు వివాదాలలో చిక్కుకుని బజారున పడడం చూస్తున్నాం. దేవాలయాలు, ఆధ్యాత్మికకేంద్రాలు రాజకీయకేంద్రాలు అయిపోవడం చూస్తున్నాం. ఇదంతా ఎందుకు జరుగుతున్నది. భక్తిస్థానాన్ని కర్మకాండ ఆక్రమించుకోవడంవల్ల. వీరబ్రహ్మంగారి దృష్టిలో కర్మకాండ ధర్మహాని. ఇప్పుడు అదే నాయకత్వస్థానంలో ఉంది. ఈనాటి పాలకులూ, చీటికిమాటికి ఆగమశాస్త్రాలను ముందుకు నెట్టే పూజారులూ, గుళ్ళచుట్టూ ఆవరించే ధర్మకర్తలూ భక్తులుకూడా వీరబ్రహ్మం గారిని అధ్యయనం చేస్తే మతాల గుడుల హడావిడి తగ్గిపోతుంది. దేవుడు ఉన్నదీ లేనిదీ అలాఉంచి చూస్తే మతమౌఢ్యం తగ్గిపోతుంది.

***గాఢతమములైన మూఢవిశ్వాసాల***
***జలధిలోన మునుగు జనులకెల్ల***
***స్వేఛ్ఛగోరువాడె సిద్ధుండు బుద్ధుండు***
***కాళికాంబ! హంస! కాళికాంబ!***

పోతులూరి వీరబ్రహ్మంగారి కాలంనాటికే మతం దాని మూలతత్వాన్ని కోల్పోయి మౌఢ్యంగా మాత్రమే మిగిలిపోయింది. సోమరిపోతులు, వంచనాశీలురు, విచిత్రవేషధారులు, క్షుద్రక్రీడాపరాయణులు, పేదల అమాయకుల జీవితబాధల్ని సొమ్ముగా మార్చుకునే గారడీ

## కవిత

# ఉషోదయం సిగ్గుపడుతోంది

- పొత్తూరి సుబ్బారావు
9490751681

ఈ ప్రపంచంలోకి
ప్రతిరోజూ వచ్చి
దినచర్యకుపక్రమించటానికి
ఉషోదయం సిగ్గుపడుతోంది
వినకూడనివి, కనకూడనివి
తన కిరణాలపై విరగపడి
కన్నీటి రేఖలనద్దుతాయోనని
నవమాసాలు మోసిన తల్లీ
నవమాసాలు నిండని పాపపై
అదేమిటో!వినకూడని మాట
అత్యాచారమట!
అదొక పైశాచిక దాడి
ప్రవీణుడట!
దేంట్లో లేకపోయినా
దీంట్లో సాధించినట్లున్నాడు
కామాంధకారాన్ని ఒళ్ళంతా కప్పుకున్నవాడికి
శ్వాస, ధ్యాస, ఆలోచనంతా అదేకదా!



పసితనపు సోయగంపై
విషక్రీడతో విజృంభించేవాడికి
సభ్యత, జనవాహిని ఎక్కడ కనపడుతుంది
సమాజమంతా కళ్ళు తెరిచి హూంకరిస్తే
అతనొక నిందితుడైనాడు
నవమాసాలకే ఉరిశిక్షపడిందనే
ఆనందోత్సాహాల నడుమ
ఉషోదయం మళ్ళీ చిరునవ్వు చిందిస్తున్నది
ఆ నవ్వు ఎంతకాలం?
అందరికన్నా నేరగాళ్ళ శిక్షలకే
అవకాశాలెన్నోవున్నాయి
ఈ న్యాయవ్యవస్థలో
అంతిమ తీర్పుకింకా
ఎదురుచూడాల్సిందేనేమో! ♦

---

గాళ్ళు మతాన్ని తమ ఆధిపత్యంలోకి తెచ్చుకున్నారు. మతమే మానవ జీవితాన్ని పరాయీకరిస్తుంది. అలాంటిది బ్రహ్మంగారి కాలానికి తానే పరాయీకరణకు లోనైంది. స్వార్థపరుల డాంబికుల చేతిలో బందీ అయింది మతం. రాచరికవ్యవస్థ బలహీనపడుతున్నది. రాజులు ప్రజలకు మధ్య సంబంధాలు విచ్ఛిన్నమౌతున్నాయి. ఈ ఖాళీని ఆధ్యాత్మికత ముసుగులో వేషాడంబరులు సొంతం చేసుకున్నారు. మూఢనమ్మకాలను ప్రచారంచేస్తూ ప్రజల్ని భయకంపితులను చేస్తున్నారు. అశాస్త్రీయమైన కర్మకాండలతో ప్రజల శ్రమను ఈ స్వార్థపరులు, విలాసజీవులు దోచుకుంటున్నారు. ఈ దుర్మార్గమైన వ్యవస్థమీద తీవ్రమైన విమర్శచేశారు బ్రహ్మంగారు. బ్రహ్మంగారు ఏ దొంగలను ఏ సోమరిపోతులను విమర్శించారో వాళ్ళసంఖ్య ఇవాళ ఇబ్బడిముమ్మడిగా పెరిగిపోయింది. తమాషా ఏమిటంటే వీళ్ళకు పాలకుల అండ దొరకడం. మూఢవిశ్వాసాలు అనే సముద్రంలో మునిగిపోతున్న ప్రజలను బయటికి లాగేవాడే సిద్ధుడు తప్ప ప్రజల్ని ఇంకా మౌఢ్యంలోకి నెట్టేసేవాడు సిద్ధుడు కాడు అన్నారు బ్రహ్మంగారు. మూఢనమ్మకాలుకూడా చిన్నచిన్నవి కావు గాఢతమమైనవి. అంటే చాలాప్రమాదకరమైనవి. సిద్ధులుగా ఉన్నవాళ్ళు నిజంగా వాళ్ళు సిద్ధులైతే వాళ్ళు సమాజాన్ని సంస్కరించాలి. ప్రజల్ని ఉన్నతస్థితికి తీసుకుపోవడానికి కృషిచేయాలి తప్ప మౌఢ్యంలో ఉన్నవారిని మరింతమూఢులుగా మార్చకూడదు. సిద్ధుడు అంటే మామూలు మనుషులకు సాధ్యంకాని శక్తులను సంపాదించిన వాడనికదా అర్థం. ఆ శక్తులను సాధించడానికి అవసరమైన అన్ని సదుపాయాలూ కల్పించేది సామాన్యప్రజలే. అందువల్ల సామాన్య ప్రజలశ్రమతో సాధించిన శక్తులను సిద్ధులు సామాన్యుల బతుకులు మెరుగవ్వడానికి ఉపయోగించాలి. అంతేతప్ప ప్రజలను మరింత మౌఢ్యంలోకి నెట్టివేయరాదు. ఆనాటి సిద్ధులు చేయవలసింది ప్రజల్ని మౌఢ్యంలోంచి బయటికి లాగడం. కానీ వాళ్ళుచేసింది ప్రజల్ని మరింత మూఢులుగా మార్చడం. ఈ తలక్రిందులు వ్యవస్థ మీద బ్రహ్మంగారు దాడిచేశారు. చాలామందితో వాదించారు. పోరాడారు. ఆయన పోరాడినశక్తులు బలహీనమైనవి కావు. అవి – ఇవాళ ఇంకా బలపడి రాజ్యంలోకి చొచ్చుకు వచ్చాయి. అవి చేయని అకృత్యాలులేవు. అందువల్ల ఇవాళ ఊరూరికీ ఒక బ్రహ్మంగారు కావాలి.

*(ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన రాచపాళెం పుస్తకం 'వీరబ్రహ్మం పద్యాలు' నుండి)* ♦




# తత్వాల కాలజ్ఞాని ( రూపకం )

- తెలకపల్లి రవి

## 1

సత్యాల కాలజ్ఞాని
తత్వాల రాజధాని
ఉత్పత్తి శక్తి వాణి
సామాన్య జనుల మౌని ॥సత్యాల॥

వీరబ్రహ్మాం
పలికిన ధర్మం
మారే సమాజ మార్గం
జనులకు మహత్వ రూపం ॥సత్యాల॥

రాజులు మారిరి
రాజ్యం పోయెను
స్వాములెందరో
భూమిని కలిసిరి
వీరబ్రహ్మాం పదము నిలిచెను
తరతరాల ప్రజ నోట పలికెను ॥సత్యాల॥

మండిపడిన పండితులకు
మహా మహా ప్రశ్నలేసి
కొలిచినట్టి శిష్యకోటి
కొత్త నీతి బోధ చేసి
చెరిగిపోని ముద్ర వేసి
చరిత్రగా మిగిలినాడు ॥సత్యాల॥

## 2

రాయలోరి వంశఘనత
రాలిపోతున్న వేళ
మహ్మదీయ సుల్తానులు
మరి మరి తలపడు సమయం
తెల్లవాళ్ల తొలి అడుగులు
మోపుతున్న క్షణమున ॥సత్యాల॥

పాలెగాళ్ల పెత్తనాలు
పీడించే ఘట్టమందు
చాందసాల స్వాములంత
చెలరేగిన చీకటిలో
చేతిపనుల పంచాణం
బతుకులు వెత పాలైనప్పుడు ॥సత్యాల॥

స్వర్ణకారుల కుటుంబమందున
పుట్టాడదిగో వీర బ్రహ్మాం
శిథిల సమాజపు హాహాకారం
విన్నాడయ్యా వీరబ్రహ్మాం ॥సత్యాల॥

పరిసరాలు గమనించాడు
కారణాలు శోధించాడు
వేదన పీడన మూలాలేవో
వేగంగా కనుగొన్నాడు ॥సత్యాల॥

## 3

అన్నమయ్య వేమన్న వారసుడు
అక్షర సత్యాల పాట లల్లాడు
మాటలతోటి ఆగిపోకుండ
మఠములు స్థాపించాడు
బ్రాహ్మణ స్వాముల తరహాలోనే
తాను తత్వం చెప్పాడు ॥సత్యాల॥

**నేపథ్యంలో..**
చెప్పలేదంటనగ బోయేరు
నరులార గురుని
చేరి మొక్కితె మోక్షమందేరు
చెప్పలేదంటనను బొయ్యేరు
తప్పదిదిగో గురుని వాక్యం
తప్పుదోవన పోవు వారు
చప్పరించి మింగు శక్తులు ॥చెప్పలేదంటనగు॥

***ఇళ్ల దగ్గర అద్దె బోర్డులు***
***వెజిటేరియన్స్ ఓన్లీ, హిందూస్ ఓన్లీ***
***వీరబ్రహ్మాం –***

ఏ కులమని
నన్నివరములడిగితె
ఏమని చెప్పను లోకులకు
లోకులకు పలు కాకులకూ **(కాకులు కావ్ కావ్)**
అందరిలోపల బ్రహ్మ ఒకడని
అర్థం కాని మూర్ఖులకు //ఏ కులమని//

4

***ఒక ప్రేమ జంట***
ప్రేమ గొప్పదని చెప్పారే
ప్రేమకథలు వినిపించారే
మనసులు కలిసిన మా జంటలను
కులాలు ఎందుకు అడిగేరు?
గోత్రాలెందుకు వెతికేరు?

***ఇంతలో పరువు హత్య***
కండకావరమున పిన్న పెద్దని
కన్ను గానక గర్వమున
కన్న బిడ్డలను కత్తితొ నరికిన
కర్కశమా నీదే కులము?
రాక్షసమా నీ కులము?

***వీరబ్రహ్మం ప్రవేశం***
చెప్పలేదంటనను బొయ్యేరు
మొప్ప తనమున మోసపొయ్యేరు
అదిగాక కొందరు
గొప్పతనమున గోస మీరేరు

***దొంగ స్వామి ఆశ్రమం***
ఓం సచ్చిదానంద
ఈ సర్వం గోవింద
స్వామి చిన్మయానంద, ఆశారాం బాపు, డేరాబాబా
***మహిమలు మాయలు, హడావుడి..***
***వీరబ్రహ్మం ప్రవేశం***
చిల్లర రాళ్లకు మొక్కుతు వుంటె
చిత్తము చెదురా ఒరే ఒరే
చిత్తము నందున చిన్మయ రూపుని
చూచుచునుండుట సరే సరే //చిల్లర రాళ్లకు //

***ఇంతలో ఎవరో ఉపావాస దీక్షలో వారు పడిపోతారు***
ఒక్కపొద్దులని ఎండుతు వుంటె
వనరు చెడునురా ఒరే ఒరే
ఏకమైన ఆ వైభవ మూర్తిని
చూచుచు నుండుట సరే సరే //చిల్లర రాళ్లకు //

***పుష్పగిరి ఆశ్రమం బోర్డు. స్వాములు కూచుని వుంటారు. వీర బ్రహ్మం బండిలో వెళుతుంటాడు***
పవిత్ర అగ్రహారం
పండితుల నిత్య నిలయం
బండెక్కితావ నీవు
దిగి శరణు వేడు మమ్ము
ఆక్షేపించిరి అక్కడ స్వాములు
వెళ్లగక్కిరి అహంభావములు

***వీరబ్రహ్మం బండిలోంచి దిగుతాడు***
బ్రహ్మమేదో తెలుపరయ్య బ్రాహ్మణులారా
పరబ్రహ్మమేదో తెలుపరయ్య బ్రాహ్మణులారా
రేపు మాపు సంధ్యవారిచి రేచించి వోంకారమునకు
పొద్దెరిగి పొద్దున లేచి పొద్దు చెప్పే పంచాంగ సుద్దులందు
బ్రహ్మమేదో చెప్పుదయ్య బ్రాహ్మణులారా
చదివినందుకు మోక్ష సాధనంబేమి
చదువకుండిన జనులు సాధింపలేరా
సకలంబు బ్రహ్మమని చాటంగ శ్రుతులందు
ఒకచోట లేదనుచు వగవంగ వలెనో //బ్రహ్మమేదో//

***పండితులు ఓడిపోతారు***
అంత గర్వమా తగదండి
మనుషులమంతా ఒకటండి
సాటి వాళ్లను తక్కువ చేసె
సంప్రదాయమును వీడండి
***నవాబుల రాజ్యం***
సవాలు ఇదిగో బ్రహ్మమయా
సత్యం నీలో వుంటే చూపు
అందరి మన్నన పొందిన వాడవు
చేతకానిచో పాటలు ఆపు //సవాలు ఇదిగో//

నవాబు గారు వినరండి
నాలో నీలో బ్రహ్మం ఒకడే
మనుషులమంతా ఒకటేనండి
మంచిమార్గమున పయనించండి //నవాబు గారూ//

**దూదేకుల సిద్దప్పను శిష్యుడుగా చేసుకుంటాడు**

**తెల్లవారి ప్రవేశం, దొరలు ఫాదరీలు**

*హరగోవింద గోవింద శివగోవింద గోవింద*
*శ్వేత ముఖులు ధూమ శకటముల కల్పించి*
*భూతలమ్మున ఇనుప కమ్ములపైన*
*సూత్రమెరిగి పశ్చిమోత్తర దిశలందు*
*ఆత్రమ్ముగా నడిపించేరు*

**ఫాదరీలు, మౌల్వీలు, స్వాములు కీచులాటలు**

*ఐదువేలమీద బహుధాన్యలోపల*
*అన్ని జాతులొక్కటయ్యేనమా*
*అవనిలోగల పేద ధనవంతులొకటవు*
*యోగము కూడా వచ్చేనిమా ॥హరిగోవింద॥*
*వీర భోగ వసంత రాయలే*
*తగు తరుణమందున వచ్చేనిమా ॥హర గోవింద॥*

**బ్రిటిష్ వారి దెబ్బకు వృత్తులు శిథిలమవడం.. శ్రమజీవుల బాధలు**

*నడివీధి యందునా నాటింతురా కొల్మి*
*నడిమండలంబందు నాటింతురా*
*నా సంధి తెలియని బద్దె కుక్కల బట్టి*
*బంధించి బాకుల కుమ్మింతురా ॥హర గోవింద॥*

**స్త్రీలపై హింస, పెత్తనం**

*స్త్రీపురుషులను తెగలు సృష్టిలోపల నుంచి*
*రూపులై వున్నవి రూఢిగాను*
*తనను హింసించగా తప్పు చేస్తున్నావు*
*తల్లి అని తెలుసుకో తత్వమే చెప్పేను ॥హర గోవింద॥*
*నాదు కూతురు బిడ్డ ఈశ్వరమ్మనె నేను*
*వారసత్వం అప్పగించేను ॥హర గోవింద॥*
*కాలం మారును తెలియండి*
*కాలజ్ఞానం అరయండి*
*ఇప్పటిలాగా రేపు వుండదు*
*రేపు కూడా ఆ మాపు చూడదు ॥హర గోవింద॥*

**వీరబ్రహ్మం శిష్యులు పెరిగిపోతారు. తత్వాలు పాడుతూవుంటాడు.**

*నందామయ గురుడ నందామయా*
*వీరబ్రహ్మం మాట విందామయా*
*చెప్పలేదంటనగ బోయేరు*
*నరులార గురుని*
*చేరి మొక్కితె బతక నేర్చేరు*
*ముందు వెనకలు గానకున్నారు*
*మూర్ఖులై భువి తిరుగుచున్నారు*
*కండకోవతో మంచిచెడ్డలు*
*తెలియకుండా హద్దుమీరి*
*సాటిమనిషుల హింసపెట్టేరు*
*దేవుణ్ని కూడా స్వార్థమునకై వాడుకుంటారు*
*మతము పేర మంట పెట్టేరు*
*మనసులోపల ద్వేషమూదేరు ॥చెప్పలేదంటనగ॥*

**ధర్నాలు ప్లకార్డులు నినాదాలు**

*నందామయా గురుడ నందామయ*
*వీరబ్రహ్మం మాట నిజమౌనయా*
*మోసాలు పెరిగేను ద్వేషాలు మరిగేను*
*దేశమే కల్లోలమయ్యేనయా*
*చేతివృత్తులు కూలి*
*సేద్యనాద్యము పోయి*
*పల్లెలే గోడుమని ఏడ్చేనయా నందామయా*
*అవినీతులే పెరిగి అక్రమాలే జరిగి*
*ఆల్లకల్లోలమే చూసేమయా*
*అర్హతలు లేనోళ్లు అందలాలెక్కగా*
*అధర్మమంతటా ప్రబలేనయా*

**నోట్ల రద్దు, ఆర్థిక సంక్షోభం, ఉద్దీపన పథకాలు**

*కష్టపడి పెంచిన ఈ దేశ సంపద*
*కంపెనీలకు కానుకయ్యేయా*
*చేయగా పనిలేదు వచ్చినా నిలవదు*
*బతుకులే చితుకులై మందేనయా ॥నందామయా॥*

**వీరబ్రహ్మం ప్రవేశం**

*పాతకూలూ మంట కలిసేరు*
*పుణ్యాత్ములైన*
*సజ్జనులు సంతసించేరు*
*భూతలమ్మున నెన్నొ వింతలా పిమ్మట*
*నీతి నిజములు వెల్లివెరిసేను*
*అందాము కలిసి*
*వీరవసంత రాయుడంటే మరి*
*ఈ దేశ ప్రజలు గాకింకెవరయా*
*బ్రహ్మమే చెప్పిన ధర్మాలు పాటించి*
*దేశాన్ని రక్షించుకుందామయా ॥నందామయా॥* ♦

# పురస్కారాలు

## సాహిత్య ప్రస్థానం సెప్టెంబర్ 2019 పురస్కారాలు

**ఆంధ్రప్రదేశ్ ముస్లింల చిత్రణ**
వ్యాసం: రూ.500/-
రచయిత: డా. ఇస్లావత్ భీమా నాయక్

**ఆపరేషన్ రావణ**
కవితకు : రూ. 500/-
రచయిత : బి. హేమామాలిని

■■■

కథకు డా॥ ఎద్దుల సిద్ధారెడ్డి స్మారక పురస్కారం,
వ్యాసానికి కర్లపాలెం రుక్మిణమ్మ పురస్కారం చెక్కులు ఈ రచయితలకు అందుతాయి

■■■

పాఠకులు తాము చదివిన కవితలు, కథలు, వ్యాసాలలో నచ్చినవి కారణాలతో సూచించవచ్చు. సీనియర్, ప్రసిద్ధ రచయితల రచనలు కాక ఔత్సాహికులను, ఇటీవల రాస్తున్నవారిని ప్రోత్సహించడమే ఈ పురస్కారాల ఉద్దేశ్యంగా గ్రహించగలరు. తగిన రచనలు లేనప్పుడు పురస్కారాలు ప్రకటించబడవు.

**- ఎడిటర్**

# అన్నంకుండ

- మార్ని జానకిరామ్‌చౌదరి
94403 38303

ఒకప్పుడు
తన కడుపు కాల్చుకుంటూ
అందరి కడుపూ నింపిన అన్నంకుండ
నేడు ఓటికుండగా మిగిలి
తనువెల్లా శిథిలమై
శిశిర పత్రంలా నేలచూపులు చూస్తోంది.
కడుపు చీల్చుకొచ్చిన మొలక
ఆకాశమంత ఎత్తు ఎదిగినా
జానెడు నీడ పంచటానికో
గుప్పెడు గింజలు రాల్చడానికో
లెక్కలేసుకొన్నప్పుడు
దిగులు ఊబిలో కూరుకుపోతున్న బాధ.
గాజుకంటిలో ఊరుతున్న నీటిని
రెప్పమాటున తాటిస్తూ
"ఆకలేస్తోందన్న" మాట
చీదరింపుల పెదవి విరుపుల మధ్య
గొంతు దాటక మునుపే
పూడుకుపోతుంది.
తడితేలిన కళ్ళకు
వెలుతురు కాటుక దిద్ది
చితికిన మనసుకు
అతుకులు వేసుకుంటూ
జ్ఞాపకాల నెమరును
లేపనంగా పూసుకొంటోంది



పొద్దువాలుతున్న వేళ
ఈకలు రాల్చిన దిగులు పక్షిలా
పడమటి కొండలకేసి
చూపు సారిస్తోన్న మనసు
ఆఖరి పిలుపుకోసం
వేగిరపడుతోంది
పేగు తెంచుకున్న పాశం
చిటికెడు ప్రేమను రంగరించి
గోరువెచ్చని స్పర్శతో
గుండె తడిమే రోజుకోసం
ఆరాటపడుతూనే ఉంటుంది...
పగిలిన ఆ "అన్నంకుండ"
గుప్పెడు మన్నుగా మారేవరకూ!

*(అక్టోబరు 1వ తేదీ "ప్రపంచ వృద్ధుల దినోత్సవం" సందర్భంగా)*

♦

**విశ్లేషణ**

# నాలుగు అస్తిత్వాలు - వాస్తవ జీవనశిల్పాలు

- డా॥ పి.సి. వెంకటేశ్వర్లు
9490164963




డా॥ శాంతినారాయణ

రాయలసీమ వెనుకబడి పోయిందనేది ఎంతోమంది నోట చాలా సంవత్సరాలుగా మనం వింటున్న మాట. వెనుకబాటుతనానికి కరవు, ఫ్యాక్షనిజం మాత్రమే ప్రధాన కారణాలుగా అనేకమంది రచయితలు తమ, తమ సాహిత్యాల్లో చూపించారు. అయితే శాంతి నారాయణ వెనుకబాటుతనంలో కనిపించని మరో నాలుగు చీకటికోణాలను నాలుగు నవలికల్లో నిక్షిప్తం చేశాడు. 1. వెట్టికి వెట్టి, 2. కంచం మీద కట్టడి, 3. నూర్జహన్, 4. రక్షక తడులు అనే నాలుగు నవలికల్లో నాలుగు విభిన్నమైన అంశాలతో రాయలసీమపై కపటప్రేమను ప్రదర్శించే వారిపై కొరడా ఝళిపించాడు. వర్తమాన సమాజంలో వాస్తవికతకు, వాగ్దానాలకు ఎంత వ్యత్యాస ముందో నిరూపించే ప్రయత్నం చేశాడు. ఇందులో ప్రాంతీయసమస్యలను వస్తువుగా తీసుకున్నప్పటికీ స్వతంత్ర భారతదేశంలో అనేక వెనుకబడిన ప్రాంతాల్లో ఇలాంటి ప్రజాజీవనమే కనిపిస్తుందనే వాస్తవాన్ని చెప్పాడు.

రచయిత రాసిన ప్రతి నవలికలోని ఇతివృత్తానికి ఆధారముంది. బలమైన వాస్తవికత వుంది. మూలాలు అనంతపురం జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో ఉన్నాయి. ఈ నాలుగు నవలికల్లోని ఇతివృత్తాలు అనంతపురం నేలపై కనిపించిన సజీవదృశ్యాలు. అక్కడక్కడ సన్నివేశ పరిపుష్టికోసం కొన్ని సర్దుబాట్లు జరిగి ఉండవచ్చునేమో కానీ, ప్రతిసంఘటన ఎక్కడో ఒకచోట జరిగిందని రచయిత స్వయంగా ధ్రువీకరించాడు.

శాంతినారాయణ రాసిన 'వెట్టికివెట్టి' అనే శీర్షిక కాస్త ఆలోచింపజేస్తుంది. 'వెట్టి' అనే పేరుపెడితే సరిపోతుంది కదా ! అనిపిస్తుంది. 'వడ్డీకి వడ్డీ' పదాన్ని నమూనాగా తీసుకుని ఈ నవలికకు శీర్షికగా ఎంచుకున్నాడు. అసలుకు వడ్డీ అనేది ఆధునిక కాలంలో చట్టబద్ధమైంది. అలాగే వడ్డీకి వడ్డీ కూడా అత్యాధునిక కాలంలో చట్టబద్ధమేనని అర్థమైపోతుంది. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ చట్టబద్ధత ముసుగులో వడ్డీలు కట్టలేక అసువులు బాస్తున్న సామాన్యుల జీవితాన్ని మనం ప్రతిదినం వార్తాపత్రికల్లో చూస్తూనే ఉంటాం. దానికి నాయకులు పరిష్కారం చూపించడంలేదు. ఈ వ్యవస్థలో వెట్టి నిర్మూలన అనేది రాజ్యాంగ స్ఫూర్తిలో భాగం. కానీ అది ఆచరణలో ఇంకా సంపూర్ణంగా సాధ్యంకాలేదు. కొన్ని ప్రాంతాల్లో తెరవెనుక నీలివర్ణ చిత్రంలా సాగిపోతూనే ఉంది. తెలంగాణ, రాయలసీమ ప్రాంతాల్లో ఇంకా ఎన్నో కుటుంబాలు ఈ వ్యవస్థలో మగ్గుతున్నాయంటే ఆశ్చర్యమనిపిస్తుంది. ఈ వెట్టే తప్పు అయినపుడు, దీనికి అదనంగా 'వెట్టికి వెట్టి' అనేది ఎంత దుర్మార్గం. ఈ ఆచారాన్ని అనంతపురం ప్రాంతంలో రచయిత పసిగట్టడం, దాన్ని నవలికగా రూపొందించడం ఆయనలోని పరిశోధనా తత్వానికి నిదర్శనం. దళిత వాడల్లో కొన్ని కుటుంబాలను భూస్వాములు వేలంపాట ద్వారా కొంతమొత్తానికి పాడుకొని, వారిచేత సంవత్సరం పొడవునా తమ పొలాల్లో తక్కువ కూలీతో చాకిరీ చేయించుకోవడం ఈ నవల్లోని కథావస్తువు. వెంకటాంపల్లిలోని దళిత ఉపాధ్యాయుడు ఓబులేసు ప్రేరణతో, డిగ్రీ చదువుతున్న నాగేంద్ర చురుకుదనంతో, కలెక్టర్ వంటి పాలకుల చేయూతతో ఆ గ్రామ దళితులను వెట్టినుంచి బయటేయడం ఈ నవల్లో ముగింపు.

శాంతినారాయణ ఈ నవలను ప్రారంభించడంలోను,

సన్నివేశాలను కూర్చడంలోను, పాత్రలను నడిపించడంలోను, వారిచేత అనంతపురం గ్రామ మాండలికాన్ని మాట్లాడించడంలోను ఎంతో శ్రద్ధ తీసుకున్నాడు. మొలకలపున్నమితో ఆరంభమయ్యే ఈ నవలలో దళితుల జీవితాల్లో పున్నమివెన్నెల పరిపూర్ణంగా చూపించి ముగించాడు. వెంకటాంపల్లి గ్రామంలో రెడ్డి, కమ్మ భూస్వాములదే పెత్తనం. వారు అగ్రకుల దురహంకారాన్ని ప్రదర్శిస్తూ, గ్రామమంతా తమ కనుసన్నల్లో ఉండేటట్లు చూసుకోవడం, పైస్థాయి నాయకులతో నిరంతరం సంబంధ బాంధవ్యాలు కలిగి ఉండటం, ఆ నాయకుల అండదండలతో ఎలాంటి ప్రభుత్వాధికారినైనా బదిలీలు చేయించడం, తమ గ్రామంలో ఏ దళితుడు ఉన్నత చదువులు చదువుకోకుండా జాగ్రత్తపడటం వంటి భూర్జువా లక్షణాలను కలిగిఉంటారు. తరతరాలుగా ఆ గ్రామ మాదిగలు ఆ భూస్వాముల ఇళ్ళల్లో, పొలాల్లో పనిచేస్తూ జీవితాన్ని గడపడం జరుగుతుంటుంది. ఆ ఊరికి టీచర్‌గా వచ్చిన ఓబులేసు కలెక్టర్ సాయంతో నాగేంద్ర, సరోజ, భవానీదేవి సహకారంతో భూస్వాముల ఆరాచకాలకు అడ్డుకట్ట వేస్తాడు.

ఈ నవల ప్రారంభంలో నుండి చివరి వరకు రచయిత తనకున్న రచనాశిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శిస్తూ వచ్చాడు. 'తొలికోళ్ళు కూస్తున్నాయి' అనే మొదటి వాక్యంలోనే ప్రతీకాత్మకతను చూపించాడు. మార్పుకు తొలికోడికూత చిహ్నం. ఆ మార్పు ఆ గ్రామ దళితవాడలో మొదలైందనేది ఆ వాక్యోద్దేశం. అంతేకాదు. ఒక్కరోజులో ఏ సమాజంలోనూ మార్పు తీసుకరాలేము. దానికి కొన్ని రోజులపాటు కఠోరశ్రమ చేయవలసి ఉంటుంది. ఒక్కోసారి ఆ మార్పుకోసం ప్రయత్నించే వ్యక్తి ఓడిపోవచ్చు. మళ్ళీ కొన్నాళ్ళకు మరికొందరు వ్యక్తులు అదే మార్గంలో పయనించి మార్పుకోసం తమ ప్రయత్నాన్ని ఆరంభిస్తారు. అదే విషయాన్ని రచయిత "గాలి ఆగి ఆగి వీస్తుంది. ఒక్కొక్క సారి చుట్టగాలిగా మారుతూ ఉంది. మరికాసేపటికి ఎక్కడో దాక్కొని మౌనం నటిస్తున్నట్లుంది!" అని అంటాడు. వెంకటంపల్లి దళితుల్లో ఆరంభమైన పోరాటతత్వాన్ని సూచిస్తూ, నర్మగర్భంగా పలికిన మాటలివి. ఈ మాటలకనుగుణంగానే ఈ నవలలో ఓబులేసు అనే గాలి భూస్వాములకు వ్యతిరేకంగా వీయడం ప్రారంభించింది. అదే గ్రామంలో వెట్టికుటుంబం నుండి డిగ్రీ చదువుతున్న నాగేంద్ర మౌనంగా గ్రామప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి ఒక్కోసారి చుట్టు గాలిలా మారుతున్నాడనేది రచయిత ప్రదర్శించిన శిల్పమర్మపు వాక్యాలుగా అర్థంచేసుకోవాలి. నవల్లోని పాత్రల ద్వారానే సమాజతత్వాన్ని చెప్పించడం శాంతి నారాయణకు తెలిసిన విద్య. గ్రామంలో ఎలాంటి పరిస్థితి ఉందో, ఎలాంటి మార్పు కావాలో రచయిత నేరుగా చెప్పకుండా, పాత్రల ద్వారా మాట్లాడించకుండా, బైరాగిపాడే పాటలో ఆ భావాలన్నింటిని ఇమడ్చడం కొత్తరకమైన ప్రయోగం. కులాన్ని, భాషను, భావాన్ని, ఆహారాన్ని, పాటల్ని, మాటల్ని నిరోధించే తత్వం కలిగిన వ్యవస్థలో మగ్గుతున్న వారు ఎంతోమంది ఉన్నారనే విషయాన్ని బోధపడేటట్లు బైరాగిచేత పాటకట్టించాడు. వాటిని రామిరెడ్డి, రంగయ్యనాయుడు వంటి భూర్జువాలు నిరోధిస్తున్నారనే విషయాన్ని కథాగమనం ద్వారా తెలియజేశాడు.

వెంకటాంపల్లి మాదిగవాడలో ఉన్న మొత్తం కుటుంబాలను ఆ గ్రామంలోని భూస్వామి కుటుంబాలు పంచుకోవడాన్ని రచయిత కళ్ళకుకట్టినట్లు చిత్రిస్తాడు. వారి కుటుంబ ఖర్చులు కోసం ముందుగా చేసిన అప్పును ఆధారంచేసుకొని, ఆ కుటుంబాలను తమకు ఇష్టంవచ్చిన మొత్తానికి వేలంపాటలో పాడుకోవడాన్ని ఒక సంప్రదాయంగా రూపొందించడం వెనుక దాగివున్న కుట్రను రచయిత బహిర్గతం చేస్తాడు. కొన్నిప్రాంతాల్లో అగ్రవర్ణ భూస్వాములు కూలీలను పంచుకోవడం కనిపిస్తుంది. ఇక్కడ కుటుంబాలను ఒక సంవత్సరానికి పంచుకోవడం ఆటవిక న్యాయంగా అనిపిస్తుంది. "ఈ అయిదిండ్లకు నా పాట ముప్ఫై వేలు" అంటూ రామిరెడ్డి చెప్పడం, "పోటీలేకుండా ఈ గుంపును మాకొదిలిపెడితే నా పాట యాభైవేలు" అని రంగయ్య నాయుడు అనడం వెనుక వాళ్ళు మనుషులుగా కాకుండా జీవమున్న గుంపులుగా చలామణి అవుతున్నారనే వాస్తవాన్ని రచయిత తెలియజేశాడు.

ఎప్పుడూ ఎదురుచెప్పని ఆ గుంపులో నుండి మొదటిసారి గొంతు వినబడింది. పుల్లన్న వేలంపాట మధ్యలో "యెవరు యెవ్వరి పనులకు పోవల్లనుకుంటే పొయ్యేటట్లు ఏర్పాటుచేసి, కూలి ఖరారుచేస్తే బాగుంటాది గదయ్యా" అని ధైర్యం చేసి అనడంలో అగ్రవర్ణ అధినాయకత్వంలో ఆలోచన మొదలైంది. అయినా తరతరాల అహంకారం వారిమాటల్ని లెక్కపెట్టదు గదా! "యాడో పనులకు పోయొచ్చి ఈ ఊర్లో ఉంటామంటే కుదరదు. ఈడ మీకు తాగేకి, కడుక్కుండేకి నీళ్ళు, జల్సాగా తిరిగేకి రోడ్లు, రేత్రిపూట గడిపేకి కరెంటు ఉద్దరగా రాలే" అని రామిరెడ్డి అనడం వెనుక వారి నియంతృత్వపోకడలు అర్థమవుతాయి. స్వతంత్ర భారతంలో కరెంటు, రోడ్లు, నీళ్ళు ఎవరికి సంబంధించినవి అనే స్పృహ కూడా లేని దళితజనం రాయలసీమలో ఇంకా ఉన్నారని చెప్పడం రచయిత ఉద్దేశం. అలాంటి వారిచేత సంప్రదాయాన్ని సాకుగా చూపి, బాకీలను

కారణంగా చూపించి, తరతరాలుగా వెట్టి చేయించుకోవడం ఎంత హేయమైనచర్యో పాఠకులకు అర్థమయ్యేలా కలెక్టర్ పాత్ర ద్వారా చెప్పించడం రచయిత శిల్పనిర్మాణ చాతుర్యంలో భాగం. ఈ దేశంలో కులాలమధ్య అసమానతలు ఉన్నాయని, సమానత్వం బూటకంగా కనిపిస్తుందని, దేశంలోని ప్రజలందరూ సోదరులంటూనే కొందరిచేత చాకిరీ చేయించుకోవడం ప్రజాస్వామ్య లక్షణానికి విరుద్ధమని కలెక్టర్ మాటల ద్వారా ప్రతిఫలింపజేయటంలో రచయిత వామపక్ష దృక్పథం అర్థమవుతుంది. అలాగే డిగ్రీ చదువుతున్న నాగేంద్ర నీతికి కట్టుబడి, తన చెల్లిపెళ్ళికి చేసిన అప్పుతీర్చడం కోసం చదువు మానేసి, వెట్టికూలిగా జీవనం సాగించడం వెనుక వారిలోని ఉన్నత మనస్తత్వాలను చూపించడం రచయిత ఉద్దేశం. అంతేకాదు ప్రజల జీవితాన్ని మార్చేది సాటిమనిషే కానీ, విగ్రహాలు చూపించే కరుణ కాదని, మొక్కులు తీర్చడం వల్ల సమస్యలు పరిష్కారం కావని నాగేంద్ర చెప్పడం వెనుక భౌతిక వాదతత్వాన్ని రచయిత ధ్వనింపజేశాడు. అలాగే భూస్వామి కూతురైన సరోజ వామపక్ష భావాలు గల విద్యార్థి సంఘంలో పనిచేయడం వలన విశాలమైన ఆలోచన విధానం అలవడిందని చెప్పడం వెనుక రచయిత ఆలోచనా విధానం అర్థమవుతుంది.

వెంకటాంపల్లి గ్రామం దళితుల్లో వచ్చిన మలిదశ చైతన్యాన్ని సూచించడం కోసం 'మంటల్లో కాలుతున్న ఎండుమిర్చి, ఘాటు వాసనను' ఉపమానంగా తీసుకున్నాడు రచయిత. అగ్రవర్ణ మంటల్లో కాలిన దళితులు, తమ ఘాటును ఊరంతా తెలియజేసే సమయం వచ్చిందని చెప్పడం కోసమే ఆ పోలికను తీసుకున్నాడు. ఆ ఊరి మాదిగల కోపం, అధికారుల చొరవ ఆ గ్రామ అగ్రవర్ణపెద్దలను తలవంచేలా చేసిందని, నవలకు ముగింపు ఇచ్చాడు. అయితే మార్పును సహించలేని రామిరెడ్డి తన ఆస్తిని వదిలేసి ఊరు వదిలిపెట్టి వెళ్ళిపోతూ, అవకాశం దొరికినప్పుడు తిరిగి వస్తానని చెప్పడం వెనుక భూర్జువాలు అంతసులభంగా మార్పును అంగీకరించరనే సత్యాన్ని రచయిత వివరించాడు. భూర్జువాతత్వం పరిస్థితులు ఎదురుతిరిగినపుడు తనరూపాన్ని మార్చుకుంటుందే కానీ, మార్పును అంగీకరించదనే విషయాన్ని శాంతి నారాయణ తెలియజేశాడు. మారిన రూపానికి విరుగుడుగా ఎప్పటి కప్పుడు సామాన్య ప్రజలు చైతన్యవంతులు కావాలనేది ఈ నవలలో రచయిత సూచించిన ముంగిపుగా అర్థం చేసుకోవాలి.

శాంతినారాయణ 'కంచం మీద కట్టడి' నవలిక వ్యవసాయ వ్యాపారాలను మేళవించి రూపొందించబడ్డది. ప్లేటో చెప్పిన ఆదర్శరాజ్యం ఎలాంటి సులక్షణాలతో కనిపిస్తుందో రచయిత ఈ నవలికలోనే సృష్టించిన 'మీట్‌మార్కెట్ సొసైటి వ్యవస్థ' కూడా అలాగా కన్పిస్తుంది. బహుశా ఇందులోని ఇతివృత్తానికి మూలం ఇటీవల కాలంలో సమాజంలో వస్తున్న వింతపోకడలు కారణం కావచ్చు. హైదరాబాదులోని ఒక విశ్వవిద్యాలయంలో సంప్రదాయంగా జరుపుకుంటున్న మాంసాహార పండుగ విషయంలో కొన్ని మతసంస్థలు లేవనెత్తిన అభ్యంతరాలు, తదనంతర పరిణామాలు వంటివి కూడా ఈ కథలోని వస్తువు కారణం కావచ్చు. ఇటీవల కాలంలో దళితులు, గిరిజనులు, ముస్లింలు తినే గొడ్డు మాంసంపై ఆంక్షలు మొదలయ్యాయి. స్వతంత్ర భారతదేశంలో ఒకవ్యక్తి తినే ఆహారంపై కూడా నిషేధాలు కొనసాగుతుంటే మనం ఏ యుగంలో నివసిస్తున్నామనే విషయాన్ని సూటిగా ప్రశ్నించడానికే రచయిత 'కంచం మీద కట్టడి' అనే శీర్షికను ఎంచుకున్నాడు.

ఈ నవలికలో ఒక ఆదర్శ సమాజాన్ని రూపొందించాడు రచయిత. గ్రామపంచాయితీ ఆధ్వర్యంలో అందరూ కలిసికట్టుగా అవసరమైన పంటలు పండించుకుంటూ, అన్నిరకాల మాంసాహారాలు అమ్మే 'మీట్ మార్కెట్ సొసైటీ'ని స్థాపించి తద్వారా విద్య సంక్షేమ కార్యక్రమాలు చేసుకుంటూ పోతే గ్రామ స్వరాజ్యం సాకారమౌతుందని నిరూపించాడు. ఇలాంటివన్నీ కలిగిన 'సిరివరం' గ్రామ పంచాయితిలోని ప్రజలంతా అభివృద్ధి చెందుతూ ముందుకు సాగుతుంటే, ఆ మార్కెట్‌లో అమ్మే పశుమాంసంపై కాషాయపరివారం కుట్రతో దాడిచేయడం, దాన్ని అందరూ కలసి సమష్టిగా తిప్పికొట్టడం స్థూలంగా కథావస్తువు. కథకు పరిపుష్టిని చేకూర్చడం కోసం, ఇసుకమాఫియా, నోట్లరద్దు, దేవాలయాల్లో మానభంగాలు, బ్యాంకుదోపిడీలు వంటి సమకాలీన అంశాల్ని ఇమిడ్చాడు రచయిత. ఈ నవలలో ఒక రాజకీయపార్టీ చేసే గోవధనిషేధ నినాదాన్ని శ్రీనాథశాస్త్రి పాత్ర ద్వారా ప్రశ్నింప చేశాడు. క్రీ.పూ. నుండి రామాయణ, మహాభారత కాలాల వరకు రాజులు, బ్రాహ్మణులు భుజిస్తున్న ఆహారాన్ని గురించి సుదీర్ఘమైన చర్చ చేయించాడు. మాతృత్వం కోల్పోయిన గోవుల మాంసాన్ని తినడం తప్పుకాదనే విషయాన్ని సిద్ధాంతీకరించాడు. ఈ దేశంలో ఏ జంతువు పవిత్రత ఆ జంతువుకుందని, ఒక రాజకీయ పార్టీ అస్తిత్వం కోసం ఒక జంతువు గొప్పది, మరో జంతువు గొప్పదికాదు అని గుడ్డిగా నమ్మడం మంచిది కాదని రచయిత సూటిగా చెప్పాడు.

చివరి రెండు నవలికలైన నూర్జహాన్, రక్షకతడులు రాయలసీమ స్త్రీల అస్తిత్వాన్ని సజీవంగా కళ్ళ ముందుంచుతాయి. శాంతి నారాయణ నూతనకోణం నుండి

నూర్జహాన్ నవలికలను ఆవిష్కరించాడు. కదిరి ప్రాంతంలోని కరువు నేపథ్యం నుండి ప్రారంభమైంది ఈ నవలిక. ముస్లింలో ఒక ఉపవిభాగంగా కనిపించే దూదేకుల ముస్లింల జీవితాలను స్పృశిస్తూ ముందుకు సాగింది. ముస్లిం, దూదేకుల కులాలు కలిసిపోవడానికి కొందరు ప్రయత్నం చేస్తున్నప్పటకీ, కొన్నిరాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుల కోసం వారి మధ్య దూరాన్ని ఇంకా పెంచడానికి ప్రయత్నం చేస్తున్న తీరును రచయిత ఈ నవలికలో చూపించాడు. "ఎంత స్నేహితులైనా ఈ దేశంలో మనుషులు పరస్పరం మతాలతో, తమను తాము చూసుకుంటారేమో" నని రచయిత అనడం వెనుక ముస్లిం, దూదేకుల కుటుంబాల మధ్య ఉన్న మత దూరాన్ని గురించి గుర్తుచేయడమే.

గొప్ప వ్యవసాయ ముస్లిం కుటుంబంలో పుట్టిన నూర్జహాన్, తండ్రి ఇష్టానుసారం దూదేకుల వర్గానికి చెందిన అన్వర్‌ను పెళ్ళి చేసుకోవడం, కొద్ది సంవత్సరాల్లోనే భర్త, బిడ్డను తప్ప అందరినీ యాక్సిడెంట్‌లో కోల్పోవడం, భర్తకు తోడుగా ఆయన చేసే వ్యాపారంలో పాలుపంచుకోవడం, రాజకీయ కక్ష్యల్లో భర్త మరణించి, కొడుకు కాలు పోగొట్టుకున్న తర్వాత కుటుంబ భారాన్ని తానే మోయడం, పోలీసుల దేగకళ్ళకు తాను బలైపోయినా తన కోడలను మాత్రం తప్పించి కుటుంబానికి రక్షక కవచంగా నిలబడటం ఈ కథలో సారాంశం.

ప్రతి సంఘటన, ప్రతి సన్నివేశంలో నూర్జహాన్ చైతన్యాన్ని రచయిత మన కళ్ళముందుంచాడు. నిస్సహాయస్థితిలో సారా ప్యాకెట్లు అమ్మడానికి కూడా సిద్దపడ్డ నూర్జహాన్ ధైర్యాన్ని పరిచయం చేశాడు. అందమైన తన రూపాన్ని సొంతం చేసుకోవడం కోసమే తనభర్త స్నేహితులు, పోలీసు అధికారి తనకు సారాయి వ్యాపారంలో సాయం చేసినట్లు నటించారనే విషయాన్ని  తెలుసుకున్న నూర్జహాన్ నిశ్చేష్టురాలవుతుంది. అయితే ఆమెలోని ధైర్యం, కుటుంబాన్ని కాపాడుకోవాలనే లక్ష్యం, జరిగే పరిణామాలకు చోటివ్వాల్సి వచ్చిందని రచయిత నూర్జహాన్ పై సానుభూతి వ్యక్తం చేస్తాడు. అయితే నూర్జహాన్ ఎంతకైనా దిగజారిపోయే వ్యక్తిత్వం గల స్త్రీ కాదు. వికలాంగుడైన బిడ్డకోసం, కోడలికోసం తన శరీరాన్ని పోలీసు అధికారికి అప్పగించిందే కానీ, తాను ఇంకొక్కడుగు ముందుకు వెయ్యకూడదని గట్టిగా నిర్ణయించుకుంది. పోలీసు అధికారి ఆమె కోడలని కూడా తీసుకురమ్మని అడిగినప్పుడు ఆవేశంతో తిరగబడింది. ఒకప్పుడు సంసార సుడిగుండంలో చిక్కుకున్న తాను జీవననీతికన్నా జీవితధర్మమే  ప్రధాన మనిపించి తలవంచింది. కానీ, ఆ దుర్మార్గులను ఇక సహించకూడదని నిర్ణయించుకున్నందు వల్లనే, ఎదురు తిరిగి సామూహిక మానభంగానికి గురికావాల్సి వచ్చింది. పోలీసు లాకప్‌లో ఆమె పొందిన నరకవేదనపై, ఆమెకు జరిగిన అన్యాయంపై మీడియా, ప్రజాసంఘాలు చొరవ చూపాయి. పోలీసుల డిస్మిస్‌తో నవలను రచయిత ముగించాడు. అయితే ఈ ముగింపు నూర్జహాన్ జీవితానికి కొత్తగా సమకూర్చింది ఏమీ లేకపోయినప్పటికీ, రాయలసీమ ముస్లిం స్త్రీ పడిన ఆవేదనను కళ్ళముందుంచడంలో రచయిత సఫలుడయ్యాడు.

'రక్షక తడులు' శీర్షికను ప్రతీకాత్మకంగా రచయిత పెట్టాడు. గతంలో ప్రభుత్వం కరువుసీమలో మెట్ట పంటలు ఎండిపోకుండా ఉండేందుకు రెయిన్ గన్లతో నీటిని అందించే ఒక పథకాన్ని ప్రవేశపెట్టింది. ఆ పథకం ఫలితాన్ని ఎంతమంది రైతులు అనుభవించారో తెలియదు కానీ, ఎంతోమంది రైతులు తమ జీవితాలను అర్థాంతరంగా ముగించేసుకున్నారు. ఆ నేపథ్యంలో ఒక రాయలసీమ రైతుకోడలు కూడా తనమానాన్ని, ప్రాణాన్ని నీటితడికోసం ఎలా పోగొట్టుకుందో వివరించడం 'రక్షక తడులు' నవలికలో కథావస్తువు.

మంచి వ్యవసాయ కుటుంబం నుండి వచ్చిన సుజాత కేంద్రబిందువుగా ఈ నవల సాగింది. సంపన్న కుటుంబాలు వ్యవసాయం మీద ఆధారపడి, మానవతా విలువలతో బ్రతికినప్పుడు ఎలాంటి కష్టాలను ఎదురుచూడాల్సి వస్తుందో రచయిత వివరించే ప్రయత్నం చేశాడు. చదువు, సంస్కారం, యోగా వంటి వాటిల్లో ముందుండే సుజాత, గ్రామీణ వాతావరణంపై మక్కువతో, వ్యవసాయంపై ఇష్టంతో మేనమామ కొడుకు కార్తీక్‌ను పెళ్ళిచేసుకుంటుంది. కాపురానికొచ్చిన కొత్తల్లో పాల్స్‌ప్రిస్టేజికి పోయి ఇంటి హంగుల కోసం ముప్పయి లక్షలు ఖర్చు చేయిస్తుంది. తరువాత వ్యవసాయం కుంటుపడి, కుటుంబం అప్పులఊబిలో కూరుకుపోయినపుడు తాను చేసిన పొరబాటును గుర్తించి పశ్చాత్తాప పడుతుంది. ఇంట్లో పనిమనిషులందరినీ మాన్పించి, తనే పనిమనిషిగా మారి కుటుంబాన్ని చక్కదిద్దే ప్రయత్నం చేస్తుంది. గ్రామ సర్పంచి ఎన్నికల్లో గెలిచిన తర్వాత సామాన్య ప్రజలకు అవసరమయ్యే పనులను చేసి మంచిపేరును సంపాదించుకుంటుంది. ఆ కుటుంబంపై ముఖ్యంగా సుజాతపై కన్నేసిన ప్రత్యర్థి నాగిరెడ్డి, ఆ కుటుంబ ఆర్థిక నేపథ్యాన్ని, పొలాలకు నీళ్ళు సరిపోని పరిస్థితిని గుర్తించి సరైన సమయంలో దెబ్బకొట్టేందుకు ప్రయత్నం చేస్తాడు. కళ్ళముందే

లక్షల విలువచేసే మిరప, టమోట పొలం వాడిపోతుండడాన్ని చూసి, సమస్యను అర్థం చేసుకొన్న సుజాత, నాగిరెడ్డి బోర్లో నుండి నీళ్ళు తన మడిలోకి పారించుకోవడం కోసం అతని దుర్మార్గపు కోరికకై తన మానాన్ని అర్పించుకొని, నరకవేదన అనుభవిస్తుంది. ఎవరికీ చెప్పుకోలేక భర్తకు దూరంగా ఉంటూ, పంట చేతికొచ్చాక యోగమార్గంలో తన ప్రాణాలు తీసుకుంటుంది.

ఈ నవలలో ఒక సంస్కారవంతమైన స్త్రీ మరణానికి ప్రత్యక్ష కారణం నాగిరెడ్డి అయినప్పటికీ, పరోక్ష కారణం రాయలసీమలో నీటిసమస్య. ఈ విషయాన్ని చెప్పడానికి హృదయాన్ని కదిలించే ఇతివృత్తాన్ని ఎంపిక చేసుకున్నాడు రచయిత. గ్రామాల్లో కనిపించే స్వచ్ఛమైన జీవితానికి శత్రువులాగా అవకాశవాదం, జిత్తుల మారితనం, వర్ణదురహంకారం, అధికార దర్పం వంటివి ఎలా ఉంటాయో నాగిరెడ్డి ద్వారా ప్రతిఫలింప చేశాడు రచయిత. కథ ప్రారంభంలోనే సూజాత స్కూటి ఆగినపుడు నాగిరెడ్డి ఆమెను తన ఇంట్లోకి ఆహ్వానిస్తూ పలికిన మాటల ద్వారా రచయిత ఆయన తత్వాన్ని చూపించే ప్రయత్నం చేశాడు. ఈ రెండు పాత్రల మధ్యే కథ సరికొత్త మలుపు తిరగబోతుందనే సూచన చేశాడు.

కథాగమనంలో రచయిత ఏ విషయాన్ని అనవసరంగా ప్రస్తావించడు. ముఖ్యంగా భౌతికవాద రచయిత అయిన శాంతినారాయణ ధ్యానయోగం గురించి రెండుసార్లు ఆయా పాత్రల చేత మాట్లాడించాడు. పాఠకుడికి ఆ సంభాషణ ప్రశ్నార్థకంగానే నిలిచిపోయినా, చివర్లో సూజాత తనువు చాలించిన పద్ధతి చూసినప్పుడు ఆ ప్రస్తావన ఎందుకు చేశాడో అర్థమవుతుంది. రచయిత సజీవశిల్ప నిర్మాణానికి ఇదొక ఉదాహరణ. తాను ఇష్టపడి చేసుకున్న కుటుంబంలో తన జీవితం బరువుగా సాగడానికి కారణాన్ని వివేకవంతురాలైన సుజాత అర్థం చేసుకుంటుంది. అంతేకాదు, భూగర్భ జలాలపై, వ్యర్థంగా సముద్రంలో కలుస్తున్న నీళ్ళపై, కృష్ణాగోదావరి పుష్కరాల కోసం కోట్లు ఖర్చుచేసే ప్రభుత్వ విధానాలపై సుజాత పాత్ర చేసిన విమర్శలు రచయితలోని సామాజిక దృక్పథానికి నిదర్శనాలు.

రాయలసీమ ప్రజల దైనందినజీవితంలో పశువులు భాగం. ఇంట్లోనే ఒకవైపు వాటిని ఉంచుకొని, గమనిస్తూ జీవించడం రాయలసీమ వాసులకు అలవాటు. అలాంటి వాతావరణాలను రచయిత సందర్భాను సారంగా నవల్లో ఇమిడ్చాడు. మిరప, టమోట వంటి పొలాల్లో రచయిత తిరిగాడిన అనుభవాన్ని సురేంద్ర, కొండయ్య పాత్రల మాటల ద్వారా వివరించడం మనం గమనించవచ్చు.

సుజాత ఎదపై ఉండే చున్నీ చుట్టుగాలికి పైకి ఎగిరిపోయి నాగిరెడ్డి పొలంలోని దానిమ్మ చెట్టుకు తగులుకొని చిరిగిపోయిన సన్నివేశాన్ని రచయిత సూచ్యార్థంగా భవిష్యత్తులో జరగబోయే సన్నివేశానికి ముడిపెట్టాడు. అంతేకాదు. నాగిరెడ్డిని పొలానికి నీళ్ళు అడిగి వచ్చిన తర్వాత సుజాత చేత రచయిత నర్మ గర్భంగా మాట్లాడించాడు. తోట్లోకి వచ్చిన కొత్తనీళ్ళను తాగినప్పటి నుంచి తనకు జ్వరంగా ఉందని అన్యాపదేశంగా ఆమె చేత భర్తకు సమాధానమిప్పించాడు. ఇవన్నీ చేయి తిరిగిన రచయితగా శాంతినారాయణ చేసిన వాక్య ప్రయోగాలు, సుజాత తనలో తాను చేసిన ఆలోచనలను తర్కంతో ముడివేశాడు. "ఏ స్త్రీ కూడా సాహసించని కార్యానికి తాను పూనుకుంది. చేసిన పొరబాటును సరిదిద్దుకోవడం మనిషి నైతిక విలువలో ఒక భాగం. అయితే విలువను రక్షించుకోవడం కోసం మరొక విలువను ధ్వంసం చేసిందా? ఇంతకు ఏ విలువలు ప్రధాన మైనవి? ఏవి అప్రధానమైనవి? తాను ధ్వంసం చేసిన విలువలు తనకు తప్ప ఇంకెవరికీ నష్టం కలిగించేవి కావేమో అటువంటప్పుడు ఆ విలువలు అప్రధానమైనవే కదా!" అంటూ ఆమె చేసిన ఆలోచన రచయిత లోని తాత్విక కోణాన్ని ఆవిష్కరిస్తుంది. సుజాత మరణానికి కారణం ఒక కార్తీక్‌కు మాత్రమే అర్థమయ్యేలా రచయిత జాగ్రత్త తీసుకున్నాడు. ఇదికూడా ఒక అద్భుత శిల్పనిర్మాణ చాతుర్యమే.

వ్యవస్థలో ఎప్పటి నుంచో వున్న కొయ్యబారిన ఆలోచనలను మార్చడానికి ప్రయత్నం చెయ్యడమే నిజమైన రచయితల స్వభావం. కందుకూరి, గురజాడలు ఆరంభించింది ఇదే. అయితే కొన్నాళ్ళు ఆ మార్గానికి దూరంగా కొందరు రచయితలు పయనించారు. అభ్యుదయ ఆలోచనల ప్రభావంతో తర్వాత అనేకమంది రచయితలు తమ ఆలోచనల్ని మార్పుదిశగా మళ్లించారు. ఆ మార్పుకోసం తాము నిరంతరం రచనలు చేయడం వల్ల కొందరు ప్రాణాలు కోల్పోవడం జరుగుతోంది. భయపడని వాడే నిజమైన రచయిత. నిజాన్ని భయం లేకుండా చెప్పినవాడే సమాజ రచయిత. అలాంటి ధైర్యం శాంతినారాయణలో పుష్కలంగా ఉంది. రాయలసీమ భాషపైన పట్టు ఉంది. అనంతపురం మట్టి వాసనపై మక్కువవుంది. ప్రజల జీవితంపై ధ్యాస వుంది. అందుకే నాలుగు దిక్కుల్లాంటి నాలుగు అస్తిత్వాలపై ఈ నవలికలను రూపొందించాడు. ♦

## భూతం

- చిత్తులూరి
8247432521




సీసాలోంచి
భూతాన్ని వెలికితీసే
కుట్రేదో జరుగుతోంది
భూతం బయటికొస్తే చాలు
భూమండలం బద్దలయ్యే సన్నివేశం
కళ్లముందు ప్రత్యక్షం

ఆకుపచ్చని అడవి సామ్రాజ్యాన్ని
కూలదోసే కుట్రేదో రచిస్తున్నారు
పచ్చని పోడుపొలాల నా నల్ల నేలంతా
శ్మశానాలను మొలిపించే ప్రయత్నాలు
పశుపక్ష్యాదులూ
అమాయకమైన ప్రకృతి పురుషుల
సహజ జీవన సంరంభాలు
అన్నీ భూతం కాళ్లకింద
మృతకళేబరాలై తుడిచిపెట్టుకుపోయే
పాడు కాలమేదో సృష్టించబడుతుంది

తినే అన్నం మెతుకుల మధ్య
అణుబాంబులను విసిరే భూతం
మొలకెత్తే బతుకు గింజల నడుమ
రక్తపు రసాయనాలు చల్లే భూతం
ఆకుపచ్చని ప్రకృతి సంపదను
అమాంతం నెత్తురు కోరలతో
నమిలి మింగేసే భూతం
బంగారం పండే గిరిజన నేలలనిండా
విషాన్ని అలికే భూతం
నదుల నరాల నిండా
కొండల కండల నిండా
విషరక్త కాసారాలను
ప్రవహింప చేసే భూతం

ఈ భూతాన్ని కట్టడి చేసే
పోరాట మాంత్రికులం కావాలి
నడిచే నేలనీ
పాడే ఆకాశాన్నీ
పరవశించే ఆకుపచ్చదనాన్ని
కాపాడుకునే యుద్ధం చేయాలి
మట్టి సీసా మూత తెరిచి
భూతాన్ని చెలరేగిపోయేలా చేసి
మూలవాసుల ప్రకృతి నేలను
చాపలా చుట్టేసి అంతమొందించే
కుట్రకు చరమగీతం పాడాలి
కార్పోరేట్ల వ్యాపార
కబంధహస్తాలనుండి
మనదైన నేలనీ ఆకాశాన్నీ
కన్నబిడ్డల్లా కాచి కాపాడుకోవాలి

భూతం బయటికి రాకముందే
భూమిపుత్రులంతా ఏకమై
అడవినే ఆయుధంగా మలచుకుని
యుద్ధానికి బయలు దేరాలి! ♦

---

## ఎన్నాళ్ళని ?

- నూనెల శ్రీనివాసరావు
9492970231




ఆకాశం ఆకాశంలా పైపైకి ఎగిరి పోతోంది
నేల నేలలా పాతాళానికి కృంగిపోతోంది
నడుమ వాయువు తన దిశ దశ మార్చుకొని
ఎక్కడికో కొట్టుకుపోతోంది
పకృతి తన నియమాలు తానే అతిక్రమించి
కొత్త భాష్యాలు చేస్తోంది
చిగురించని పచ్చదనం తన అవస్థ మరచింది
రాజ్యం సుభాషితాల్లో మునిగితేలుతూ
దేశద్రోహం ముద్ర తనకంటనీయక
తామరాకుపై నీటి బొట్టులా జారిపోతోంది

సర్వేజన సుఖినోభవంతి
ఆకాశహర్మ్యాలలోకి వలసపోయింది
కాషాయవర్ణం నిలువెత్తు పులుముకున్న దేశం
మౌనం ద్యానంగా యోగముద్రలోకి జారుకుంది
నిర్మానుష్య గగనవీధులెంట
కార్పోరేట్ రాబందులు
యధేచ్ఛగా విహరిస్తున్నాయి
కోడిపిల్లల్లా శ్రమను తన్నుకుపోతూ

ఒక్కొక్కటిగా వలువలు విడిచేసిన
దేశభక్తి కొత్తరాగాలు నేర్చుకుంది
ప్రశ్నించే పిడికిళ్ళపై విరుచుకుపడే
మంత్రాలు నేరుస్తూ.... శపిస్తూ...

ఐతేనేం నూరుగొడ్లను తిన్న రాబందు
ఒక్కగాలివాటుకే పడిపోయినట్లు
ఎన్నాళ్ళు సాగును పీడన తాడన
కదుమండిన గడ్డిపరకలే
పేనుకుంటూ
మదగజాన్ని మట్టుపెట్టలేదా ?
గుర్తుపెట్టుకుంటే చాలు
భవితలో జరుగు మేలు
లేకుంటే మరో నెత్తుటి చరితకు
కదులు జనాగ్రహాలు ! ♦




# వృద్ధి

- ఆచార్య కొలకలూరి ఇనాక్
9440243433

మాకేం గాడు బట్టింది? 'మేం రాం' అంది లింగి.

అంతకు ముందు నారయ్య వచ్చి లింగిని, లింగి కూతూరు సౌందర్యను కలుపు తీయటానికి రమ్మన్నాడు. కూలి ఎక్కువ ఇస్తానన్నాడు. కలుపు తీసిన రోజు సాయంకాలమే కూలి డబ్బులిస్తానన్నాడు.

'మనుషులు దొరకటం లేదు. కలుపు పెరిగిపోతా ఉంది. నువ్వూ, నీ కూతురూ, ఇంకా ఇద్దరు వస్తే పని అయిపోద్ది' అన్నాడు నారయ్య

'మా వల్ల గాదు. మేం రా' అంది లింగి

ఇంతకు ముందు ఆసాములు వచ్చి పనికి పిలిస్తే చేతులు కట్టుకొని భయభక్తులతో, 'అట్టాగే సోమీ! వత్తాం దొరా! 'అని పనికిపోయి, కూలి డబ్బు తెచ్చుకొని, వస్తూ బియ్యం బొయ్యం కొని తెచ్చుకొనేవాళ్ళు.

ఆ పరిస్థితులు పోయి మేం పనికి రాం పొమ్మంటున్నారు. ఆసాములు వస్తే మంచం దిగి, చేతులు నలుపుకొంటూ నిలబడేవాళ్ళు. ఇప్పుడు మంచం మీంచి లేవటం లేదు.

ఆసామి నిలబడి మాట్లాడుతుంటే, కూలీలు మంచం మీద కూర్చుని మాట్లాడుతున్నారు.

ఆసామి బతిమాలినట్లు మాట్లాడుతుంటే లింగి తుస్కారించి మాట్లాడింది.

'నువ్వూ, నీ పెళ్ళమూ, నీ నలుగురు పిల్లలు వంగితే ఆ కలుపు తీయటం ఎంతసేపు?' అంది.

'ఆళ్ళు పొలం పనులు ఎరగరే!' అన్నాడు ఆసామి.

'ఆళ్ళేమో నీడ పట్టునుండాలా? మేమేమో  ఎండనక వాననక పనిచేయాలా? మావల్లగాదు. పొండి'

ఆసామి ఊసురుమంటూ వెళ్ళిపోయాడు. వేజండ్ల మాదిగపల్లెలో రైతుల పనులకు వెళ్ళే మనుషులు తగ్గిపోతున్నారు. కొందరు పొగాకు కంపెనీల్లో గ్రేడింగుకు పోతున్నారు. కొందరు కట్టుబడి పనులకు పోతున్నారు. బేల్‌దార్లు, మేస్త్రుర్లు, కట్టుబడి కూలీలుగా వేజండ్ల మాదిగ పల్లె మగవాళ్ళు ఆరితేరారు. ఆ మగవాళ్ళ భార్యలు, చెల్లెళ్ళు, కూతుళ్ళు మగవాళ్ళతోపాటు కూలీలుగా ఇళ్ళు కట్టే పనులకు పోతున్నారు. కొందరు ఆడవాళ్ళు,  గుంటూరు మార్కెట్టులో కూరగాయలు, ఆకుకూరలు, పళ్ళూ, చిరుతిళ్ళు అమ్ముతూ అంతో ఇంతో సంపాదించుకొంటున్నారు. కొందరు బర్రెల్ని పెంచి, పాలు అమ్మి సుఖపడుతున్నారు. గుంటూరులో పాలకు ఎప్పుడూ గిరాకి.

రైతుల పొలాల్లో పనులకు వేజండ్ల మాదిగ పల్లెలో రైతు

కూలీలు లేరు. మగవాళ్ళు లేరు. ఆడవాళ్ళు లేరు.

ఏమీ పని చేయకుండా పల్లెలో, పాకల్లో ఒంటినిట్టాడి ఇళ్ళలో నిద్రపోయే జనంలో ముసలీ ముతకను తీసేయగా కొద్దిమంది ఆడవాళ్ళు కనిపిస్తారు. వాళ్ళలో లింగీ, లింగి కూతురు సౌందర్య కనిపించి ఆసామి కలుపుతీసే పనికి వాళ్ళను పిలవటానికి వచ్చి, పిలిచి రామనిపించుకొని వెళ్ళిపోయాడు.

ఇదంతా వింటున్న చింతయ్య తాత దిగులుపడ్డాడు. తమకాలంలో పనులు దొరక్క ఆసాముల చుట్టూ తిరిగేవాళ్ళం. ఇప్పుడు ఆసాములు రైతు కూలీల చుట్టూ తిరుగుతున్నారు. కాలమహిమ! అనుకొంటూ ఆశ్చర్యపోయాడు.

లింగికి ముప్పై ఏళ్ళు. కూతురుకు పదిహేనేళ్ళు. ఇద్దరూ ఏం పని చేయరు. కడుపునిండా తింటారు. కంటి నిండా నిద్రపోతారు. నిద్రపట్టకపోతే గుంటూరు పోతారు. సినిమాలు చూచివస్తారు.

ఇద్దరికి భర్తల్లేరు.

లింగికి పదమూడో ఏట పెళ్ళి చేశారు. పద్దానుగోఏటికి భర్త చనిపోయాడు. అప్పటికి సౌందర్య కడుపులో పడింది. సినిమాల ప్రభావంతో కూతురుకు సౌందర్య అని పేరు పెట్టింది. లింగి సంసారంలో అంతా నొప్పి, అంతా బాధ. అంతా దుఃఖం అనుభవించింది. రెండేళ్ళ కాపురం నరకం. సంసారం స్వర్గం అన్నవాణ్ణి చెప్పుతో కొడతాననేది లింగి.

భర్త తాగుబోతు. ఇల్లూ వళ్ళూ గుల్ల చేసుకొని ఇరవై ఏళ్ళకే వల్లకాటికి చేరాడు. భర్త చనిపోతే లింగి ఏడవలేదు. సంతోషించింది. 'పీడ ఇరగడయింది' అనుకొంది. పెళ్ళి బందిఖానాగా భావించిన లింగి విడుదల పొందింది.

తాళి తెంచిన మూణ్ణెల్లకు కూతురు పుట్టింది.

సౌందర్య నిజంగా సౌందర్యవతిగా ఉంటే మగవాళ్ళచూపులు, చూపులు కాదు, మరమేకులు, గుచ్చుకోసాగాయి.

యువకులు కొందరు కూతురు వెంటపడటం లింగి గుర్తించింది. వాళ్ళను మాటలతో తరిమింది. కర్రలు చూపించింది. చెప్పులు తీసింది. రాళ్ళు విసిరింది.

మగవాళ్ళు దెయ్యాలు, రాక్షసులు, దుర్మార్గులు, దుష్టులు, ఆడవాళ్ళను చంపటానికి పుట్టారని కూతురికి చిన్నతనం నుంచీ నూరిపోసింది. సౌందర్య నిజమే అని నమ్మింది. మగవాళ్ళు అంటే గొంగళిపురుగులు అనుకోసాగింది.

కాని, జమాల్సుగాడు తేడాగా కనిపించాడు. వాడు ప్రేమగా, దయగా, జాలిగా, కరుణగా చూడటం గమనించింది. కొరుక్కుతినేట్టు, నమిలిమింగేట్టు, కోసుకు గుటుక్కుమనిపించేట్టు చూడటం లేదు. జమాల్సుగాడు సౌందర్యకు ఇష్టమయ్యాడు.

ఇంటిముందున్న వేప చెట్టుకింద సూర్యుడు పుట్టక ముందు పుట్టేవాడు. సూర్యుడు అస్తమించక ముందే కనబడకుండా పోయేవాడు.

జమాల్సుగాణ్ణి చూడకపోతే సౌందర్యకు నిద్రపట్టేదికాదు.

వయస్సు, దాని దుంప తెంచింది. ఆడని ఆటలు లేవు. జమాల్సుగాణ్ణించి సౌందర్యకు, సౌందర్య దగ్గర్నుంచి జమాల్సుగాడికి తంతితపాలా సౌకర్యం ఎట్లా సాధ్యమయిందో కానీ, మాట్లాడుకోకుండా వాళ్ళ సంభాషణ సాగింది.

'ఆణ్ణాకిష్టం' అంది సౌందర్య.

నూరిపోసిన న్యాయసూత్రాలు, ధర్మసూక్ష్మాలు, మగవాడి రాక్షసత్వ రహస్యాలు ఏమయిపోయాయి అని లింగి తలకిందులుగా పడిపోయింది.

'ఆణ్ణీకు ఎందుకిట్టం'? అని లింగి అడిగింది.

'రైలు పెట్టెలోకి ఎప్పుడైనా, ఎక్కడైనా, ఎంతమాలావు వేగంగా పోతున్నా, వస్తున్నా, ఎక్కుతాడు, దిగుతాడు' అంది సౌందర్య.

'అదేం అర్హత'? అనుకొంది లింగి. అయినా ఏమీ అనలేదు. నోరు నొక్కుకొంది. బుగ్గలు నొప్పి పుట్టాయి.

'రైలెక్కటం దిగటం గొప్పా?' లింగి ప్రశ్నించింది.

'జమాల్సుగాడు యమ ఉసారుగాడు' అంది సౌందర్య.

పిల్లవాడు, పిల్ల పీట లేసుకొంటే పెళ్ళి చేయకుండా ఏ తల్లిదండ్రులుంటారు? ఉండరు. ఉండరు కాబట్టి పెళ్ళి అయింది.

పెళ్ళయిన రెండోరోజు, రైలు ఎక్కటం దిగటం తనకు పెళ్ళి చేసిన అదృష్టంగా భావించి, వేజండ్ల నుంచి తెనాలి పోతున్నరైలును గేటులో అందరూ చూస్తుండగా ఎక్కబోయాడు. అయితే ఏమయింది? ఎక్కలేకపోయాడు. ఎక్కలేకపోతే ఏమవుతుంది? కిందపడ్డాడు. కిందపడితే ఫరవాలేదు. రైలు చక్రాల కింద పడ్డాడు. రెండు ముక్కలయిన వాణ్ణి ఎవరేం చేసుకొంటారు? పాతిపెట్టారు. మూడో రోజు కార్యం కూడా

కాలేదు. తాళి తెంచి పారేశారు.

సౌందర్యకు పెళ్ళయినట్టా? కానట్లా? అని మాదిగ పెద్దలు తర్జనభర్జన పడ్డారు.

పెళ్ళయిందని తీర్మానించి, విధవ అయిందని నిర్ణయించారు.

మొగుడు చస్తే ఆనందించినట్లే, అల్లుడు చస్తే కూడా లింగి ఆనందించింది.

సౌందర్య మాత్రం వేపచెట్టు కింద జమాల్సుగాడు కూర్చుని ఉన్నట్లే అనుకొంటూ కన్నీరు పెట్టుకొంది. కన్నీరు ఎండిపోయింది; ఇంకిపోయింది, మాయమయింది. సౌందర్యకు జమాల్సుగాడు కనిపించటం లేదు. ప్రేమపోయింది. కోపం వచ్చింది. పూలు పెట్టుకోనీరు, బొట్టుపెట్టుకోనీరు, 'నీవే కారణమంతకు' అని జమాల్సుగాణ్ణి తిట్టుకోసాగింది.

ఏతా వాతా తేలిందేమిటంటే తల్లీ కూతుళ్ళిద్దరూ విధవలు. ఇద్దరూ వైధవ్యంలో సమానం.

కానీ లింగి ఒక తేడా గుర్తించింది. అదేమిటంటే 'సౌందర్యకు నరకం తెలియదు. కడుపున ఒక కాయ కాయలేదు'. అది లింగికి దుఃఖమే! సౌందర్యకు సంతోషమూలేదు. దుఃఖమూలేదు.

ఒకరోజు చింతయ్య తాత వాళ్ళిద్దరినీ పట్టుకొన్నాడు. 'ఆడు పట్టుకొంటే పల్నాటి శని పట్టినట్లే!' అంది లింగి. అదేమీ సౌందర్యకు తెలియదు.

'ఒసీ! ఇద్దరూ కొవ్వుపట్టి ఉండారు. వంట్లో తీపరంగా ఉండదా?! అని అడిగాడు.

'ఉంటది! అయితే ఏంటంట? ఆరుత్తావా? తీరుత్తావా? నోరు మూసుకొని పడుండరా ముసలోడా!' అంది లింగి.

వత్తాసు పలికినట్లు, సౌందర్య నవ్వింది.

'మానన్నాక కాయలు కాయాలి. ఆడదన్నాక పిల్లల్ని కనాలి. మొద్దులాగా పడి ఉండరాదు' అన్నాడు తాత.

'ఒరే తాతా! నీకేవన్నా తిమ్మిరిగా ఉందా? తెగ నీలుగుతున్నావు? నన్ను జేసుకొంటావా? దీన్ని జేసుకొంటావా? ఏం జేసుకొంటావో సెప్పు' అని లింగి నవ్వింది.

వంత పాడినట్లు సౌందర్య నవ్వింది.

'ఓసి మీ దుంపల్దెగ వయిసు మీదుండారు. ఎవుళ్ళనో ఏరుకొని కట్టుకొని, నలుగురు పిల్లల్ని కనండే నాయకురాళ్ళరా'!

'మేమే దేశానికి బారమయ్యేము. మాకు తోడు పిల్లలు కూడానా? కనటం పెంచటం మా వల్లకాదురా ముసిలోడా!' అంది లింగి.

'ఆడదన్నాంక పిల్లల్ని కనితీరాలే దెయ్యాల్లారా! మొగుడూ మొద్దుల్లేకుండా ఆడుదుంటే ప్రతి పురుగూ కుట్టుద్దే సైతానుల్లారా!' తాత కసిరాడు.

'సేసుకున్నది సాలు. సేసిన కాపరాలు సాలు. ఇంకెందుకు లేనిపోని తిప్పలు?' అంది లింగి.

'ఆడది పిల్లోళ్ళని కనిపెంచకపోతే సృష్టి ఎట్టా కొనసాగుద్ది? బమ్మ ఎట్టా బతికి బట్టకడతాడు?'

'మా కొద్దురా ముసిలోడా! ఈ తిప్పలు' అంది లింగి.

'ఆడు కలుపు తీద్దురు రండే అంటే పోకపోతిరి. పెళ్ళిలేక, పిల్లలు పుట్టక, ఒంటికొమ్ము రాకాసులకు మల్లే ఆడోళ్ళుండరాదే అంటంటే ఇనకపోతుంటిరి. ఎట్టా బతుకుతారే! బ్రతుకంటే ఏందే? కష్టపడాలి, కూడు తినాలి. ఇష్టపడాలి, పిల్లల్ని కనాలి. పనీపాటో సేయక, పిల్లా జల్లాను కనక ఉండీ మనుషులదేం పుటక? పుట్టేమి? పుట్టేకేమి?'

'ఒకడికి చాకిరీ ఎందుకు సేయాలి? ఒకడికి పిల్లల్ని ఎందుక్కనాలి? ఏం తీటనుకుని సుఖంగా బతుకుతున్నాం మమ్మల్ని వదిలెయ్' అంది లింగి.

'పనిసేయకపోతు నువ్వు పుట్టటం దండగ. పిల్లల్ని కనకపోతే ఆడ మనిషి జీవించడం దుబారా! నువ్వు పనిచేసే శక్తివి మాత్రమేకాదు, పిల్లల్ని ఉత్పత్తి చేసే ప్రాణయంత్రానివి కూడా. కృషీలేక, ఉత్పత్తీ లేక బ్రతుకేమీ? చచ్చేమి?'

'పోరా ముసిలోడా! నీ గొణుగుడు ఎప్పుడూ ఉండేదే!' అని లింగీ సౌందర్య అక్కణ్ణించి పోబోయారు.

మిమ్మల్ని సృష్టించి, మీ అమ్మా అయ్యాలే కాదు, దేవుడూ పొరపాటు చేసినట్లే! మీ అమ్మ అయ్యా వద్దనుకొంటే మీరు పుట్టేవాళ్ళా? మేమే పని చేయమని, మేమే పిల్లల్ని కనమని చెప్పే హక్కు మీకు లేదు. పని చేస్తే ఉండే సుఖం, సంసారం చేస్తే ఉండే ఆనందం మీరు కోల్పోరాదు. నా మాట ఇనండి. తగిన జంటను వెతుక్కోండి. వాళ్ళు ఎతుకుతుంటే మీరు అంగీకరించండి. పొండి! అని కసురుకొన్నాడు చింతయ్య తాత.

'పని చేయటం కూటికోసమే కదా! సంసారం చేయటం కూటికోసమే కదా! వాడు తెస్తే వండిపెట్టి, తిని, వాడిపక్కలో పడి ఉండాలి. ఇంతేనా బతుకు? ఏ బాదరబందీ లేకుండా సుఖంగా ఉంటే నీకేం తిమ్మిరి తాతా?' ప్రశ్నించింది లింగి.

'ఇది బ్రతుకుగాదే బడవల్లారా?' చింతయ్యతాత చుట్ట వెలిగించుకొన్నాడు.

అక్కణ్ణుంచి మెల్లగా ఇద్దరు సర్దుకొని తమ పాకకు చేరుకొన్నారు.

లింగి డ్వాక్రా గ్రూపులో సభ్యురాలుగా ఇంటింటికి తిరిగి కూరగాయలమ్మింది. ఇల్లు గడిచింది. బేంకు అప్పుతీరింది. ఇంత నిలవ ఉంది. పిల్ల పెద్దదయింది. పెళ్ళి చేసింది. వైధవ్యం కలిగింది. తనకు తోడయింది.

సౌందర్య మరోపెళ్ళి అనలేకుండా ఉంది.

లింగి కూతురు తోడు పోగొట్టుకోలేక పెళ్ళి మాట ఎత్తటం లేదు.

సంబంధాలు కూడా రావటం లేదు. సౌందర్యను పెళ్ళాడినవాడు చస్తాడని ఒక అకారణ భయం జనంలో నాటుకుపోయింది. లింగి మొండితనం బండతనం కూడా కొంత కారణం. సౌందర్య సాహసం వల్ల వాడు చచ్చిపోవటం మరో కారణం. మొత్తంమీద గోళ్ళు ఊడగొట్టుకొని మోళ్ళు మాదిరిగా మిగిలిపోయారు వాళ్ళు.

విధవరాంద్రకు వచ్చే పెన్షన్ తల్లికీ కూతురికీ వస్తూ ఉంది. వెయ్యి రెండువేలు అయ్యేసరికి లింగి కూరగాయలమ్మే గంప మూలన పారేసింది.

నెలకు నాలుగు వేలు ఏం పని చేయకుండా వస్తుంటే ఇద్దరికీ ఆనందమే!

కే.జీ రెండు రూపాయల బియ్యం పదికేజీలు వస్తే వాళ్ళకు నెలకు సరిపడా బియ్యం గింజలు ఇంటిలో ఉంటున్నాయి. చక్కెర, కంది పప్పు, చింతపండు సరుకులన్నీ చౌకధరకు లభిస్తుంటే నెలకు ఒక్క వెయ్యి రూపాయలతో కాలం గడుస్తూ ఉంది.

సౌందర్యకు పెళ్ళి చేస్తే ఒక విధవరాలకి వచ్చే పెన్షన్ లేకుండా పోతుంది. లింగి ఒంటరిది అవుతుంది. రెండు ఇబ్బందులు, భయాలు.

సౌందర్యకు పెళ్ళంటే భయం. తనను పెళ్ళాడినవాడు అర్ధాంతరంగా చస్తాడన్న వదంతి అనుభవపూర్వకంగా సౌందర్యకూడా నమ్ముతుంది.

అమ్మ తోడుంటే అదే చాలు అనుకోసాగింది సౌందర్య. కూతురు వెంట ఉంటే అదే స్వర్గం అనుకోవటం లింగికి ఇష్టంగా ఉంది.

ఇద్దరూ టికెట్లు కొనకుండా గుంటూరు రైలు ఎక్కేవాళ్ళు. ఎటోదిగి ఎటో వెళ్ళేవాళ్ళు. ఏ సినిమానో చూచేవాళ్ళు. ఇంటికివచ్చి వంటా వార్పూ తంటా లేకుండా అన్న కాంటిన్‌లో పదిరూపాలతో కడుపులు నిండి తినేవాళ్ళు.

ఎప్పుడన్నా గుళ్ళో ప్రసాదంతో కడుపు నింపుకొనే వాళ్ళు.

శనివారం అన్నదాన సత్రంలో తినగలిగినంత తినేవాళ్ళు.

ఆదివారాలు చర్చి ప్రాంగణంలో సంతర్పణ ఉండేది. వారంలో సగం రోజులు ఇంట్లో వంట చేయవలసిన పనిలేని సుఖజీవనం గడుపుతున్నారు, వాళ్ళు.

ఎప్పుడన్నా ఎవడన్నా మరీ వెంటబడుతుంటే బిచ్చగాడికి ఇంత బిచ్చం వేసినట్లు, ఊ కొట్టి వాడి కక్కుర్తి తీర్చి, వీళ్ళ కుతి తీర్చుకొనేవాళ్ళు.

వాళ్ళిద్దరికీ వాళ్ళ జాగ్రత్తలు తెలిసివచ్చాయి. కడుపో, కాలో రాకుండా ఉండాలంటే ఏం చేయాలో వాళ్ళకు అర్థమయింది.

ఒకడే మరీ మరీ వెంటబడుతుంటే వాణ్ణి ఎట్లా దూరం చేసుకోవాలో కూడా అర్థమయింది.

ప్రేమ అనీ, దోమ అనీ, భ్రమపడే ప్రమాదం నుంచి వాళ్ళు తప్పించుకోవటం కూడా గ్రహించారు.

నెలకొక కొత్త చీరె కొనుక్కొంటారు. వెంటబడే వాడి సొమ్ము పైస ముట్టరు. వీళ్ళ సొమ్ము పైస వాడికి పెట్టరు. తామరాకు మీది నీటిబొట్టు వ్యవహారం! జమాఖర్చు నిల్ బేలన్స్!

ఇక్కడితోనే సంసారమంటే విసుగు! రోత! అసహ్యం! మనుషులు మారుతుంటే కొత్త ఎంతగానో ఉంటూ వచ్చింది. పాత అయితే రోత కాబట్టి, ఎవణ్ణి పాతబడకుండా చూచుకోసాగారు.

రోగం రొచ్చూ వస్తాయన్న భయం వాళ్ళకు లేదు. తగిన

ఏర్పాట్లు చేసుకోవటంలో ఆరితేరిపోయారు.

వాళ్ళిద్దరికీ ఇప్పుడు మగాళ్ళు, మగాళ్ళులాగా కనిపించటం లేదు. కుక్కపిల్లల్లాగా భావించసాగారు.

బరువూ, బాధ్యతా, ఖర్చూ తలకాయనొప్పి లేని బంధాల వల్ల, ఇటు వీళ్ళిద్దరూ, అటు మగ పురుషులు, వెలుతురు చుట్టూ తిరుగుతూ మర్యాదగా మప్పితంగా, హద్దుల్లో ఉంటున్నారు. చావటం లేదు, కాలి, మసై, మసై.

ఏదైనా పేచీ వస్తే వ్యవహారం పోలీసుల దాకాపోతుందని మగవాళ్ళకూ భయం.

ఎవరికీ ఏదీ సొంతం కాదు కాబట్టి ఎవరి మధ్య ఎటువంటి పేచీలు తగాదాలు కొట్లాటలు లేవు.

కానీ వేజండ్ల పల్లెలో ఊరులో, గుంటూరులో వాళ్ళిద్దరిని గూర్చి అనరాని మాటలు అనటం జనం విన్నారు. వీళ్ళూ విన్నారు.

భోజనం చేసిన హోటలు, అన్నదాన సత్రం, చర్చి కంపౌండు, అన్న కాంటీన్ మర్చిపోయినట్లే, ఎదురయిన మగాళ్ళు, మరుగయిన మగాళ్ళు కాలగర్భంలో కరిగిపోతూ ఉన్నారు.

కానీ లింగీ, సౌందర్య ఆడవాళ్ళు కదా! అప్పుడప్పుడు ఆ మగాడు మేలు, ఈ మగాడు కీడు అని గుర్తించటం వల్ల మేలయిన మగాణ్ణి ఎన్నుకోవటంలో వాళ్ళు చాకచక్యంగా ప్రవర్తించేవాళ్ళు.

పెళ్ళయితే ఒక్క మొగుడుతోనే సంసారం మొగుడు తుక్కోడయినా, దూగరోడయినా చచ్చినట్లు సంసారం చేయాలి.

వీళ్ళకున్న వెసులుబాటు సంసార స్త్రీలకు లేదు.

ఒకరోజు చింతయ్య తాత వాళ్ళిద్దరినీ పట్టుకొన్నాడు. 'ఏమే దయ్యాల్లారా?' అన్నాడు.

'ఏందిరా ముసిలోడా' అన్నారిద్దరు.

'మీ పని మా జోరుగా ఉందీ!' అన్నాడు.

'ఉండక!' అన్నారిద్దరు

'కోడలా! కోడలా! నీ భోగం ఎంతకాలమే అంటే మా అత్త ఊరి నుంచి వచ్చిందాకా అందంట కోడలు. అట్టాగే మీ భోగం ఎంతకాలం?' అన్నాడు చింతయ్య తాత.

'బుద్ధి పుట్టినంతకాలం!' ఇద్దరూ చెప్పారు.

'వయిసు ఉడిగితే!' చింతయ్యతాత అడిగాడు

'మూలనపడి ఉండటం!' నిర్భయంగా చెప్పారు.

'ఎవరు చూస్తారు?' తాత ప్రశ్న.

'మమ్మల్ని మేం ఇద్దరం!'

'మీ రిద్దరూ మూలనబడితే!'

'వృద్ధాశ్రమం!'

'చస్తే!'

'మునిసిపాలిటీ!'

'మనిషిగా పుట్టినందుకు మీ జ్ఞాపకాలు ఈ నేలమీద ఏం వదులుతారు, మీ శవాలు తప్ప?'

లింగి, సౌందర్య మౌనంగా ఉన్నారు.

మళ్ళీ చింతయ్య తాత అడిగాడు.'వితంతు పెన్షన్ల్ ఆగిపోతే.

'వృద్ధాప్యపెన్షన్'

'అదీ ఆగిపోతే?'

'ఆగిపోదు!'

'ఏం ఎందువల్ల?'

'ప్రజా సంక్షేమ ప్రభుత్వాలు ప్రకాశిస్తూనే ఉంటాయి కాబట్టి'

'ఏ ప్రభుత్వం పనిచేయవద్దు, శ్రమశక్తిగా, ఉత్పత్తి శక్తిగా మిగలవద్దు, పిల్లల్ని కనొద్దు, జీవశక్తిగా పునరుత్పత్తి శక్తిగా ఉండవద్దు అంటుంది?' తాతా ప్రశ్నించాడు.

'ఏ ప్రభుత్వమైనా అంటుంది. ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది. ప్రజల సంక్షేమాలు వర్ధిల్లుతాయి. ముసిలోడా! పెద్ద పెద్ద మాటలంటున్నావు. ఏడ నేర్చుకొన్నావు!'

'మిమ్మల్ని చూచి! మీ చేత పనిచేయించే, మీ చేత పిల్లల్ని కనేట్టు చేసే ప్రభుత్వం రాత్రి నాకు కలలోకి వచ్చింది.

' మా సుఖం చూచి ఓర్చలేని ముసిలోడా! అందరూ చస్తున్నారు. నువ్వ చావవేం?! లింగి, సౌందర్య తిట్టారు.

చింతయ్య తాత కళ్ళలో నీళ్ళు తిరిగాయి.

ఎప్పుడూ నవ్వే తాత కళ్ళు; ఆ రోజు నీళ్ళతో నిండిపోతే తల్లీ కూతుళ్ళు తాతనేమీ అనలేకపోయారు.

లింగి గిన్నెలో అన్నం పెట్టి తాతకు ఇచ్చింది. సౌందర్య చెంబుతో నీళ్ళు తెచ్చి ముందు పెట్టింది.

'నన్ను బతికించగలరా?' చింతయ్య తాత అడిగాడు. లింగీ, సౌందర్య అవునన్నట్లు తలలూపారు. వాళ్ళలో వచ్చిన మార్పుకు తాత ఆవురమని ఏడ్చాడు. ♦

## రంగుకి పేరెందుకు?

- కిల్లాడ సత్యనారాయణ
8333987838



రంగుల్లో విహరించడం
ఎవరికిష్టముండదు?
అలాగని రంగునీళ్లతో
స్నానం చేయాలనుకోవడం
ఎంతవరకు సబబు?

మనిషి నుండి రంగును వేరుచేసి
రంగే మనిషనడం ఏం న్యాయం?
పరిమాణాన్ని పంచలేని
సప్తవర్ణ పుష్పాలైనా
ఏ కొప్పుకి అందం?

మట్టి నుండి రంగుపుడుతుందని
అంటారు
మట్టివాసన వేయని రంగుకి
ఎన్ని సొగసులుంటే ఏం లాభం?

ఉచ్ఛ్వాస నిశ్వాసం మధ్య ప్రవహిస్తున్న
జీవనదిని ఏ రంగుతో పిలుద్దాం?

రంగుల యుద్ధంతో
కొట్టుమిట్టాడుతున్న
మానవతా జ్యోతికి
ఏ రంగు వేద్దాం?

రండి... ఆ దేవుణ్ణి ప్రశ్నిద్దాం
రంగుకి విలువిచ్చే చూపుని
మనిషికెందుకిచ్చావని
రంగుని విభజించే మనసుని
లోకానికెందుకు ప్రసాదించావని

సృష్టికి పూర్వం ఏ రంగు
నిలిచి ఉంది?
సృష్టికి చివరన ఏ రంగు
వెలుగుతుంది?

మరణానికి లేని రంగు
స్మశానానికి ఎందుకు రుద్దబడింది?
వెలుతురుకి ఉన్న రంగు
చీకటిలో ఎందుకు మలినమైంది?

మట్టిలో పుట్టి మట్టిలో
కలిసే ఈ దీపాలకి
రంగెందుకు?
ఆ రంగుకి పేరెందుకు? ♦

---

## ఐడెంటిటీ

- డా.యస్.సత్యప్రసాద్
94405 44675

నువ్వెవరు? అంటూ..
ప్రశ్నల పరంపరలు
నీ ఉనికి చెప్పమంటూ
శూలశోధనలు
నాకే తెలియదు
నేనెక్కడ పుడుతున్నది
నేను పుట్టేసరికే..
నాపై ఓ ముద్రవేసున్నది
ఊహవచ్చాక తెలిసింది
అది.. కులం ముద్ర
దానితో ఇంకొకటి
అది.. మతం ముద్ర
ఎదుగుతున్న కొద్దీ
ఇంకెన్ని ముద్రలో
స్థానిక ముద్ర..
జాతీయ ముద్ర
వృత్తి ముద్ర..
ప్రవృత్తి ముద్ర
ఇంకా మరెన్నో ముద్రలు
ఎన్ని ముద్రలు వేసినా
నాకున్నది...
ఒకే ఒక్క ఐడెంటిటీ
మారిపోనిదీ, మార్చలేనిదీ



కాలపరీక్షలో నిలిచేది
నన్ను కోసి చూసినా...
నిరూపణ అయ్యేది
ఆ ఒక్కటే
యూనివర్సల్ట్రూత్
అదే..
మనిషి అనే
నా ఐడెంటిటీ. ♦




# 'కథాభారతి'కి అనువాద హారతి

- ఎమ్వీ రామిరెడ్డి
9866777870

తెలుగు కథ కొత్త పుంతలు తొక్కుతోంది. మిగతా భాషల కథా సాహిత్యమూ తక్కువేం కాదు. ఇతర భారతీయ భాషల్లోనూ భిన్న శైలీశిల్పాలతో కథ తలెత్తుకు నిలబడుతోంది.

అనువాదరంగంలో నాలుగు దశాబ్దాల అనుభవం గడించిన ఆర్.శాంతసుందరి 11 భాషలకు చెందిన 19 మంది సుప్రసిద్ధ రచయితల కథలను తెలుగులోకి అనువదించి, వెలువరించిన సంకలనం "కథా భారతి". హిందీ, ఉర్దూ, పంజాబీ, రాజస్థానీ, మైథిలీ, గుజరాతీ, బెంగాలీ, నేపాలీ, ఒరియా, తమిళం, మలయాళం రచయితలు సృజించిన కథలను శాంతసుందరి తెలుగు అక్షరాలతో సత్కరించారు.

ఇందులోని ప్రతి కథా ఒక ప్రత్యేక ప్రతిపత్తి గల పాత్యాంశంలాంటిది అంటే అతిశయోక్తి కాదు.

సంక్షోభాల వెనక దాగి ఉండే కుట్రలు, అనుబంధాల మధ్య ఆత్మవంచనలు, హక్కుల అంతరార్థాలు, స్వార్థం దుప్పటి కప్పుకున్న పేగుబంధాలు, కనిపించకుండా కవ్వించే అదృశ్య శక్తులు, 'ముంపు'నకు గురైన జ్ఞాపకాలు, అవసరార్థం ప్రాణం పోసుకునే రాజీసూత్రాలు, సాధారణ జీవుల సంక్షోభ జీవనం, మధ్య తరగతి మథనం, మగవారి దాష్టీకం, కుటుంబాల్ని కొద్దికొద్దిగా తినేసే పేదరికం... ఇలా అనేకాంశాల సమాహారం ఈ కథాగుచ్ఛం.

గుక్క తిప్పుకోని వేగంతో నడిచే రాజస్థానీ కథ "హక్కు". తనో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్. సర్జన్‌ను కలిసి అబార్షన్ చేయమంటుంది. ఆసుపత్రి లీగల్ సలహాదారు కుదరదంటాడు. అబార్షన్ చట్టం ప్రకారం ఇరవై వారాల వరకూ 'అది నా హక్కు' అంటుందామె. అది పెళ్లయిన స్త్రీలకు మాత్రమేనని సలహాదారు వాదన. పోనీ, 'భర్త పేరు రాయండి, అబార్షన్ చేస్తాం' అంటారు.

'అల్రెడీ ఓసారి చేయించుకున్నా. లివింగ్ టుగెదర్. నా ఇష్టం' అంటుందామె.

చేయకపోవడమనేది తన స్వేచ్ఛకు భంగం కలిగించడమేననీ, హక్కును తిరస్కరించడమేననీ వాదిస్తుంది. తన స్వరాన్ని బలంగా వినిపిస్తుంది.

డాక్టర్ ఓ కోరిక కోరతాడు. "మిస్ ప్రియా! మీరు స్వతంత్ర భావాలున్న వారు కదా. మీకు అబార్షన్ చేసే సమయంలో ఈ ఆపరేషనంతా మేము అల్ట్రాసౌండ్ వీడియోతో రికార్డు చేస్తే మీకేమీ అభ్యంతరం ఉండదనుకుంటాను. అందులో మీ శరీరం వెలుపలి భాగాలేవీ కనబడవు. ఆపరేషన్ మీకు జరుగుతోందని ఎవరికీ తెలీదు. గర్భం లోపలి భాగాన్ని మాత్రమే వీడియో తీస్తాం" అంటాడు.

తనకేం అభ్యంతరం లేదంటుంది. వీడియో తీస్తారు.

ప్రియను వార్డుకు మార్చాక డాక్టర్లు, కొందరు సిస్టర్లు ఓ గదిలో కూచుని దాన్ని చూస్తుంటారు.

"వీడియోలో శిశువు అన్ని అవయవాలు తయారైన పిల్లవాడిలా కనిపిస్తున్నాడు. చేతులు, కాళ్లు ఆడిస్తున్నాడు. కళ్లు మాత్రం మూసుకుని ఉన్నాయి. పెదవులు కదుల్తున్నాయి. శరీరం కదులుతూనే ఉంది. గర్భంలోకి పంపిన పరికరం

దగ్గరకి రాగానే శిశువు ఉలిక్కిపడి, కాళ్ళూచేతులూ ముడుచుకున్నాడు. దాన్నించి తప్పించుకోవడానికి ఇటూ అటూ కదలసాగాడు. పరికరం మొన చేతి దగ్గరగా వచ్చేసరికి తన బుల్లి చేత్తో దాన్ని పట్టుకున్నాడు. పరికరం వాడి జబ్బమీద బిగుసుకునే సరికి...".

ఈ వాక్యాలు చదువుతుంటే మన శరీరభాగాలు ఒక్కొక్కటే తెగిపడుతున్న ఫీలింగ్ కలుగుతుంది.

అబార్షన్ చేసిన సర్జన్ కీచుగొంతుతో "ప్లీజ్ స్టాప్ ఇట్! ఇట్స్ హారిబుల్ టు వాచ్" అని వెర్రికేక పెట్టి గబగబా బాత్రూంలోకి వెళ్లిపోతుంది.

తేరుకున్నాక "ఇంక నేను నా జీవితంలో అబార్షన్ చెయ్యలేను" అంటుంది. "ఆ పిల్లకి ఈ వీడియోని కాపీ తీసి తప్పకుండా పంపించే ఏర్పాటు చెయ్యండి" అని కూడా అంటుంది.

కథ చదవడం పూర్తయ్యాక పాఠకుడు కోలుకోటానికి కచ్చితంగా సమయం పడుతుంది.

ఇదో అద్భుతమైన కథ. అంతకన్నా ఇంకేం చెప్పలేం.

భోపాల్‌లో గ్యాస్ లీకై సంభవించిన పెనువిపత్తు... ప్రజల మెదళ్లలోంచి అంత తేలిగ్గా చెరిగిపోని విషజ్ఞాపకం. రమేష్ ఉపాధ్యాయ్ రాసిన హిందీ కథ "ట్రాజడీ... మై ఫుట్!"లో ఆ దుర్ఘటన వెనక దాగిన కుట్రల్ని ఒక్కొక్కటిగా లీక్ చేస్తారు.

భోపాల్‌కు చెందిన నూర్ భోపాలీ మంచి కవి. గజల్స్ అద్భుతంగా రాస్తాడు. 1984లో యూనియన్ కార్బైడ్ ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదానికి వేలమంది బలయ్యారు. ఇంకొన్ని వేలమంది అంగవైకల్యం బారిన పడ్డారు. ఈ ఘోర విషాదానికి అక్కడికి దగ్గర్లోనే నివాసముండే నూర్ కుటుంబం బలైపోతుంది. ఏదో పని మీద వెళ్లిన అతను మాత్రం బతికిపోతాడు. కానీ కవిగా చనిపోతాడు. మతి భ్రమించి, కొన్నాళ్లపాటు సమాజంతో సంబంధాలు కోల్పోతాడు.

15 ఏళ్ల తర్వాత కథకుడు నూర్‌ను కలుస్తాడు, విజయ్ అనే సూడో రచయిత సాయంతో. అప్పుడు నూర్ గొంతు విప్పుతాడు. అందమైన పదాల పొందికతో 'భోపాల్ గ్యాస్ ట్రాజడీ'గా నామకరణం చేసుకున్న (చేయబడిన) ఆ దుర్ఘటన వెనక దాగిన కుట్రలను వివరిస్తాడు. ఒకటిన్నర దశాబ్దం పాటు ఆ విషాదం తాలూకు వివరాలు సేకరించిన నూర్... ప్రమాద పరిణామాలను, నిశ్శబ్ద కుట్రలను ఒక్కొక్కటిగా బయట పెడుతుంటే పాఠకుడు కూడా కార్బైడ్ గ్యాస్ గాలంలో చిక్కి విలవిలలాడతాడు. ఎప్పటికైనా "క్రిమి సంహారిణి" పేరిట ఓ నవల రాయాలని నూర్ తాపత్రయం. తాను కవిని కాబట్టి, కథ ఎలా అల్లాలో అర్థం కావడం లేదని చెబుతాడు. నిజానికి తన కుటుంబ విధ్వంసానికి మించిన కథ వేరే అక్కర్లేదని రచయిత అంతర్లీనంగా మనకు బోధిస్తాడు.

కథ అత్యంత సరళంగా సాగుతుంది. అనివార్యంగా సైన్సు సంగతులు ప్రస్తావించినప్పుడు ఎక్కడా అది పాఠకుడికి బోర్ అనిపించకుండా, ఆసక్తికరంగా కథ నడిపారు. "ప్రపంచంలో ఇటువంటి హత్యాకాండలు జరగటం ఆగిపోయే వరకూ మనం గాయాలని కెలుక్కోక తప్పదు" అని నూర్‌తో పలికించడం ద్వారా కథాప్రారంభంలోనే దాని లోతులను మనకు పరిచయం చేస్తాడు రచయిత.

"ఒక విదేశీ కంపెనీ మన దేశంలో కార్ఖానా తెరిచి, దానివల్ల జనం చచ్చిపోయే ప్రమాదం ఉందని తెలిసి కూడా జనసమ్మర్దం ఎక్కువగా ఉన్న కాలనీలో దాన్ని పెడితే, దాన్నేమనాలి? హత్య అనరా?" నూర్ ద్వారా రచయిత చెప్పించిన నిజాలు మన మనసుకు లోతైన గాయాలు చేస్తాయి. అమెరికన్ కంపెనీ తన దేశంలోనే ఆ కార్ఖానా ప్రారంభిస్తే బోలెడు నియమనిబంధనలు. ఖర్చెక్కువ. అదే వెనకబడిన దేశాల్లోనైతే తక్కువ ఖర్చు; డొల్ల నిబంధనల ఆసరా. కాబట్టే ప్రమాద ఘంటికలు మోగించాల్సిన అలారం నాలుగేళ్లుగా పని చేయకపోయినా మనవాళ్లు పట్టించుకోలేదు.

"భోపాల్‌లో గ్యాసు లీకవడం హఠాత్తుగా జరిగిన సంఘటన కాదు" అని కథ ద్వారా కుండ బద్దలు కొట్టి మరీ చెప్పడంలో రచయిత ఏమాత్రం సంకోచించలేదు.

కథ చదవడం పూర్తయ్యేసరికి మనకి ఊపిరాడదు. అలవికాని నిర్లక్ష్యం పట్ల వల్లమాలిన కోపం పెల్లుబుకుతుంది. 'వాస్తవ విషాదానికి అక్షరరూపం కల్పించడం ఎలా' అనే దానికి ఈ కథ ఒక ఐకాన్.

తల్వీందర్ సింగ్ రాసిన పంజాబీ కథ "యాక్సిడెంట్" అనేకాంశాలను లోతుగా చర్చిస్తుంది. విభిన్న వస్తువును అంతే గొప్పగా డీల్ చేశారు. సైకాలజీలో పాఠాలు చెప్పే ఆమె... తన భర్త ప్రకాశ్‌తో కలిసే ఉంటున్నా మనసుల మధ్య దూరం విస్తరిస్తుంది. ఏదో అసంతృప్తి. భర్తకు జాండిస్ వచ్చినప్పుడు ఆసుపత్రిలో పరిచయమవుతాడు డాక్టర్ వశిష్ట్. ఆమె మనసు మూలలో ఉన్న ఖాళీజాగా వైపు ఒక్కో అడుగే వేస్తాడు. ఆమెతోపాటు భర్తకూ, ఆమె కొడుకు రవికీ దగ్గరవుతాడు.

ఆమె వశిష్ట్‌కి మరింత దగ్గరవుతుంది. "ఎప్పుడూ ప్రకాశ్ స్పర్శనే నా జీవితానికి పరమావధిగా భావించాను. ఆ స్పర్శలో ఎటువంటి ఉద్రేకమూ కలగకపోయినా" అంటూ ఆమె మానసిక స్థితిని విశ్లేషిస్తాడు రచయిత.

వశిష్ట్‌ని కలిసి వచ్చేసరికి కొడుకు రవి స్కూలు నుంచి వచ్చి తల్లి కోసం ఎదురు చూస్తుంటాడు.

"కాలేజీలో మీటింగ్ అటెండ్ అవ్వాల్సివచ్చిందిరా" అని మొదటిసారి అబద్ధమాడుతుంది.

వశిష్ట్‌తో రెస్టారెంటుకెళ్లి... కొలీగ్ ఇంటికెళ్లానని చెబుతుంది ప్రకాశ్‌తో.

మరోవైపు వశిష్ట్ ఏకంగా ఆమె ఇంటికే రాకపోకలు సాగిస్తుంటాడు. ఎనిమిదో తరగతిలో రవి మంచి మార్కులతో పాసయ్యాడని తండ్రి బైక్ కొనిపెడతాడు.

ఓరోజు తన తల్లి వశిష్ట్‌తో దగ్గరగా ఉండటం గమనించిన రవి అదే విషయమై ప్రశ్నిస్తాడు. ఆమె ఏదో సర్దిచెబుతుంది.

క్రికెట్ ఆడటానికి వెళ్లిన రవికి యాక్సిడెంట్ అవుతుంది. వీల్‌చెయిర్ సాయంతో ఇంట్లో తిరుగుతుంటాడు. తెలివైన ఆ కుర్రాడు వశిష్ట్‌తో సంబంధం గురించి ఆమె సమాధానం చెప్పలేని ప్రశ్నలు సంధిస్తుంటాడు. ఆమె అపరాధిలా నిలబడుతుంది. ఆ నిప్పురవ్వను వెంటనే ఆర్పేయాలనుకుంటుంది. కానీ, అతను ఇంటికి రాగానే మళ్లీ కరిగిపోతుంది అతని కౌగిట్లో. వీల్‌చెయిర్‌లో కూచుని ఆ దృశ్యం రవి చూసి, కోపంతో ఊగిపోతాడు. పెద్ద ఘర్షణ జరుగుతుంది. అదుపు తప్పిన వీల్‌చెయిర్ మెట్లమీంచి కిందికి పల్టీలు కొట్టడంతో రవి చనిపోతాడు.

అక్కడ మొదలవుతుంది కథ. ముక్కలైన ఆమె మనసులో దుఃఖాగ్నిలోని జ్వాలల్ని ఒక్కొక్కటిగా బయటికి తీస్తూ రచయిత కథ నడిపిన తీరు అపురూపం. మానవసంబంధాల్లో అర్థం కాకుండా మిగిలిపోయే అనేక ఘట్టాలకు ఈ కథ విపుల వేదిక.

'యాక్సిడెంట్'లోని కథానాయికకు భిన్నమైన పార్శ్వంలో దర్శనమిస్తుంది బి.చంద్రిక రాసిన మలయాళీ కథ "జ్యోతి విశ్వనాథ్"లోని జ్యోతి. ఆరున్నొక్క శ్రుతిలో వ్యంగ్యస్వరంతో గానం చేసిన గొప్ప కథ ఇది. ప్రారంభమే చిత్రంగా ఉంటుంది. తన కొడుకును సంప్రదాయ విధానంలోనే చదివిస్తానన్న అగ్నిహోత్రావధాని నిర్ణయంపై ఆయన భార్య వెంకమ్మ భగ్గుమనడం, గిరీశం ప్రస్తావన, గురజాడ-పెట్టుబడిదారీ వ్యవస్థ- భూస్వామ్య వ్యవస్థలపై చర్చను గమనిస్తే... శాంతసుందరి ఈ కథను మూలకథ కన్నా దృఢంగా నిర్మించినట్లు కనిపిస్తుంది.

"ఇందిరానగర్‌లో ఆడవాళ్లకి జ్యోతి అంటే గౌరవం ఉండేది కాదు. ఎందుకంటే స్త్రీల హక్కులూ, సమానత్వం కోసం వాళ్లు చేసే పోరాటంలో జ్యోతి ఏమాత్రం ఆసక్తి కనబరిచేది కాదు"... జ్యోతిని ఇలా పరిచయం చేస్తారు. ఆనక మెల్లగా ఆడవారి హక్కుల్లోని డొల్లతనాన్ని వ్యంగ్యధోరణిలో ఉతికి ఆరేస్తారు. 'జ్యోతి అందరిలాంటి సామాన్యురాలైన భార్య' కాదని చెబుతూ... రాయవలసిన సిద్ధాంత వ్యాసాల అవసరార్థం రాజీ పడే వైనాన్ని అరుదైన రీతిలో ఆవిష్కరించారు. ముగింపు మరింత చమత్కారం.

మాయా ఠాకూరీ నేపాలీ కథ "అవతలి గట్టు". మూడేళ్ల తర్వాత అతను ఊరికి బయల్దేరాడు. ఈశాన్య భారతంలోని తన స్వగ్రామానికి చేరుకోవడానికి పగలంతా నడకే శరణ్యం. భార్య నెల తప్పింది. ఆమె మాట మేరకే గ్రామ పర్యటన. అక్కడ తల్లి, ఆమెకు అండగా ఓ పనిమనిషి. 'కొడుకొస్తాడు, వెంట తీసుకెళ్తాడు, సేవ చేయొచ్చనీ; మనవడు పుట్టాక వాడితో ముద్దుమురిపాలు పంచుకోవాలనీ' కళ్లు కాయలు కాచేలా చూస్తుంటుంది తల్లి.

కోడలికి తీసుకెళ్లడానికి నెయ్యి, బియ్యం, మసాలాలు సిద్ధం చేస్తుంది.

కానీ, కోడలి స్వరం వేరు. ముక్కుతూ మూలుగుతూ, ప్రతి దానికీ సతాయించే అత్తను తీసుకురావద్దని మొగుడికి గట్టిగా చెప్పి పంపిస్తుంది. బదులుగా భగరనీ (పనిమనిషి)ని మాత్రం తప్పనిసరిగా తీసుకురమ్మంటుంది.

కొడుకా విషయం చెప్పగానే తల్లి తల్లడిల్లుతుంది. భగరనీ కూడా బాధ పడుతుంది... పెద్దరికం మీద పడ్డ తన యజమానురాలి(అతని తల్లి)ని ఎవరు చూసుకుంటారా అని!

పనిమనిషికున్న పట్టింపు కూడా పుత్రుడికి లేకపోవడాన్ని నేపాలీ కథ "అవతలి గట్టు" ఆర్ద్రంగా ఆవిష్కరిస్తుంది. బస్సు దిగి నడుస్తున్న దారిలో కలిసిన ఓ పెద్దాయనతో చెప్పిన కబుర్ల ద్వారానే ఈ పరిస్థితుల్ని విశ్లేషించడం రచయిత వ్యూహాత్మక చతురతకు నిదర్శనం.

◆◆◆

డాక్టర్ శ్యామ్ సఖా "శ్యామ్" రాసిన హిందీ కథ

“ఎన్‌కౌంటర్”.

రోజూ ఫోన్ మోగుతుంది. ఆమె ఎత్తుతుంది. అట్నుంచీ మౌనం.

అతనెత్తితే మాత్రం పొడిపొడిగా ఒకటో రెండో మాటలు.

నెలల తరబడి ఈ ఫోను తంతు నడుస్తుంది. అట్నుంచి ఎవరు మాట్లాడుతున్నారో తెలియని స్థితిని కథలో ఉత్కంఠభరితంగా ఆవిష్కరిస్తారు రచయిత.

ఆఖరికి ఆ ఆగంతక మహిళ సూచన మేరకు అతను ఢిల్లీ వెళతాడు. ఉద్విగ్న క్షణాల అనంతరం ఆమె ఎదురు పడుతుంది. స్కూల్లోనూ, కాలేజీలోనూ ఆమె తన గర్ల్‌ఫ్రెండ్!

ఇద్దరూ తమ “అప్పు” తీర్చుకోవడానికి సిద్ధమవుతారు.

ఏమిటా అప్పు? ఎందుకా అప్పు?

తెలియాలంటే, ఈ కథలోని నాలుగు పదాల చివరి వాక్యం చదివి తీరాల్సిందే.

పూరన్ హొర్డీ రాసిన హిందీ కథ “ముంపు”.

ఇద్దరు మిత్రులు పడవ తయారు చేసుకుని బయల్దేరతారు. మట్టిరంగు నీళ్లపై భారంగా ప్రయాణిస్తూ ఏవేవో జ్ఞాపకాల అలల మీద కిందుమీద అవుతుంటారు. బాల్యం, ఆటలు, పాటలు, గొడవలు, అల్లరి, తల్లిదండ్రులు, కష్టాలు, పేదరికం... ఇళ్లు, వాటి నీడలు, గోడలు, గోడల మధ్య ఇక్కట్లతో సావాసం చేస్తూనే హాయిగా గడిపిన రోజులు... అన్నీ గుర్తు చేసుకుంటూ సాగుతారు. అదంతా ఎందుకో ఓ పట్టాన అర్థం కాదు. ప్రయాణం సాగుతున్న కొద్దీ కొద్దికొద్దిగా అర్థమవుతుంది... ఒకప్పుడు అక్కడో గ్రామం ఉండేదనీ, ఆనకట్ట నిర్మాణంలో భాగంగా అందరూ ఖాళీ చేసి వెళ్లిపోయారని!

ఈ కథలో రచయిత పాటించిన టెక్నిక్ మనల్ని ఆశ్చర్యానికి గురి చేస్తుంది. ఆ కాస్త కాన్వాసు మీదే ఒక గ్రామచిత్రాన్ని విభిన్న ఛాయలతో చిత్రిస్తారు. మనుషుల మధ్య అంతరాలను విశ్లేషిస్తారు. పెత్తందారీతనాన్ని ఎండగడతారు. మూఢనమ్మకాల గురించి ప్రస్తావిస్తారు. అన్యాయమూర్తుల అరాచకాన్ని గుర్తు చేస్తారు.

జి.తిలకవతి రాసిన తమిళ కథ “నాగలక్ష్మి” ఓ పేదయువతి కలలకు ప్రతిరూపం.

“పొద్దునెప్పుడో ఉప్పురాయి వేసిన గంజి తాగి, మధ్యాహ్నం నాలుగు ముద్దల చద్దన్నం తిని” బెత్తెడు తోక జీతంతో జీవనం సాగిస్తున్న యువతి నాగలక్ష్మి. “మెల్లకన్ను, ముందుకు పొడుచుకొచ్చిన పళ్ల”తో వికారంగా ఉండే నాగును ఆకర్షణీయంగా ఉండే ఆరుముగం ప్రేమిస్తాడు. తను కూడా ఆశ పడుతుంది. కానీ, మహిళా కార్మికుల పట్ల మేనేజర్ క్రూరంగా ప్రవర్తించినప్పుడు ఆరుముగం మౌనం వహిస్తాడు. దాంతో నాగు నిలువెల్లా ఊగిపోయి, అతగాణ్ని ఛీ కొడుతుంది.

ఉదాసీనతను మించిన చేతగానితనం లేదని కళాత్మకంగా రచయిత చెప్పిన తీరు ప్రశంసనీయం.

వర్షా అడాలజ రాసిన గుజరాతీ కథ “హల్వా” నాగలక్ష్మి కథకు కొనసాగింపులా కనిపిస్తుంది.

పేదరికాన్ని పెనవేసుకుని పుట్టిన అభాగ్యురాలు ‘కుసుమ్’. తల్లి పురిటినొప్పులు పడుతుంటే, తనకేమీ పట్టనట్లు, ముగ్గురు అమ్మాయిల తర్వాతైనా అబ్బాయి పుట్టాలని మద్యం సేవిస్తూ హనుమాన్ చాలీసా వల్లించే తండ్రి! ఆమెను ప్రసవిస్తూ కన్ను మూసిన తల్లి! ఆ గాయాలకు ఏకైక మలాము పెద్దక్క. తండ్రి మరో పెళ్లి చేసుకోవడంతో, అక్క నీడలోనే కుసుమ్ పెరుగుతుంది. పిన్ని తరచూ తయారు చేసుకునే హల్వా వాసన ఆ యువతి మనసులో వరదలెత్తుతుంది. కానీ దాన్ని రుచి చూసే భాగ్యం లేదు.

కుసుమ్‌కు పెళ్లయి, భర్త ఇంట్లో అడుగు పెట్టిన క్షణాన తనకంటూ ఓ ఇల్లు సమకూరిందని సంతోషంతో పొంగిపోతుంది. అంతలోనే భర్త క్రూరత్వం బహిర్గతమై తను(వు) మళ్లీ గాయాలమూట అవుతుంది. “అతనలా మీద పడ్డప్పుడు ఆమెకి రాబందులు మాంసం పీక్కుతిన్నట్టనిపిస్తుంది” ఆమెకు. అంత మునుగీతలోనూ భర్త ఎటో వెళ్లిన సంతోష సమయాన తన జీవితకాల వాంఛ అయిన హల్వా వండుకోవడం మొదలు పెడుతుంది. పిడుగులా ఊడిపడిన భర్త పిడిగుద్దులు కురిపిస్తాడు. ఆమె సహనం బాంబులా బద్దలవుతుంది. సివంగిలా తిరగబడుతుంది. పచ్చడిబండతో మొగుడి తల బద్దలు కొడుతుంది. ఆనక తాపీగా మళ్లీ “ఎంతో తన్మయత్వంతో హల్వా చెయ్యడం మొదలు పెడుతుంది”.

ఈ చివరి వాక్యం కథను ఆకాశమెత్తుకు తీసుకెళుతుంది.

రవీంద్రనాథ్ టాగూర్ రాసిన బెంగాలీ కథ “పనివాళ్ల స్వర్గం” లోతైన కథ. అప్పట్లోనే అంత అద్భుతమైన టెక్నిక్ వాడటం విశేషం. తరస్సుమ్ రియాజ్ ఉర్దూ కథ “మహానగరం”

## కవిత

# నిశ్శబ్ద విప్లవం

- మానాపురం రాజా చంద్రశేఖర్
9440593910

భృకుటి ముడి విప్పక ముందే
మనసులో చెరిగిన
పాద ధూళి చెదిరిపోతోంది!

దేహాన్ని కావలించుకున్న చేతులు
వలస పోవడానికి గుర్తుగా
ఆత్మభ్రమణం చేస్తున్నాయి

నిమ్మకు నీరెత్తినట్టు
కూర్చున్న పలాయన వాదులంతా
దేశద్రోహులే!

అద్దంలో ప్రతిబింబాల్ని వెదికి
దోసిట నీటిఅద్దంలో చూసుకోవడమంటే
నిజంగా వెర్రిబాగులతనమే!



కొత్తగా రెక్కలొచ్చి
ఎగిరిపోతున్న
కాలాన్ని అడుగు..
నానాటికీ దిగజారిపోతున్న
ఈ వ్యవస్థ లోతెంతో?

వెనకా ముందూ
గతమూ వర్తమానమూ
మరి
భవిష్యత్తూ!

రేపటి దాకా
ఆగి చూద్దాం!
మొన్నటి నీడలేవో
ప్రశ్నించే జాడల్లో
కనిపిస్తున్నాయి

తెల్లారితే
సరికొత్త ఉషోదయమే!

మేలుకొలుపుకి
ఎదురుచూసి అలసిపోయిన
వేల గొంతులు

నిశ్శబ్ద విప్లవానికి
స్వాగతం పలుకుతున్నయి!! ♦

---

ఓ విషాదగాథ.

మనోహర్‌సింగ్ రాథోర్ రాసిన రాజస్థానీ కథ "ఒడమీది ఒంటరి పక్షి'', ప్రదీప్ బిహారీ రాసిన మైథిలి కథ "శరణాగతులు", తరుణ్ కాంతి మిశ్రా ఒరియా కథ "అవరోహణ", విజయ్ హిందీ కథ "అతనెవరో" ... దేనినీ తక్కువ చేసి చూడలేం.

♦♦♦

ఇతర భాషల కథలని తెలియనంత బాగా అనువాదం సాగింది. వాక్యాలు తెలుగుదనాన్ని గుబాళిస్తాయి. మన పరిసరాలనే గుర్తు తెస్తాయి. మన చుట్టూ ఉన్న మనుషులనే ప్రతిఫలిస్తాయి.

"ముసలితనం అతని ముఖం నిండా ముడతలు నింపింది. తెల్లగా నెరిసిపోయిన పొడుగాటి జుట్టు, కనుబొమలు, అతని మొహంలో ఏదో విచిత్రమైన కాంతి... బహుశా అతనిలోని మనోబలం వల్లా, స్ఫూర్తి వల్లా కావచ్చు". (నేపాలీ కథ 'అవతలి గట్టు')

"అబద్ధాలు చెప్పేవాళ్లంటేనే చీదరించుకునే నాకు, నేను చెప్పే అబద్ధాలు చాలా అందంగా కనబడసాగాయి" (పంజాబీ కథ 'యాక్సిడెంట్')

"ప్రపంచంలో ఇటువంటి హత్యాకాండలు జరగటం ఆగిపోయేవరకూ మనం గాయాలని కెలుక్కోక తప్పదు!" (ట్రాజెడీ... మై ఫుట్!)

"కుసుమ్ అంటే పూవు. కానీ కుసుమ్ పుట్టిన ఇంట్లో సువాసనలు వెదజల్లలేదు. ఆ పిల్ల కూడా పూవులా నవ్వలేదు" (హల్వా)

"స్వర్గంలోని ఆ సోమరిపోతు సరస్సు పక్కనే చెట్టులా పాతుకుపోయి నిలబడేవాడు" (పనివాళ్ల స్వర్గం)

వంటి వర్ణనలు అచ్చంగా మన కథలేనన్న భ్రాంతి కలిగిస్తాయి.

అయితే, తెలుగు కథలతో పోల్చినప్పుడు ఈ కథల్లోని సంభాషణల్లో కొద్దిగా సాగతీత కనిపిస్తుంది. అనువాదంలో ఆ లోపాన్ని చాలావరకు సరిదిద్దారు రచయిత్రి.

ఆయా ప్రాంతాల వారి ఆహారపు టలవాట్లు, ఆహార్యం తీరు, అనుబంధాల తెన్ను, శ్రమజీవన శైలి, సంసారపు టగాథాలు, కపట ప్రేమలు, కలుషిత స్నేహాలు, న్యాయం కోసం ఆరాటం, కార్మికుల పోరాటం... ఇలా అనేకాంశాలు ఈ కథల గుండా పోటెత్తుతాయి.

వివిధ పార్శ్వాలలో విభిన్న కథాంశాలను సరళసుందరంగా ఆవిష్కరించిన శాంతసుందరి గారికి ప్రణామాలు.

♦

## కవిత

# ఎడారులన్నీ ఒకటి కాదు

- అడిగోపుల వెంకటరత్నం
9848252946



నేలను ఆక్రమించి
ఇసుక పరుపులు పరిచి పండుకున్న
ఎడారుల్ని వీక్షించటానికి...
రేణువుపై రేణువు నిలిచి
గాలిగోపురాలైన
ఇసుకమేటల్ని చూడ్డానికి
ఏ అబుధాబీనో
అరబ్ దేశానికో వెళ్ళక్కరలేదు
బిందువైన మనిషి చుట్టూ
వలయాలైన ఎడారులు
అన్ని ఎడారులు ఒకటి కాదు!

పుట్టింటి సంపద మోసుకొచ్చిన నదులు
అత్తింటి సముద్రానికి అర్పిస్తే
అప్పనంగా ఆకాశానికి అప్పగించింది
ఆవిరి మేఘాలుగా మారి
ఆకాశానికి వెండి తాపటాలై
చినుకు రాల్చని ఎడారులైనాయి!

మాగాణి పుణ్యభూమిపై
రైతు వరుణ జపం చేస్తుంటే
అర్ధాంగి శునాదేవి సమేతుడై
చినుకు ప్రసాదించని వరుణుడు
పుణ్యక్షేత్రాలకు పరుగులు!
ఎడారి మాగాణిని
కన్నీటితో తడుపుదామన్నా
కనురెప్పలు దాటని నీరు
కనుగుంటల్లో యింకాయి!

భవతీ భిక్షాందేహియన్న
ఎండిన డొక్కల ఏడ్పువిని
ఎంతకూ ప్రతిస్పందించని
ఇంటి హృదయం నిండా
నిర్దయ ఎడారి నిండుతుంది!

సముద్రాన్ని గుప్పిట పట్టిన ఆవర్తిని
నేలపై కక్షగట్టి
మానవాళి క్షయంకోరి
చరాచరాల్ని ధ్వంసిస్తూ
తుపాను ఎడారి కమ్ముకుంది!

మనిషి ఎడారి
ఇసుక రేణువు కావద్దంటూంది
ఎడారికింద దాగిన మాగాణిని
సస్యశ్యామలం చెయ్యమంటుంది! ♦

---

# తృతీయ కృతి

- సయ్యద్ జహీర్ అహ్మద్
9505152560



ప్రగతి పథంలో మన స్వగతం
దారిద్ర్య రేఖకు దిగువ పేదల్ని చూసి
విచలితమవుతుంది మన కండకావరం
బంగారు చేపల్ని అక్వేరియంలో బంధించి
దాచుకున్న సంపద మనదేనని అహంతృప్తి
బందీకాని బందిపోటు ముఠా తత్వ బేహారులు
ఉక్కు వలకు చిక్కిన సొరచేప సొగసరులు
కుంట చెఱువుల్లో గాలాలు వేసి కాలాలు లెక్కిస్తూ
చూపులు వేటలో కొల్లగొడితే చుక్కలు తాకేదెన్నడూ!
సముద్రంలో వల విసిరితే పెద్ద చేపలేం ఖర్మ
తిమింగలాలు సైతం ధర పలుకుతాయని
ధనస్వామ్యం
సంవత్సరానికి ఒకసారి పంచాంగం గ్రేడింగ్ చేసి
తిథి నక్షత్రాలను గణించి ద్యూతకేళిలో మునక
ద్వితీయ అద్వితీయమయ్యాక తృతీయ బలుపెక్కింది
మదమెక్కిన మస్తిష్కాలపై పేరుకొని క్షయరోగమైంది
విద్దూర విరూపం షరాబు మిత్రులు
ఏ పురాణ పురుషుడు ప్రవహించని దారుణం
బంగారు బతుకులు బంగారు ఆశిస్తే దరిద్రం
పుణ్యం ప్రాప్తం మోక్షం పరాధీన వంశం
విజ్ఞానం పెరిగిన మనసుపై మూఢత్వం కప్పుకుంది
బలహీనవర్గాలకు వితరణ చేస్తే వర్ధిల్లు అక్షయం
కుహనా సంస్కారుల్లారా కూడిన ద్రవ్యంతో కనకం కొని
తేవడం కుళ్ళును నింపడమే!
♦

నచ్చిన రచన

# సీమ మట్టిపరిమళమే 'మట్టిపోగు' కవిత్వం




- కెంగార మోహన్
9000730403

పిళ్లా కుమారస్వామి

మట్టిగూర్చి మట్లాడాలనిపిస్తే శివారెడ్డి గుర్తొస్తాడు. ఆయన మట్టి మనిషి కవిత కళ్ళముందు కనబడుతుంది. బహుశా మట్టికి కవిత్వ పరిమళాలద్దిన అతికొద్దిమంది కవుల్లో శివారెడ్డిది అగ్రస్థానమే. అందుకే రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి ఆయన కవిత్వం సమీక్షిస్తూ " శివారెడ్డికి మట్టిమీద ఎనలేని ప్రేమ, మనిషిమీద సాటిలేని గౌరవం. శ్రమమీద అభిమానం, ఫలితం మీద గురి. శివారెడ్డిది మనిషి పక్షం, మంది పక్షం, మంది మట్టి మనుషుల పక్షపాతం." ఇక్కడ ఈ మాట చెప్పటానికి వొక కారణం లేకపోలేదు. పిళ్ళాకుమారస్వామి రాసిన మట్టిపోగు కవిత్వంలోనూ ఈ సామీప్యత, సారూప్యత కనబడుతుంది. నిజంగా హృదయాన్ని స్పృశిస్తుంది. కవి అంతర్మధనం అనంతానంతలోతుల్లోకి వెళ్ళి కవితాసాగరమై ప్రవహిస్తుందా అనిపిస్తుంది. ఆ మట్టి..తనకళ్ళ ఎదురుగా మట్టి..ఎంత ధగా..ఎంత మోసం....నిజంగా బాధ..ఉబికివస్తున్న బాధ.. ఆ కవిత చూద్దామా..

*వాన మబ్బులు ఒక్కొక్కటి ఆదృశ్యమై/ మట్టిలోని ఒక్కో రేణువు ఎదురుగా నిలిచి/ దాహంతో/ నను దీనంగా అర్థిస్తుంటే/ కన్నీళ్ళను దోసిట్లో తీసుకొని నెర్రెలలో పోసినాను/ నేలను కర్మను నమ్మిన మనిషి/ నిలుచున్నాడు ఒక శిలాజంలా/ ఎక్కడో వీచిన గాలి/ ఇక్కడికి దుమ్మును మోసుకొచ్చి/ ఆకలి అరుపుల నోళ్ళలో కొట్టింది..*(తడిసిన నేల) ..

ఇది గాయమే కదా..మానని గాయమే..ఎవరూ మాన్పలేని గాయం..ఇక్కడ గాయం కూడా ఎంత పదునయ్యిందో కదా...కన్నీళ్ళు దోసిట్లోకి రావడం మాటలు కాదు..దీన్ని అభివ్యక్తి అనో, ఎత్తుగడ అనో ..కవితాత్మకంగా వాడాలని లేదు.. ఇవి కన్నీటి కవితాక్షరాలు..వేలచుక్కలు రాలి పడి కవితామొక్కలై పురుడుబోసుకున్న మట్టి అద్దిన వాక్యాలు.. కుమారస్వామి అనంత సాహిత్యలోకంలో ప్రత్యేకమైన కవి. ప్రగతిశీల భావజాలంతో ఏర్పడ్డ సాహితీస్రవంతి ఆవిర్భావం నుంచి సాహిత్యకార్యకర్తగా వచ్చిన కవి. 2007లో ప్రపంచీకరణపై పోటెత్తిన కవితా సంద్రం కవిత్వ సమీక్ష తీసుకొచ్చి మరోప్రపంచం కోసం తన వంతు కర్తవ్యంగా ఎత్తిపట్టిన ఉద్యమ జండా అతడు. ఈ కవికి ఎంత విశాలహృదయం ఉన్నా..తన సొంత గడ్డపై మమకారం తగ్గలేదు. కరవుసీమలో పుట్టిన కవులకు కవితావస్తువులు ఆ మట్టే అందిస్తుంది. అందుకే *మా పల్లె యోధులంతా/ కాంక్రీటు అరణ్యాల పునాదుల్లోకి ఒరుగుతున్నారు/ నడుము వంగి వడలు కృంగి/ కన్నవారి కోసం/ ఎదురుచూసే/పండుటాకుల కన్నుల్లో /ఇంకిపోయిన కన్నీటి సాక్షిగా/ పల్లె ఇపుడు ఒంటరి పక్షి* (ఒంటరి పక్షి)..ఎంతభారమైన బతుకులు ఇక్కడి ప్రజలు మోస్తారో ఎవరికి అంతు చిక్కదు. పల్లెలిపుడు అందాల నందన వనాలు కాదు..కవి అందుకనేమో కన్నతల్లి లాంటి పల్లెను

స్మశాన మందిరమంటాడు. ఈ కవి మట్టిపోగు కవిత్వం కోసం తపన పడలేదు..బాధ పడలేదు..ఆవేదన..ఆక్రందన కానరావు..మౌనంగా కార్చిన కవిత్వ కన్నీళ్ళే దర్శనమిస్తాయి. కవిత్వంలో తాత్వికతను అన్వేషిస్తాడు. కవిత్వంలో అన్ని వస్తువులు కనబడతాయి. ఈ సంపుటికి పెట్టిన శీర్షిక మట్టిపోగు తాత్విక ఆలోచన కలిగిస్తుంది. అందుకేనేమో తెలకపల్లి రవి ఈ కవితామట్టిని స్పృశిస్తూ "మట్టితో మమేకమైన మనసు పాడే పాటగా మనను వెన్నాడతాయి" అంటాడు. కవిత్వం ఎక్కడికో తీసుకుపోయినట్టనిపించినా స్పష్టమైన గమ్యాన్ని చూపిస్తుంది. ఇలాంటి కవిత్వంతో చాలా దూరం సంచరిస్తాడు..మది దిగంతాల్లోకి వెళ్ళి వెతుకుతాడు. కవిత్వ తాత్వికను ఆవిష్కరించే క్రమంలో..

***"చావు పుట్టుక మధ్యేగదా జీవితం/ కనులు మూచి తెరిచినంతే కదా మానవ ప్రస్థానం/ మంచులా కరిగిపోయే కాలంలో నువ్వేం చేశావు/ దారిపొడవునా వినిపించే శోకంలో శ్లోకానికి నువు లయమైనావా"*** కవి స్పష్టంగా వొక మార్గాన్ని..కాదు కాదు..వొకే మార్గాన్ని..వొకే మార్గంలో వెళుతున్నాడని అనిపించినా జీవిత పరిణామ క్రమంలో భావజాలం లోపించనప్పటికీ అశాస్త్రీయమైన వెదుకులాట కనబడుతుంది. అవుననడానికి హేతువులున్నాయి. హేతువాది చలం చరమాంకంలో రమణాశ్రమం చేరినట్టు కుమారస్వామి కవిత్వ పరిణామక్రమంలో పురోమనం వైపు నడుస్తూనే వడివడిగా కాక వెల్లిగా..వెలి వెల్లగా వేస్తున్న భ్రాంతి కనబడుతుంది..ముమ్మాటికీ తిరోగమనం మాత్రం కాదు..అయితే మచ్చుకైనా సైద్ధాంతిక భావజాలం విషయంలో ఎక్కడా రాజీ పడని తత్వం తన కవితాక్షరాల్లో కనబడుతుంది. కరవు సీమ అనంత నుండి ఎన్నో కవిత్వ సంపుటులొచ్చాయి..కథా సంపుటిలొచ్చాయి..అవన్నీ గొప్ప కవిత్వమనే తీర్పులివ్వదలచుకోలేదు.కాని ఈ మట్టిపోగు కవిత్వం మాత్రం గుండెపొరల్ని చీల్చుకొని వచ్చిన సైద్ధాంతిక చైతన్యజ్వాల అనక తప్పదు. ఒక్కమాట చాలు తన కవిత్వం ఎంత బలమైందో చెప్పటానికి..ఎంత గాఢతగా చెబుతాడంటే సీమబతుకుల్ని వొక్కమాటలో వొకే వొక్కమాటలో చెప్తాడు.. ***"ఒక విత్తు అప్పుల ఊబిలో/ ఊపిరాడక తనువు చాలిస్తుంది.."*** ఇంతకంటే ఏంకావాలి..అతను తడియారని కవి అని..

కవిత్వానికి నిర్దిష్టమైన నిర్మాణసూత్రాలెవరూ చెప్పకపోయినా కవిత పేలవంగా కాక..భారంగా ఉండాలని కుమారస్వామి కోరుకుంటాడు..వస్తుశిల్పసౌందర్యాల కవిత్వం రాస్తూనే ప్రాంచికదృక్పథంతో కవిత్వీకరించడం అసాధారణ విషయం. దు:ఖసాగరంలో మునిగితేలడం మట్టిపోగు కవిత్వం. కవిత్వంలో అక్కడక్కడా చెప్పకనే చెప్పే ఆవేశం.. ఉద్రేకం..అసమానతల సమాజంపై, ఈ దుర్నీతిపై అక్షర తిరస్కారం ప్రకటిస్తాడు.

***" సుఖమంటే ఏమిటో తెలియనివాడు***
***జీవించడం తెలియనివాడు***
***జీవితాన్ని అప్పుడప్పుడూ ప్రేమిస్తున్నవాడు***
***మన హొయల్ని గుర్తించనివాడు***
***చెమటధారల్ని ఒడిసిపట్టుకొంటున్నవాడు***
***బక్కచిక్కిన బడుగుజీవుడు"*** (మబ్బులు కమ్మిన రాత్రి) ఇలా ఎవరు చెప్పగలరు..ఇవి రాళ్ళ బతుకులు అని స్పష్టంగా తెలిసిన వాడు..కాదు ఈ బతుకులతో మమేకమై, కాదు కాదు అంతర్లీనమై, అంతర్మథనంలో బతుకీడుస్తున్న కవి కుమారస్వామి..ఎండిన రాయలసీమ గుండె సాక్షిగా ధిక్కార స్వరాన్ని పెగల్చుకుని, ధిక్కార పతాకాన్ని ఎగరేస్తున్నవాడు..తన కవిత్వం నిండా గాయాలు..మానని గాయాలు..ఈ సంపుటికి పెట్టిన శీర్షిక మట్టిపోగు కవిత హృదయవిదారకమైన అభివ్యక్తి..అనిర్వచనీయమైన కవితా ఎత్తుగడ..ఆ కవితను వొడిసి పట్టుకుంటే..

***"పొదారిన ఆకాశం/ ఒక్కొక్క రక్తపు బొట్టు కారుస్తోంది/ నెర్రెలు బారిన నేల/ ఆర్తి గీతాన్ని వినిపిస్తోంది నలుదిక్కులా/ ఎడారులు పరుచుకున్న/ భూమిపుత్రుల హృదయాల్లో/ ఒయాసిస్సులు ఉదయించట్లేదు/ మబ్బులు మోసం చేస్తూ/ విచ్చుకత్తులు విసురుతుంటే"***

రాజ్యం విసిరిన ఆర్థిక వ్యూహంలో క్షతగాత్రుడవుతున్నాడు..గాయం మీద గాయం..పుండు మీద పుండు..రాచపుండులా సీమబతుకులు..ఇక్కడ క్షతగాత్రుడు రైతే కావచ్చు..ఈ కవితా సన్నివేశం.. కన్నీటి వర్షం.. ఎన్నాళ్ళు దాచుకున్నాడో..ఎంత భారంగా అదిమి పట్టుకున్నాడో..ఈ బతుకులు మారాలని చేస్తున్న కవిత్వ ప్రయత్నం గొప్పది..

రాయలసీమ బతుకుల గూర్చి ఎన్నో కవిత్వాలొచ్చాయి..కవిత్వ సంకలనాలు, సంపుటాలు తెలుగు సాహిత్యమంతా పరచుకున్నాయి. కవిత్వం నిండా ఆక్రందనలే..బాధలే..కన్నీళ్ళే..ఈ గాయం మానని గాయం..ఇలాంటి గాయాలు ఎప్పటికి మానుతాయో తెలియదు..ఎంతమంది కవులు ఉద్భవిస్తారో తెలియదు..కాని అందరూ క్షతగాత్రులే..రాళ్ళబతుకులు మారాలని కలాలు పట్టి గళాలు పెగిల్చి రణన్నినాదం చేస్తున్న కవులదరికీ ఈ మట్టిపోగు స్ఫూర్తినిస్తుంది..తడారని కన్నీటి చెమ్మ అక్షరమై కనబడుతుంది.. ♦

**కవిత**

# అడవి చేతులు ముడుచుకుని కూకోదు..

- పల్లిపట్టు నాగరాజు
9989400881



వెళ్లిపోవడం కుదిరేపనికాదు
ఇంటిని మూటగట్టుకుని
బుజాలపైనేసుకుని
భుజాలపై పనిముట్లతో పొద్దంతా
బువ్వకోసరం తిరిగీ తిరిగీ బెట్టబడి పోయుండాము
ఇప్పుడేగాదు ఎప్పుడూ వెళ్లిపోవడం కుదిరే పనికాదు
బతుకుల్ని ఈడే పైరు చేసుకుంటుండాము.!
2
యుగాలుగా
మా దేహాల్ని తవ్వుకుంటుండారు గదా
ఇప్పుడు మా ఇండ్లను కూడా తవ్విపోసుకుంటారా?
3
ఇది మా ఇల్లు కాదా?
ఇది మా ఊరుకాదా?
మా కొంపాగూడూ మీ కండ్లల్లో పల్లేదా.?
మీరు పొమ్మన్నపుడల్లా పోతావుంటే
ఎంత దూరమని పోవాలి.?
ఈ చెట్లకు అల్లుకున్న మా చేతుల తీగల్ని తెగ్గోసుకుని
ఈ మట్టిన పాకుతున్న మా వేరుపేగుల్ని తెంచేసుకుని
మా జీవితాలు వల్లకాడు జేసుకుని ఎల్లిపోవలా?
అంతంలేని మీ దుడ్డుదాహం ఆవిలించినప్పుడంతా
మా అడుగులు తుడుచేసుకుని ఆగమైపోవాలా?
4
మా ఇంటి చుట్టూతా ఎన్నన్నీ
ఆకలేసినప్పుడు మాత్రమే
పురుగోబుర్రో తినే అమాయక పచ్చులూ
కాయోకసువో తిని కాలమెల్లదీసే మూగజీవాలు
ఒకటా రెండా...
గాయమైనప్పుడు ఆకుపసురైన అడవి
పడిసమొస్తే కసాయమైన అడివి
నాటువైదిగానికి ఆదిపాఠమైనట్టే
వేటవిద్దెలోనూ అనాదిపాఠశాలని
అపుడే మరిచిపోతే ఎట్టబ్బా.!
ఎంతటి కొమ్ములు తిరిగినదాన్నైనా
రొమ్ములోకొట్టి దొమ్ముకాయలు చీల్చి
చియ్యలుచెయ్యడం నేర్పింది మాకు అడివమ్మేగదా
అదిగూడా మరిచిపోతే ఎట్టామరీ.!?

5
పోండి పోండని మరీ వొళ్ళు మండించకండీ
మండిపడే ఎండుకొమ్మలున్నాయి
సుర్రని మండే ముళ్లసుదుగులున్నాయి
కాలడమేగాదు కాల్చిపడేస్తాయి
చెట్లకడుపుల్లో
పురాతనంగా రగులుతున్న నిప్పుకల్లులున్నాయి
6
అయినా
మా ఇల్లు అడివే కావచ్చు
అడివిది కూడా మనిషి బతుకనే యోచనలేదా?
అడివిలోనూ బతుకులుంటాయని గెవనముండద్దా?
చెట్లు
పారా మడక గొడ్డలి పిక్కాసుల పిడులై
పిడికెళ్లలో చేరి బతుకుపోరు నడిపినట్టే
అడవి తలుచుకుంటే
కర్రలు ఉరిమే ఆకాశమూ అవతాది..!
7
వొకనీతీపాతీ లేకుండా
ఎల్లుండెల్లుండని వేదిస్తావుంటే
ఏడ్పుల్లో అడవులు తగలబడిపోతావుంటే
ఏ అడివైనా చేతులుముడుచుకు కూకుంటాదా..!?

(...అడవిబిడ్డలకు...)

◆

## నచ్చిన రచన





డా॥ రావి రంగారావు

# సహజ వెలుగుల షాండ్లియర్


- టేకుమళ్ళ వెంకటప్పయ్య
9490400858


**డా.** రావి రంగారావు రచించిన ఇటీవలి వచన కవితా సంపుటి "కొత్త క్యాలండర్". మనిషి జీవితంలో కాలానికున్న ప్రాధాన్యత అమూల్యం. నూతన సంవత్సరం రాగానే యాంత్రికంగా జరిగే సహజ పరిణామాలను "కొత్త క్యాలండర్" అన్న కవితా సంపుటిలో మనకు చూపించారు డా.రావి రంగారావు. చకచకసాగే ఏటిపరవళ్ళకి కొండలు కోనలు చెట్లు చేమలు రాళ్ళురప్పలు ఏమిఅడ్డం వచ్చినా ఆ ప్రవాహం ఆగదు. అలాగే కాలమనే ప్రవాహం కూడా ఎవరికోసమూ ఆగదు. అది అలా సాగిపోతూనే ఉంటుంది. ఆ విషయన్ని గుర్తుచేస్తూ ***"పుట్టినరోజు వచ్చిందన్నా/ కొత్త క్యాలండర్ పండగ తెచ్చిందన్నా/ బతుకు చెట్టుకు ఒక ఆకు రాలిపోవటం/ పుడుతూ వెంట తెచ్చుకున్న/ అగ్గిపెట్టెలోని ఒక అగ్గిపుల్ల కాలిపోవడం"*** అంటూ జీవితంలో వెళ్ళిపోయే ప్రతి వత్సరాల నైజాన్ని రాలిపోయే ఆకులతో, వెలుగువెలిగి ఆరిపోయే అగ్గిపుల్లలతో ఉపమానించారు. అగ్గిపుల్ల ఒక్క వెలుగు వెలిగి త్వరలోనే ఆరిపోతుంది. అది వెలుగుతున్న కాలము వరకే దాని ప్రయోజనము. వెలిగినంత కాలమే అందరు దీనిని చూస్తారు. ఆరిపోయాక బూది మాత్రమే మిగుల్తుంది. జీవితమూ అంతే. ***"కాకపోతే బతుకు రంగును ఓసారి చూసుకోవచ్చు/ అవసరమైతే మళ్ళీ దిద్దుకోవచ్చు/ ఏవేవో కొత్తరంగులు మన తృప్తికోసం పూసుకోవచ్చు"*** అంటారు. మనబతుకును మనమే పునర్దర్శనం చేసుకుని గతంలో చేసిన తప్పిదాలు పునరావృత్తం అవకుండా దిద్దుకునే అవకాశం మన చేతుల్లోనే ఉంది అన్న సత్యం చెప్పారు. కవితకు ముగింపునిస్తూ ***"నీ ప్రయాణంలో/ చీకటి ముక్కలు క్రిందపడితే/ అవి రేపు ముళ్ళచెట్లై జాతి గమనాన్ని చంపేస్తాయి/ నీ ప్రయాణంలో/ చెమట కిరణాలను వదిలిపెడితే/ అవి రేపు నేలమీద పడి పండి నలుగురినీ బతికిస్తాయి"*** అన్న గొప్ప జీవిత సత్యాన్ని ఎరుకపరచారు. జీవితగమనంలో ప్రతివ్యక్తికీ వెలుగురేఖలున్నట్లే చీకటికోణాలు కూడా ఉంటాయి. చీకటికోణాలు చీల్చుకుని, కంటక ద్వారాలను మూసి, వెలుగురేఖలను నింపుకోమని, స్వేదం విలువ తెలియజేస్తున్నారు. మహాకవి శ్రీశ్రీ "స్వేదజలానికి ఖరీదు కట్టే షరాబు లేడోయ్" అన్నాడు. "సిరాచుక్క స్పర్శ – చెమట చుక్కని రక్తం చేస్తుంది" అన్నారు ప్రముఖ కవి శివారెడ్డి. ఇవన్నీ స్వేదానికున్న విలువను తెలియజేసేవి. అలా చిందించిన స్వేదమే భావితరాలకు భవితవ్యమౌతాయి అంటున్నారు రంగారావు.

కవిత్వానికి, కవికీ నిర్వచనాలు చెప్పాలని భాష్యాలు చెప్పాలని, ఆదినుంచీ కవులు విమర్శకులు ప్రయత్నిస్తూనే ఉన్నారు. కవిత్వం అంటే 'ఫలానా' అని స్పష్టంగా, ఏకాభిప్రాయంగా ఇటు సంస్కృత లాక్షణికులు గానీ, అటు పాశ్చాత్త్యులు గానీ నిర్వచించకపోవడం వలన 'కవిత్వానికి నిర్వచనం సాపేక్షికమే గానీ పారమార్థికం కాదు" అంటారు విమర్శకులు. ప్రతి కవి కవిత్వమంటే ఏమిటో, కవి అంటే ఎలా ఉండాలో వారి వారి దృష్టికోణం నుంచి చెప్పడానికి యత్నిస్తూనే ఉన్నారు. రంగారావు గారు కూడా "కవి చెయ్యాల్సిందల్లా ఒక్కటే" అన్న కవితలో ***"కవిగా కరిగిపోయి –***

కరిగిపోయి ***కవితగా ప్రపంచంలోకి ప్రవహించడమే!/ జనంలోకి ఇంకిపోయి – ఇంకిపోయి/ మనుషులలో మానవత మొక్కగా మొలకెత్తడమే!/మనసులలో పరిమళాలు చక్కగా ప్రసరించడమే!”*** అంటారు. ఎవరెన్ని నిర్వచనాలిచ్చినా అవన్నీ కవితా సుందరి నుదుట సింధూర తిలకంలోని రేణువులే అని భావించుకోవలసిన అగత్యం ఉంది.

***“ఇంకా పాత కవితనే/ ఏం చెక్కుతుంటావు కానీ/ కొత్త కవిత మొదలెట్టు/ గుండెలో నీ దిష్టిబొమ్మ తీసేసి/ దేశాన్ని దేవతగా నిలబెట్టు/ అప్పుడే నువ్వు ఓ కొత్త క్యాలండరవుతావు”*** అన్నారు. కవికి దిశానిర్దేశం చేశారు. కాలంతోపాటూ నడుస్తూ, నిరంతర చైతన్యాన్ని నడకలో నింపుకుని ముందుకు కదులుతూ పోవడమే తన జీవన విధానంగా చేసుకున్న వర్తమాన ప్రగతిశీల కవి డా.రావి రంగారావు. కవిత్వం పట్ల ప్రేమేకాదు, ఆర్తీ తపనా ఉన్నవాడు. దానికోసం నిత్యం ఆలోచించేవాడు. ఆరాటపడేవాడు. తన జీవనావసరాలలో కవిత్వం అతిముఖ్యమైనదిగా పరిగణించేవాడు. గాలితో పాటు కవిత్వాన్ని కూడా శ్వాసించి రక్తంలోని జీవకణాలను చైతన్యవంతం చేసుకుంటున్నవాడు. సామాజిక చైతన్యమే కవిత్వానికి వాహిక కావాలని నమ్మిన ఈ కవి అణగ దొక్కాలనుకున్నదేదైనా సరే! ఎదురు తిరిగి ప్రభంజనమై ప్రళయకాల ఝుంఝా మారుతమై కాటేస్తుందని తెలియజెప్పే కవిత “మంచి విత్తనం”. భూమిలో పాతిన విత్తనాన్ని ఒక జంతువు తొక్కేయాలని చూస్తే ***“ఆజంతువు కాలిక్రింది ఖడ్గమై చంపేసింది/ మొలకై లేచి జంతువు కళేబరం ఎరువుతో/ మొక్కగా ఎదగటం మొదలెట్టింది”.*** ఈ కవితలో ఎన్నో అర్థాలున్నై. మరెన్నో సదేశాలున్నై. మనోబలం వల్లే మనిషి తాను కోరుకున్న లక్ష్యాలను చేరుకోగలడు. మనసే అన్నింటికన్నా బలీయమైంది. మనోబలం నిండుగా ఉన్నవాడే లక్ష్యం చేరుకోగలడు. అణచివేత కేవలం తాత్కాలికం మాత్రమే! చైతన్యం ప్రభవిస్తే లేడి పంజా దెబ్బకు బెబ్బులి వణకిపోతుంది. ఆ చైతన్యమే నేడు సమాజంలో లోపించింది. ఆటుపోట్లకు ఎదురొడ్డి నిలిచే శక్తిని ఆవాహన చెయ్యగలగాలి. ప్రతికూల పవనాలు అనుకూల పవనాలై అలరిస్తాయన్న సందేశం ఈ కవితలో ఉంది.

కవిత్వంపట్ల కవిలో రూపుదిద్దుకొన్న నిర్వచనాన్ని, సాహిత్య ప్రస్థానం పట్ల తన దృక్పథాన్ని సంపుటిలో ఒకటి రెండు కవితల్లో అంతర్లీనంగా వ్యక్తీకరించడం మామూలే! దీన్నే పాశ్చాత్య కవులు “మెటా పొయిట్రీ” అన్నారు. కవికి కవిత్వంపట్ల వుండాల్సిన దృష్టికోణం “నువ్వే ఓ కొత్త క్యాలెండర్” అన్న కవితలో తెలియజెప్పారు.

మనసు ఎల్లప్పుడూ మనిషి స్వాధీనంలోనే వుండాలి, మనిషి మనసు అధీనంలో ఉండడం కాదు. ‘మనిషి–మనసు’అనడంలో ఎంతో సహజత ఉంది. ‘మనసు–మనిషి’, అని అనడంలో పరోక్షవాస్తవం ఉంది. మనసు, మనిషి స్వాధీనంలో ఉంటేనే, మనిషి విచక్షణ జీవితానికి ఉపయోగపడుతుంది. మనిషికి–మనసుకు అవినాభావ సంబంధం ఉంది. అందుకే, మనిషి లేకుండా మనసు ఉనికి, మనసు లేకుండా మనిషి ఉనికి, ఇవి రెండూ వేరుగా ఉండడానికి అవకాశమే లేదు. ఇవి రెండూ, పరస్పర ఆధారాలుగా జీవితాన్ని గడపాల్సిందే. మనిషి నిత్యం అక్కరలేని, అవసరంలేని చెత్తని సదా మనసులో పోగేసుకుని తన్మయావస్త పడుతూ ఉంటాడు. అందుకే “మనసు” శీర్షికతో రాసిన కవితలో మనసు ఎలా ఉండాలో ఉంచుకోవాలో చెబుతూ ***“ఇందులో నువ్వు/ మంచి విత్తనాలు వేసుకున్నావనుకో/ మంచిపూల మొక్కలు/ రుచిభరిత వృక్షాలూ ఉన్న/ నందన ఉద్యానవనం అవుతావు”*** అంటున్నారు. అలా కాక మనసు నిరంతరం చెత్తతో నింపేస్తూ ***“ఎందుకు నువ్వు/ ఎవడి తలకాయో పగలగొడుతూ/ దొరికినవి దొరికినట్లే నెత్తురు రాళ్ళు తెచ్చుకుని పేర్చుకుంటున్నావు!/ ఓ పెద్ద రాళ్ళ కుప్పవై/ తేళ్ళగుంపుకో విష సర్పాలకో/ శాశ్వత భీకర తమో నిలయమౌతున్నావు?”*** అంటున్నారు. ఎంత విచిత్రమైనది మనసు. ప్రపంచ నదులన్నిటినీ సిరాగా మార్చి మనసు గురించి రాసుకుంటూ పోయినా ఇంకా ఏదో ఒక చీకటికోణం మిగిలి వికటాట్టహాసం చేస్తూనే ఉంటుంది. అందుకే ***“ఔషధమైనా విషమైనా/ మనసులోనుంచే తయారయ్యేది!/ మనసులో పుట్టేదే/ బతుకంతా పాకేదే”*** అన్న ముగింపునిచ్చారు.

పోలిక కవులు చేసే చాలా సామాన్యమైన ప్రక్రియ. మంచి పోలికలు కవి ఊహాశక్తికి గీటురాళ్ళుగా నిలుస్తాయి. పది కాలాలపాటు జనబాహుళ్యంలో నిలబడతాయి. రెండు వస్తువుల మధ్య యితరులకు స్ఫురించని సామ్యాన్ని చూడటంలోనే కవి ప్రతిభ దాగి ఉంటుంది. గతంలో పోలికల గురించి చూస్తే, బహుళ పంచమినాటి చంద్రుడు, ఆకాశంలో కాళ్ళు తెగిన ఒంటరి ఒంటెలా ఉన్నాడని చెప్పిన శ్రీశ్రీ, బావి భూమిబుగ్గపై ముడుచుకున్న నవ్వు సొట్టలా ఉందని ఇస్మాయిల్ చెప్పిన పోలిక మనకు మరపురావు. సమకాలీన కవులలో డా.రావి రంగారావు కొంత అసాధారణమ్మైన అరుదైన ప్రతీకలు తీసుకోవటం మనకు కనిపిస్తుంది. సి.నా.రె. “గదిలో సముద్రం” అన్నట్టుగా, ఆయన “పుస్తకం ఒక సముద్రం”

# అక్షర తాండవం

- లిఖిత
94407 97725



కొన్ని అనుభవాలు
ప్రచండ తుఫాను రేపి
నా కళ్ళల్లో వరదలు తెస్తున్నాయి
కొన్ని కరకు గాయాలు
కాలం మందు పూసినా
చుట్టూ చేరిన ఆక్షేపణల ఈగలు
పొడిచి పీలుస్తున్నపుడల్లా
సలపర పెడుతున్నాయి

నాలో నేను తప్పుకున్నపుడు
కొన్ని క్షణికావేశపు శిలలు
ఆటంకపరుస్తూ
ఆలోచనా కరాలకు సంకెళ్ళేస్తున్నాయి

కొన్ని పుల్లలు ఏరి గూడల్లుదామని
ఆశించిన మంచితనపు పిట్టలు
రాబందుల కళ్ళల్లోపడి
మౌన సరస్సులో
దుఃఖపు నీళ్ళు తాగుతున్నాయి

కొన్ని నిశ్శబ్ద శకలాలను
ఏరుతున్నపుడల్లా
అవాంఛిత ఆలోచనలు
మెదడుచుట్టూ సమస్యల సైనికులై
పహారా కాస్తున్నాయి

అనుభవాలను నలిపినలిపి
గట్టిగా అదిమి తీసిన సిరాచుక్కలతో
నింపిన నా కలం అక్షరగజ్జె కట్టి
కవన తాండవం చేస్తోంది.

♦

అన్నారు ఒక కవితలో. ఆ వైనమేమిటని చూస్తే ***"మొదటి అట్ట జననం – చివరి అట్ట మరణం/ రెండు అట్టల మధ్య ప్రవహించే జీవనసారం పుస్తకం/ బతకటమంటే పుస్తకాన్ని చదవటం/ పుస్తకాన్ని చదవటమంటే సార్ధకంగా జీవించడం"*** అన్నారు.

రెండు వస్తువులను పోల్చటం కన్నా, రెండు అనుభవాలను పోల్చటం ఇప్పటి కవుల్లో ఎక్కువగా కనబడుతోంది. ఆయా వస్తువులకు సంబంధించిన పోలికలు గమనించడంతో బాటూ వీటిని చదివినప్పుడు మనకు కలిగే అనుభూతి సాంద్రత చాలా ఎక్కువగా ఉంటుంది. ఇటువంటి ప్రయోగాల్లో విలక్షణమ్మైన అనుభవాలను కవులు ఎన్నో అందించారు. ***"ఒక్కొక్క అక్షరం ఒక మణి/ పుస్తకం అంటే మనసు మెదను అలంకరించే మహా మహా మణిహారం/ పుస్తకంలో కోట్ల ప్రాణులు/ పుస్తకమే కోట్ల ప్రాణాలు"*** అని ముగించారు.

మహాకవి శ్రీశ్రీ కూడ తన మహాప్రస్థానం కవితా సంపుటిలో సంధ్యాసమస్యలు అనే కవితలో "రాక్షీలో నార్మా షేరర్, బ్రాడ్వేలో కాంచనమాల" ఏది ఎంచుకోవాలో అర్థం కాలేదుట ఒక విద్యార్థికి. ఇలా సాగే ఓ కవిత "అటో/ ఇటో" ఈ సంపుటిలో ఉంది. ***"దినపతి సూర్యుడు/ ఉదయం ఆరుగంటలకు / అటో – ఇటో ఉదయిస్తాడు. "జీవాధారం మనిషి గుండె/ నిముషానికి డెబ్బై రెండు సార్లు/ అటో ఇటో కొట్టుకుంటుంది"*** అంటూ ఆ అటో–ఇటో అన్న మాటను అనేక సందర్భాలకు అన్వయిస్తూ రాసిన కవిత అలరిస్తుంది.

ఈ కవితా సంపుటిలో 80 కవితలున్నాయి. అన్నీ సూటిగా హృదయాన్ని తాకేవే! ఆయన కవితా సంపుటిలో ఆకులగలగలలు సంగీతంలా వినిపిస్తాయి. అద్దంలో మన ప్రతిబింబం ఎలా చూసుకోవాలో తెలుస్తుంది. మనిషి ఆరిపోతే కలిగే పర్యవసానాలు తెలుస్తాయి. నడుస్తున్న కాళ్ళు నగరం రోడ్లు దర్శింపజేస్తాయి.

ఇలా ఎన్నో కోణాల్లో విభిన్న శైలిలో మనకు జీవన విధానాలు, జీవిత పార్శ్వాలు దర్శనమిస్తాయి. కవితలు చదువుతుంటే అనుభూతిలో మునకలేసిన కవి పరితను కూడా అవే తరంగాల్లో లాక్కుని వెళ్తున్న అనుభూతి కలుగుతుంది. దాదాపు ఐదు దశాబ్దాలుగా కవితా వ్యవసాయం చేస్తున్న కవి డా.రావు గారు. యువకవులు ఆయన కవిత్వం చదివి స్ఫూర్తిని పొంది మరింత పదును పెట్టిన ప్రతీకలతో భావచిత్రాలతో శిల్ప వైవిధ్యంతో కవితలను వెలయించవచ్చు. ♦

కథ

# భీమ్‌రావ్ చెప్పిన అంబేడ్కర్ కథ

కన్నడం: కుం వీరభద్రప్ప

అనుసృజన: వేలూరి కృష్ణమూర్తి



**మా** కన్నవారు మా యిద్దరికి ఆ పేర్లు పెట్టింది ప్రజ్ఞాపూర్వకంగా కాదు. భీమ అన్న నామ వాచకానికి రావ్ చేర్చింది డిగ్రీ అయిన మీదట. ఆమెకూడ సావిత్రి అన్న నామవాచకానికి భాయి చేర్చింది కూడ డిగ్రీ పూర్తిచేసిన మీదటే! మేము అంబేడ్కర్ ఆలోచనాధారకు మా మనసులను అంకితం చేసుకొన్నాం. రెండవ మాటు పరస్పరం కలిసింది అదే డిశంబర్ నెల 6వ తేదీనాడు. అంతరంగంలో మేము పరస్పరం ప్రేమించుకున్నాం. అదే డిశంబర్ 6న వివాహం చేసుకోవాలని నిశ్చయించాం. దానికి మా మా యింటివారు, వారు ఎడమంటే వీరు కుడి అనే తకరారు చేశారు. వారెవరూ సమ్మతించ లేదు. అదీకాక వివాహం రిజిస్ట్రారు గారి కార్యాలయానికి వచ్చి వారెవరూ చేవ్రాలు చేయలేదు. మేమిరువురూ అదే రోజు వివాహం చేసుకొన్నాం. ఆ రోజు బెంగళూరులో ఉద్యోగం లభించింది. కాని, ఆ రోజులలో బాడుగ యిల్లు లభించడం అంత సులభమైన సంగతి కాదు. ఇంటి యజమాని మీ కాస్టు ఏదని అడగడం, దానికి యిది మా కాస్టని చెప్పడం. అది విన్నంతనే వారు లోకాస్టని ముఖం ముడుచుకుపోవడం!

ఇల్లు లేనివారికి మానముండదు. జ్ఞానోదయమైంది. హైక్లాసువారి ఎక్-స్టెన్షన్ లో యిల్లు కట్టాలని నిర్ణయించాము. ఇద్దరం సంపాదిస్తున్నందున అప్పు తెచ్చుకోవడం కష్టమనిపించలేదు. నగర శివారులో నాలుగు సెంట్ల స్థలం కొన్నాము. సంపాదనకు సంతానం అడ్డుపడుతుందన్న ఆదుర్దాతో ప్రస్తుతానికి బిడ్డలు వద్దనుకొన్నాము. ఇల్లు కట్టి చూడు. ఆహా! పెద్దవారి మాట! ఇది అక్షరాలా అనుభవంతో చెప్పిన మాట. అది మాకు అనుభవమైంది యిల్లు కట్టడం ప్రారంభించిన మీదటే! స్నేహితుల సలహా ప్రకారం దాని పర్యవేక్షణను నాయుడికి యిచ్చాము. అయినా అంతా వారిపైనే విడువడానికి లేదు. అటు ఉద్యోగం, యిటు ఇల్లు కట్టించే పని! కాళ్ళకు చక్రాలు కట్టుకొన్నా ఊపిరి పీల్చడానికి సమయం లభించేది కాదు. ఉన్న రెండు కన్నులనూ ఇల్లు కట్టడానికి తెచ్చిన వస్తువుల వైపో లేక యిల్లు కట్టే పనివారి వైపో! అందరినీ సందేహించడం ఎంతవరకు? ఎక్కడో వుండి వచ్చిపోయేకంటే, సైటు దగ్గరే ఒక యిల్లు బాడుగకు తీసుకోవడమే ఉత్తమం కదా?

మేము కొన్న సైటుకు దగ్గరగా రెండు భవ్యమైన అపార్ట్‌మెంటు భవనాలు వుండేవి. వాటిలో ఒకదానిలో కొన్ని యిళ్ళు ఖాళీగా వుండేవి బాడుగకు. వాస్తు దోషాన్ని పట్టించుకోకుండా వుండేట్టయితే కాస్ట్ ముఖ్యం కాదని దాని యజమాని స్పష్టంగా తెలిపాడు. దానికి తోడుగా ఇనిషియల్ డిపాజిట్ మినహాయింపు యిస్తానని కూడా చెప్పాడు. ఆ భవనం రెండవ అంతస్తులో ఫ్లాటు లభించింది. లగేజీ ఎక్కువ

లేనందున మరుసటిరోజే వచ్చి ఆ ఫ్లాట్‌లోకి చేరిపోయాం. పశ్చిమాభిముఖంగా వున్న కిటికీలో నిలబడితే మా సైటు వద్ద జరిగే సంగతులు స్పష్టంగా అగుపడేవి. అదీగాక, బిడువు చిక్కినప్పుడల్లా మా యిద్దరిలో ఎవరో ఒకరు అక్కడికి వెళ్ళి యిల్లు కడుతున్న పనులను పర్యవేక్షించేవారం. నాకంటే ఎక్కువగా కష్టాన్ని అనుభవిస్తుండినది సావిత్రి. మేమిద్దరం తొమ్మిది గంటలకు బస్‌ను పట్టుకోవాలి. చెత్తలూడ్చడం, ముసర పాత్రలు కడగడం, వంట పనులను పంచుకొని ముగించినా సమయం చాలేది కాదు. కొన్నిమార్లు మా సైటువద్దకు పోవడానికి కూడ వీలుపడేది కాదు. ఈ కష్ట కార్పణ్యాల మధ్య ఇంటి నిర్మాణంలో భాగం పంచుకొన్న వారిలో ఉత్తర కర్ణాటకం వారు ఎక్కువ సంఖ్యలో వుండేవారు. వారందరూ ఎక్కడెక్కడో వారి కుటుంబాలతో వెళ్ళిపోయారు. కాని, ఒక కుటుంబం మాత్రం అదే సైటు తాత్కాలిక గుడిసెలో నిలిచిపోయింది. మేస్త్రి నాయుడు ఆ కుటుంబాన్ని మాకు పరిచయం చేశాడు. మాకు అనుకూలంగా వుంటుందని ఆ మధ్యవయసు స్త్రీని మా యింటిపనికి సిఫారసు చేశాడు. ఆమెవల్ల మాకు అనుకూలమైందో, మా నుండి ఆమె కనుకూలమైందో! బసవకల్యాణం దగ్గర ఒక గ్రామం. పేరు గౌరమ్మ. నాయుడు ఆమె భర్తకు మేస్త్రి వాచ్-మన్ పని యిచ్చాడు. ఆ ఆస్మా రోగి దగ్గే శబ్దాలకు దొంగలు భయపడేవారు. వారికి ఇద్దరు కొడుకులు వుండేవారు. ఒకడు దావణగెరె బెణ్ణె దోసె హోటలులో పనికుండేవాడు. పోలియో రోగంతో వున్న చిన్నకొడుకు దగ్గరలోనే వీధి ప్రక్కలోనే వున్న వ్యాపారస్తుడికి సహాయకుడుగా వుండేవాడు. వారికి ఒక కూతురు కూడ వున్నదట. కూతురు చదువుకుంటేనే ఆమెను పెళ్ళి చేసుకొంటానని గౌరమ్మ స్వంత తమ్ముడు మాట యిచ్చాడట. అందుకోసం ఆ పిల్లను నొణవినకెరె సమీపంలో వున్న ఒక మఠంవారి హాస్టల్‌లో చేర్చి చదివిపిస్తున్నారట. సెంట్రింగ్ తీసేలోపల ఆ పిల్ల వస్తుందని గౌరమ్మ అభిమానంతో చెప్పింది.

గౌరమ్మ పేరుకు తగ్గట్టు వుండేది. ప్రతిరోజూ ఉదయం ఐదు గంటలకు తప్పకుండా వచ్చేది. 'శరణ్రీ అప్పోరా' అని పని ప్రారంభించేది. విభూతి అడ్డ నామాలతో తన నుదుటిపైవున్న ముడుతలను కప్పిపుచ్చేది. సన్నగా వున్న గౌరమ్మ చెత్త వూడ్చేటపుడు గాని, ముసర పాత్రలు తోమేటపుడు గాని తాను ధరించిన లింగపు కాయి పైకి కనపడేది. నోటికి విశ్రాంతన్నదే యివ్వక పేలాలు వేయించినట్టు మాట్లాడుతుండేది. ఆమె తన పుట్టింటి, భర్త యింటికి సంబంధించిన కొన్ని విషయాలను చెబుతూండేది. తమ వూర్లలో యిళ్ళు వుండడమెంత నిజమో, వానలు లేనికారణంతో బెంగళూరికి వలస వచ్చినదికూడ అంతే నిజం! ప్రతి మాటకూ గద్గదికురాలవుతుండేది, భావపరవశురాలవుతుండేది. మా యింటిలో తినగా మిగిలిన ఆహార పదార్థాలను తన యింటికి తీసుకొని వెళ్ళేది. తమ యింటిలో అపురూపంగా చేస్తున్న ఉత్తర కర్ణాటక శైలి తిండి పదార్థాలను మాకు తినిపించి ఎలావున్నదని విచారిస్తుండేది. రోజులు గడిచినంతా ఆమె యింటి పనులకు తోడు వంటింటి పనికూడ చూసుకొనేది. ఎనిమిది గంటల వేళకు రెండు మూడు రకాల తిండి పదార్థాలను తయారుచేసేది. 'అప్పోరే ఇది మీది', 'అమ్మోరే ఇది మీది' అని టిఫన్ బాక్సులను చేతిసంచిలో వుంచి యిచ్చేది. అనుభవస్తురాలైన గౌరమ్మ ఉపయోగకరమైన సలహాలను యిచ్చి వ్యక్తిగతమైన సమస్యలను కూడ పరిహారం చేయనారంభించింది. ఇలా అయి ఆమె మా కుటుంబంలో ఒక సభ్యురాలై పోయింది. మానుంచి ఆమెకు సహాయమైందని అనేకంటే ఆమెవల్ల మా యిద్దరికి ఎంతో ఉపయోగమైంది.

ఆ తరువాత ఒక రోజు ఉదయం ఐదు గంటలకు కాలింగ్ బెల్ శబ్దమైంది. తలుపులు తీసి చూస్తే గౌరమ్మకు బదులుగా మంచి వయసులోవున్న యువతి నిలబడి వుండినది. స్ఫురద్రూపియైన ఆ అమ్మాయి చెప్పకున్నా గౌరమ్మ కూతురని అర్థమైంది. దానికి కారణం ఈ అమ్మాయి తన అమ్మ గౌరమ్మను పోలివుండినది. ఆ అమ్మాయి నన్ను అంకుల్ అనీ, సావిత్రిని ఆంటీ అని మాటలు ప్రారంభించింది. విషయం తెలుసుకొని సావిత్రి గుడిసెకు వెళ్ళి గౌరమ్మ ఆరోగ్యం గురించి విచారించింది. ఫ్లూ రోగానికి తగిన చికిత్స యిప్పించింది. పళ్ళకోసం అలాగే యితర ఖర్చులకుగాను కొంచం డబ్బు యిచ్చి యింటికి వెనుదిరిగింది. సావిత్రి దయాపరత్వం నాకు యిష్టమైంది. గిరిజ కూడ ప్రతిగా థాంక్సాంటి అని అన్నది. కాలేజు ఉపన్యాసకుడైన నేను సహజంగా ఆమె చదువు గురించి విచారించా. దానికి తోడుగా సరియైన సలహాలను, సూచనలను యిచ్చా. గిరిజ పూర్తి తల్లి లాగానే! విద్యావంతురాలైన గిరిజకు పని విషయంలో గొప్ప, తక్కువ అన్న భావన వుండలేదు. శ్రద్ధగా యింటిపని చేసింది మాకు

## కవిత




# నవ్వు


- దారల విజయ కుమారి
9177192275


*ఒకసారి నవ్వు.. పసి మొగ్గలు విచ్చుకున్నట్టు*
*పూలు సిగ్గు పడ్డట్టు.. పరిమళమేదో పరచుకున్నట్టు*
*వత్తిడి వేడిని.. ఉపశమనపు చల్లగాలి చుట్టుముట్టినట్టు*
*కొమ్మ నల్లాడిస్తే.. ఆకులు.. చినుకుల్ని రాల్చినట్టు*
*ఒక సారి నవ్వు*

*తండ్రి భుజమెక్కిన బిడ్డనవ్వులా*
*వృద్ధాశ్రమాల ఊసెత్తని.. తలిదండ్రుల బోసినవ్వులా*
*జాబిల్లీ.. వెన్నెలా.. దోబూచులాటలా*
*కోయిల ఆగమనంతో వసంతం నవ్వులా*
*మోడైన కొమ్మకు కొత్త చిగుళ్ళ గిలిగింతల్లా*
*భూమితల్లికి చిక్కకుండా.. పరిగెత్తి*
*పైకొచ్చిన మోసు నవ్వులా*
*ఒక సారి నవ్వు*

*నీలోనూ ఒక నవ్వుల అరణ్యముంది*
*దాడిచేసినట్టూ.. వేటాడినట్టూ.. తల*
*బాదుకున్నట్టు.. తలపడినట్టు*
*నోరుకొట్టుకున్నట్టు.. నవ్వుతుంటావు*
*నవ్వంటే నేరుగా.. నాపరాళ్ళను విసిరినట్టు*
*గుండెల్లో గునపాలు దించినట్టు.. కాదు*

*చారెడు మల్లెలు మీద చల్లినట్టు*
*పావురాలను పై కెగరేసినట్టు.... నవ్వాలి*

*మనసుంటే.. దాతృత్వపు విత్తనాలు నాటి*
*నవ్వుల్ని మొక్కల్లా మొలిపించుకోవచ్చు*
*నవ్వుల్ని... చేతికొచ్చిన పంటలా నూర్చుకోవచ్చు*
*ఆకలి పేగుకో.. ఎండిన డొక్కకో.. మెతుకుల వాయినాలిచ్చి*
*నవ్వుల్ని ఆవాహన చేసుకోవచ్చు*

*రోజూ... నవ్వుకో.. ఖర్చుండదు*
*నవ్వుల్ని అందరికీ.. పంచేసుకో.. మనసెన్నడూ.. ఖాళీ అవదు*
*మళ్ళీ నీకు రేపన్న దుందో లేదో..?*
*గుర్తుంచుకో... నవ్వే జీవి.. నువ్వొక్కడే..!*
*అందుకే.. నీ నవ్వుల జాడల్ని వదిలేసి వెళ్ళు!*

♦

---

యిష్టమైంది. గిరిజకు సరిపోయే వస్త్రాలను, దానికి తోడుగా ప్రతి నెలా ఒకింత డబ్బు పంపుదామని నిర్ణయించాము. ఆ అమ్మాయి మూడు రోజులు టైంకి వచ్చి యింటిపని చేసి వెళ్ళింది. కాని, నాల్గవ రోజు రాలేదు. జ్వరం, తాపం లేకున్నా గౌరమ్మ కూడ యింటిపనికి రాలేదు. మాకు కుతూహలం, ఆదుర్దా ఎక్కువైంది.

వారు మంచివారు! ఖండితంగా అది నిజం. కాని, యింట్లో వుంటారో లేదో! లేక ఏదైనా సమస్యలలో చిక్కుకొన్నారో ఏమో! సందేహం నివృత్తి చేసుకోవాలని సావిత్రి వారింటికి పోయింది. కాని వెనుదిరిగిన ఆమె ముఖంలో ఆతంకపు మోడం ఆవరించినది ఎత్తి కనపడింది. గుడిసెలోపల వున్నా వారెవరూ బయట కనపడలేదట! ముఖానికి ముఖం పెట్టి మాట్లాడలేదట! అది విన్నంతనే నాకు ఆదుర్దా కలిగింది. ఆమె వద్దన్నది. వెళ్ళి మనసుకు బాధ తెచ్చుకోవడం ఉచితం కాదని అడ్డుపడడానికి ప్రయత్నించింది. అయినా, చివరకు నేను వెళ్ళా. గౌరమ్మ వసారాలో కూర్చొని బియ్యంలో రాళ్ళు ఏరుతూండినది. నేను వెళ్ళిన శబ్దానికి ముఖం పైకెత్తింది.

'అప్పోరే' అన్న బహువచనం ప్రయోగించలేదామె. 'మీరలాంటివారని నా కూతురి ద్వారా తెలుసుకొన్నా', అని మాత్రం చెప్పి మరలా లోనికి వెళ్ళింది. కారణం తెలిసిన మీదట నవ్వడమా లేక ఏడ్వడమా! ఒకటీ తెలియలేదు. స్వభావంలో తల్లీ కూతురు యిద్దరూ మంచివారే! కాని, అంబేద్కర్ గారి భావచిత్రం! అది నా గదిలో వుండినది. దానిని నిరక్షరాస్యురాలైన తల్లి అర్థం చేసుకొన్నది వేరు. అక్షరాస్యురాలైన కూతురు దానిని అర్థంచేసుకొన్నది వేరు. 'అమ్మా, అది ఎవరి ఫోటో అనుకొన్నావు?' అని ఆమె తన తల్లిని ప్రశ్నించిందట!

♦

# మా బ్రతుకు బ్రతుకనివ్వండి

- డా. వేముల శేఖరయ్య
9491376896

ఎట్లపుట్టామో మాకే తెల్వదు
అమ్మపాలు అంతంతమాత్రమే
అయ్య ఆలనాపాలనా అడవి మధ్యనే
బంధుగణము మాకు కొందరే వుందురు
అందమైన ఊయలలు మా కందవు
దూదిపరుపులు  మాకెంతోదూరం
పుడమితల్లి ఒళ్ళే మా శయనపడక
మట్టిముద్దలే మాకు మహాభోజనం
చెట్లకొమ్మలు, ఊడలే మమ్మూపు ఊయలలు
వెదురుపాటే మాకు వేణునాదం
తుమ్మెదల ఝుంకారం మా కర్ణపేయం
పక్షిజాతులకూత పలకరింపులమోత
జంతుజాతులే మా నెచ్చెలికాండ్రు
కళ్ళుతెరిసినా, కళ్ళుమూసినా
కానలే మా మదినిండ
అడుగడుగునా అడవితల్లే మాతల్లై
మమ్ముల ఆడించింది, పాడించింది
ఆకులిచ్చింది, కాయలిచ్చింది
పండ్లనిచ్చింది,దుంపలిచ్చింది
మా ఆకలిదీర్చ పరితపించింది
మా అరుపుల్లో ప్రతిధ్వనించింది
మా పాటల్లో పాటయ్యింది
మా ఆటలనుత్సాహ పరిచిదింది
మా యింటికి కప్పైంది, మా ఒంటికి చొక్కైంది
మా వ్యాధికి ధన్వంతరియై, మా ఆకలికక్షయపాత్రై
మా దాహందీర్చే పానపాత్రయై, మా వేటకు వేధికయయ్యే
తరతరాలనుండి తరగని ప్రేమతో
మాలాంటి వారినెందరెందరినో
ఎదనచేర్చుకొని ఓదార్చింది
ఆహ్లాదము పంచి ఆదరించింది
మరి నేడేమయ్యింది
పచ్చని ప్రకృతినంతా పతనము జేయజూస్తుండ్రు
అడవితల్లి గుండెచీల్చి రక్తంతో తడుపుతుండ్రు
ఖనిజము తీయుటకొరకై కనికరమే మరిచారు
యురేనియము పేరుజెప్పి ఎరినివేయజూస్తుండ్రు
చెట్లు నేలకొరిగితేమి, అడవి ఆగమైతెనేమి
జంతుపక్షి జాతులన్ని, ఝుడిసి మడిసినాగాని



శుద్ధజలపు సెలయేళ్లు, విషముగ్రక్కి ఎరుపెక్కిన
వనమువొళ్ళో ఒదిగియున్న చెంచుబ్రతుకులాగమైన
నమ్మియచట బ్రతికెటోళ్లు నట్టేట్లోమునిగినా
వేలమైళ్ళ వనము బేలగ కన్నీరెట్టిన
ఊళ్ళకువూళ్ళన్ని గూడి ఉధ్యమాలు జేసినా
కవులచేతిలో కలము, కళాకారులకంఠం
ప్రకృతి ప్రేమికులంతా పనిగట్టుక అరచినా
ఉధ్యమకారులు జ్వాలై ఉవ్వెత్తున ఎగిసినా
మాకేమీ పట్టదంటు మునుముందుకె సాగుతున్న
అధికారమదాంధులార, ప్రకృతికబంధులార
'ఆశ'మనిషికెప్పటికీ    'గోసే' మిగిలిస్తుందని
అక్షరసత్యము మీరూ అరయకుందురాయేమి?
బంగారము గుడ్డువెట్టె బాతును తెగగోసినట్లు
అడవితల్లి నణచుదురా, మా బ్రతుకులు తెంచుదురా
పుట్టిననేల స్వర్గమనీ పురాణాలు చెప్పలేద?
మా స్వర్గమున్నరకముగా,మార్చుట మీకెక్కడిదీ?
ఇళ్లు మీరు యివ్వకున్న, వొళ్ళుదాచుకున్నోళ్ళము
పట్టెడు మెతుకులేయకున్న, నట్టడవినె నమ్మినోళ్లం
మీకానుకలొద్దుమాకు మేడలుగట్టించకండి
మణిహారాలివ్వకండి, మమ్ముద్ధరణ జేయకండి
మీ సహాయానికి సలాము
సవతిపిల్ల తీరుండే మీ ప్రేమలు మాకొద్దు
మమ్ముగన్న మా తల్లిని మాముందే చంపకండి
మేమాడిన కొండకోనల బొరియలుగా మార్చకండి
పచ్చని ప్రకృతిపంచే ప్రాణవాయువునంతా
ప్రకృతి జీవులనణిచే విషవాయువుతో నింపకండి
మా దారిన మేముంటాం, మా బ్రతుకులు బ్రతుకుతాం
మా పిల్లల పాపలనూ మా వల్లనె పెంచుతాం
రాబంధుల్లా మీరు రాకండీ మా కడకూ
రాక్షస గణముల్లాగా రాకకండి మా బ్రతుకును
అదే మాకు పదివేలు
మీకిదే మా వంద వందనాలు ♦

## విశ్లేషణ




డా॥ పుట్ల హేమలత

# ఆమె కవిత్వం.....
# భావోద్వేగాల సమ్మిళితం

- సునీత గంగవరపు
9494084576

'కవిత్వం' చిన్న పదమే కానీ కొందరి కవిత్వం చదువుతున్నప్పుడు ఆనందం కలుగుతుంది. ఆశ్చర్యమేస్తుంది. ఏదో అనుభూతి రహస్యంగా మనతో ముచ్చటిస్తున్నట్లు అనిపిస్తుంది. ఒక వాదననో, వేదననో రసాత్మకంగా వినిపిస్తున్నట్లు తోస్తుంది. అలాంటి కవిత్వమే... ఈ 'వేకువరాగం'.

శ్రీమతి పుట్ల హేమలత కలం తిరిగిన కవయిత్రి. వ్యధార్త చీకటి కోణాలను, నిరంతర బ్రతుకు పోరాటాలను కవితలల్లిన క్రాంత హృదయిత్రి. ఎన్ని గాయపడ్డ గుండెలు ఈమెకు ప్రేరణనిచ్చాయో... ఎందరి నిశ్శబ్ద రోదనలు ఈమె ఆలోచనలను కదిలించాయో కానీ... ఆమె కలం విదిలించింది. 27 కవితలతో కూడిన 'వేకువరాగాన్ని' ఆలపించింది. ఆచార్య ఎండ్లూరి సుధాకర్ ఈ పుస్తకానికి ముందుమాట రాస్తూ 27 కవితల ఈమె పుస్తకాన్ని 'నక్షత్రమాల'గా అభివర్ణించారు.

కవయిత్రి హేమలత ఓ సాహితీ కిరణం. సుఖదుఃఖాల జీవన గమనంలో అనుభూతుల్ని ఒడిసిపట్టుకున్న సంచలన కెరటం. సంసారాన్ని ఈదుతూనే సమాజాన్ని చదువుతూ చుట్టూ కనపడే ఆటుపోట్లను, లోటుపాట్లను కవిత వస్తువుగా స్వీకరించి కవిత్వీకరించారు ఈమె. హేమలత కవిత్వం కేవలం ఓ అనుభూతికో, కాస్తంత ఆహ్లాదాన్ని పంచడానికో పరిమితం కాలేదు. వీరి కవిత్వంలో అస్తవ్యస్త సమాజం పట్ల బాధ వుంది. భారం వుంది. కలం నిండుగా తొణికిసలాడే బాధ్యత వుంది. ఒక స్త్రీగా స్త్రీలు ఎదుర్కొంటున్న అనేక కుటుంబ సామాజికపరమైన సమస్యలను అవగాహన చేసుకొని, స్త్రీ పక్షం వహించి స్త్రీల కోణంలో ఆలోచించి స్త్రీ పట్ల చూపే 'వివక్ష' పట్ల నిరసనను వినిపించారు.

*"కలలన్నీ కరిగి కన్నీరయ్యాక*
*'పాణీగ్రహణం అంటే... నువ్వు నాకు పట్టిన గ్రహణం అని అర్థమయ్యాక"*... అంటూ మన వివాహ వ్యవస్థలోని పురుషాధిపత్య ధోరణిపై కలం ఎక్కుపెట్టారు.

***ఇప్పుడు నా ముఖం / పగిలిన అద్దంలోని ప్రతిబింబంలా వుంది. సాఫ్ట్‌వేర్ సంబంధమంటే మనసు కూడా అంతే అనుకున్నా! నా పుట్టింటి ఆస్తిని డాలర్ల చెట్టుని చేసి దులుపుకున్నాక/ ఆ మృత వృక్షానికి నన్ను ఎరువుగా మార్చే నిలువెత్తు సాఫ్ట్‌వేర్ పరికరానివనుకోలేదు.***

ప్రస్తుత సమాజంలో కూడా వరకట్నం వేధింపులు, వరకట్న చావులతో 'వరకట్న సంస్కృతి కొత్తపుంతలు తొక్కుతూ సంచరిస్తూనే వుంది. మనిషి నాగరికంగా ఎంత ముందుకు పోతున్నా తన మానవత్వపు పరిధిని విస్తరించుకోకపోతే, సంకుచితత్వాన్ని వదిలేయకపోతే మానవ ప్రగతి ప్రశ్నార్థకంగానే మిగిలిపోతుంది.

సంసారపు గుమ్మంలో నిలబడి భయాలను బాధలను తానే భరిస్తూ కుటుంబం సజావుగా సాగేందుకు అహర్నిశలు

పాటుపడే నిస్వార్ధ త్యాగం పేరు అమ్మ. తన తల్లి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ.. రచయిత ఇలా అంటారు.

***చిన్నప్పుడు నిద్దట్లో / అమ్మ కప్పిన పైటకొంగు వెచ్చదనం ఒక జ్ఞాపకమై నా భుజాల చుట్టూ / శాలువాగా చుట్టుకుంటుంది.***

పెంచి పెద్ద చేయడంతోనే అమ్మ ప్రేమ ఆగిపోదు. బిడ్డల జీవితంలో ఎప్పుడు ఏ సమస్య వచ్చినా అమ్మ మనసు చివుక్కుమంటుంది. బాధతో రెపరెపలాడుతుంది.

***"బ్రతుకు భుజమ్మీద పసిపాపనై జారిపోతున్నప్పుడు / ఒక పిల్ల తెమ్మెరలా అమ్మ నన్ను వీపు నిమురుతుంది. అప్పుడు పాల బువ్వలు తినిపించిన అరిటాకు చేతులు సుఖదుఃఖాల గోడలను కట్టీ కట్టీ***

***రాటుదేలిన ఆకు రాళ్లవుతాయి"***

అంటూ అమ్మ బ్రతుకులోని చీకటి వెలుగుల నీడలను సున్నితంగా స్పృశించారు.

ప్రతి మనిషి జీవితానికి అర్థం వుండాలి. పరమార్థం తెలియాలి. ఏ లక్ష్యమూ లౌక్యమూ లేని జీవితం హృదయాలను బంధాలతో పెనవేసుకొని జీవితం నూరేళ్ల జీవించే కంటే, జీవితాన్ని ఆస్వాదిస్తూ మనిషిగా జీవించే జీవితం రెప్పపాటైనా చాలు అంటారీ కవితలో

***కొన్ని యుగాలు కానక్కర్లేదు***
***కొన్ని సంవత్సరాలూ కానక్కర్లేదు***
***కొన్ని లిప్తలపాటు చాటు / నన్ను మనిషిగా జీవించనీ***
***బ్రతుకు మొక్కపై హృదయ పుష్పాన్ని వికసించనీ***
***ఇప్పుడు హృదయాల మధ్య జడత్వం***
***రక్త పింజరలా పెనవేసుకుంటుంది***
***రెండు ఆత్మలు - భావ ప్రకంపనలు***
***ట్రాన్స్‌ఫర్ చేసుకుంటున్నపుడు***
***నా హృదయ పరిభాష నీకెంతకూ అర్థం కాదు***

ఓ కవిత తుది రూపాన్ని సంతరించుకోవడానికి ఆ కవి అంతర్లీనంగా సంఘర్షించాలి, అనుభూతి చెందాలి, సృజనాత్మకంగా చింతించాలి, ఆ ఘర్షణ నుండి పుట్టిన కవితా వస్తువు కవితకు బలాన్నిస్తుంది. పాఠకుడికి బాధనో, భయాన్నో, ఆనందాన్నో, ఆహ్లాదాన్నో... ఓ అనుభూతితో అల్లుకున్న ఉద్వేగాన్ని కానుకగా ఇస్తుంది. ఆ వస్తువు అమ్మ కావచ్చు, నాన్న కావచ్చు, ప్రకృతి కావచ్చు, పక్కింటి పిల్ల కావచ్చు, వంటగదిలో పిల్లీ కావచ్చు.

***తల వాకిట్లో మీ తలంపు అలా చొరబడుతుందో లేదో భయమో, భక్తో... ప్రేమో - అంతకుమించిందో ఇప్పటికీ నరాల్లో విద్యుత్తులా ప్రవహిస్తూనే వుంది. మాకు కొత్త శక్తిని ఇస్తూనే వుంది.***

ఈ కవితలో వస్తువు పేరు, నరాల్లో విద్యుత్తులా ప్రవహిస్తూనే జీవితాన్ని నడిపించే ఆ కొత్త శక్తి పేరు నాన్న.

హేమలత సామాజిక బాధ్యత నెరిగిన నిండైన కవయిత్రి. సామాజిక ప్రగతికి అవరోధాలుగా పరిణమిస్తున్న శారీరక, మానసిక రుగ్మతలపై తీవ్రంగా హెచ్చరించారు. ఎందరో అమాయక జీవితాలను బలి తీసుకుంటున్న హెచ్ఐవి వైరస్‌పై ఆందోళనను కవిత్వీకరించారు.

***వెన్నెల తిన్నెల మీద ఏ అర్థరాత్రో క్షణకాలపు మైమరపై ఎదురుచూడని చక్కిలిగింతలై....***

***తొందరపాటో / తీరని వ్యామోహమో***

***ఆకలి బాధో / వ్యసనమో / రూపాంతరంలో హెచ్ఐవి ఇంధనమై***

***నరనరాలకు తియ్యగా వ్యాపించిన సుఖప్రాప్తి.***

***ఎయిడ్స్ ప్రయాణానికి రాకెట్‌గా మారుతుంది"***

అంటూ రెండు శరీరాల తొందరపాటు ఫలితం అనేక జీవితాలను కబళించే వైనాన్ని గుర్తు చేశారు.

కవయిత్రి పుట్ల హేమలత కేవలం సాహితీవేత్త మాత్రమే కాదు. సంఘసేవకురాలు. సాంకేతిక పరిజ్ఞాని. 'విహంగ' అనే వెబ్ పత్రికను స్థాపించి అంతర్జాల సాహిత్యంలో 'అందెవేసిన చెయ్యి'గా రాణించారు. శ్రీమతి మనోరంజితం. మనప్షే గారల తొలి సంతానమైన హేమలత స్వస్థలం నెల్లూరు. వారి ప్రాథమిక విద్య అక్కడే సాగింది. బాల్యం నుంచే పుస్తక పఠనం పై ఆసక్తిని పెంచుకొని కథ, కవిత, నవల వంటి సాహిత్యప్రక్రియలపై పట్టు సాధించారు. 2012లో శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం నుంచి 'వెబ్‌లో తెలుగు సాహిత్యం - తీరు తెన్నులు అనే అంశంపై పి.హెచ్.డి. చేశారు. అంతర్జాలంలో జరిగిన మొదటి పరిశోధనా గ్రంథం వీరిదే కావడం, మొదటి పరిశోధకురాలు వీరే కావడం విశేషం. పరిశోధన గ్రంథంతోపాటు వ్యాసాలను కూడా పుస్తకాలుగా వెలువరించాలనే సంకల్పంతో లేఖ నం-1 లేఖ నం-2 అనే రెండు వ్యాస సంపుటాలను ముద్రించారు. దళిత స్త్రీల సాహిత్యంపై సమగ్ర వ్యాఖ్యానాలతో 'నీలికలువలు' అనే మరో వ్యాస సంపుటిని ప్రచురించారు. ఎండిన గొంతుల బ్రతుకులపై

## కవిత

# వానాకాలం ఒకటుందని..

- తవ్వా ఓబుల్ రెడ్డి
9440024471



ఈ పొద్దుటికి నా సీమ
నీటి సెమ్మెక్కి
రోంత నిమ్మలపడ్న్యాది
కొండా, మోడం
కొసరి కొసరి
ముద్దులాడుకున్న్యాయి
వాగూ,వంకా
సెంగు సెంగుమని
సెట్టాపట్టాలేసుకున్న్యాయి
ఏర్లు, దరులూ
ఎకసెక్క్యాలు ఆడతాండయ్
సెరువులూ, కుంటలూ
కరువుదీరి మొరవలు పార్న్య
పిచ్చి మొక్క,పుచ్చపువ్వా
మచ్చికై మర్లుపోతాండయ్
పెయిదూడా, కోడి పెట్టా

మోరలెత్తి పరిగెత్తుతాండయ్
తుట్టపిసిక, తూనీగా
కట్టమింద దాయమూతలాడ్య
గొర్రెతొక్కిడికి ఈదులన్నీ
పుర్రుపుర్రు అయిపాయ
వానాకాలం ఒకటుందని
పదేళ్ళ పిల్లోళ్ళు తెలుసుకుని
సూరు నీళ్ళకు దోసిళ్ళు పట్టిరి !
సీకురాయి, గోందిరికప్పా
రేత్రి పదానికి వాద్యగాళ్ళైనారు
సలపరమెక్కిన సగిరపొద్దు

సలికంబట్లో ఉడిగింది
సల్లటి ఈదరగాలి తోలి
నల్ల రేగడి కూరికింది
ఈ పొద్దుటికి నా సీమ
నీటి సెమ్మెక్కి
రోంత నిమ్మలపడ్న్యాది ♦

వర్ణయుద్ధాన్ని నిరసించారు.

***ఎండిన నెత్తుటి చారల గొడ్డళ్లు***
***పిడచగట్టుకున్న కులం గొంతుల్ని***
***ఇనుపవేళ్లతో సవరించుకుంటాయి***

చరిత్ర గుండెలపై మాయని మచ్చగా మిగిలిన చుండూరు దుర్ఘటన పై హేమలత స్పందన ఇది

అదే విధంగా ముస్లీం మైనారిటీ రిజర్వేషన్లకు బలమైన మద్ధతు తెలిపిన మొదటి రచయిత్రి హేమలతగారు. సచార్ కమిటి నిర్ణయాన్ని హర్షిస్తూ దస్తఖత్ కవితలో ఇలా అంటారు. ***నేనిపుడు మాట్లాడుతుంది / దావూద్ ఇబ్రహీం గురించి కాదు, అబూసలేం ఊసు అసలే కాదు / వాళ్లంటోళ్ల శరీరాల కింద మెత్తటి పరుపులై నలుగుతున్న పింజారీ పీర్ సాయిబుల గురించి"*** అంటూ ముస్లింలలో ఒక దయనీయ వర్గానికి చెందిన వారి జీవన దుస్థితిని తెలియజేశారు.

***మతం మారితే / కులం మారితే కన్నీళ్లు కరగవు. కరీంభాయ్ / ఇప్పుడు నోట్లోకి వెళ్లే నాలుగు ముద్దలే కాదు సమస్య....***

***పుట్టుకతో అబ్బిన వరాల బురఖాలనీ....***

***మన అసమానత్వపు పరదాల్నీ / చిరునవ్వుతో చీల్చుకుంటేనే కదా... పూడి పడేది*** - అంటూ ఓ వాస్తవిక దృశ్యాన్ని ఎవరూ కాదనలేని సత్యాన్ని హృద్యంగా చెప్పారు రచయిత్రి.

ప్రముఖ కవి శ్రీ పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం శాఖాధిపతి, ప్రస్తుతం హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆచార్య ఎండ్లూరి సుధాకర్ గారి సహచరిణిగా మానస మనోజ్ఞలనే ఇద్దరు ముద్దు బిడ్డలకి తల్లిగా జీవిత సారాన్నెరిగిన విదుషీమణిగా గణుతికెక్కిన కవయిత్రి శ్రీమతి పుట్ల హేమలత. ఇటీవలనే తన ఆత్మీయులకు సాహిత్యాభిమానులకు మానని గాయాన్ని మిగిల్చి ఈ లోకాన్ని విడిచి భౌతికంగా దూరమయ్యారు.

***ఈ చూపు చివరిది/ ఈ మాట చివరిది/ ఈ శ్వాస చివరిది ఇక సుప్రభాతాలు లేవు / అస్తమయాలు తప్ప.... పైవాడు సిద్ధం చేసిన క్షణం / పూలరథమై దిగివస్తోంది.***

అంటూ తన చరమ సందేశాన్ని బరువెక్కిన గుండెతో ప్రకటించారు. చివరిగా... చివరి పేజీలో...!

కానీ ... వీరి భావాక్షరాలు వెన్నెల తరగలై వేకువరాగాలై పలకరిస్తూనే వుంటాయి. హేమలతగారు ఇక్కడే వున్నారు. సాహితీ జగత్తు వున్నంతవరకూ... ఎక్కడో చోట... ఏదో పేజీలో.. అక్షరమై... నక్షత్రమై ప్రకాశిస్తూనే వుంటారు.

అరుదైన కవయిత్రికి... అక్షరనివాళి ♦

# అతడి కోసం

- చెళ్ళపిళ్ళశ్యామల
9949831146

అప్పటిగ్గానీ
తెలీలేదు వాళ్ళకి!
తమలో ఒకడిగా చేరి
మమతలు మమకారాలు నటించి
ముంగిట్లో ముచ్చట్లాడుతూనే
మాయా మర్మమెరుగని
తమ చిన్నారుల నెట్లా చిదమాలో
తలపోస్తున్నాడని
పాపం! తెలీలేదు వాళ్ళకి!

హఠాత్తుగా–
తమ ఆడబిడ్డలు
అదృశ్యమైపోతుంటే
కిలకిల పాడే పక్షులు
మూగవోయినట్టు
గలగలపారే సెలయేరు
ఆగిపోయినట్టు
విలవిల్లాడి పోయారు
పిల్లలకై వెతికి వెతికి
తల్లడిల్లి పోయారు

ఆక్షణాన
చిదిమేసిన చిన్నారుల
శరీరాన్ని
తనలో దాచుకోలేక
నీరెండిన ఆ బావి
ఎంతగా దుంఖించిందో మరి!
మనసులకైన గాయానికి
'మరుపు' మందును రాసుకుంటూ
కన్నీటి గేయాన్ని
ప్రతీ రాత్రీ పాడుకుంటూ
పసివాళ్ళ జ్ఞాపకాల్ని భోంచేస్తూ....
ఏ తెల్లవారు ఝామునో
తమ బిడ్డ తమ గూటికి
చేరుకుంటుందని
యింకా......
ఆశగానే చూస్తూ ఉన్నారు వాళ్ళు!



స్నేహం మేకతోలు కప్పిన వ్యాఘ్రమని
నమ్మకం నాగుపామై కాటేస్తుందని
ఎక్కిన వాహనం వారిని
చిట్టచివరి గమ్యానికే చేరుస్తుందని
చె....ప్పలేక రహదారెంతగా రోదించిందో!

ఏ తల్లి శాపం పండిందో
పాపం నిండిందో గానీ
రహస్యం బట్ట బయలై
ఆ గ్రామం
ప్రపంచానికిపుడో
వార్తయింది!

అప్పటిగ్గానీ
"అతడే"...."అతడని"
తెలీలేదు వాళ్ళకి!

ఆ ఊరు కళ్ళిపుడు–
అగ్నివర్షం కురిపిస్తున్నాయి
చేతులన్నీ ఆయుధాలై
ఎదురుచూస్తున్నాయి
"అతడి కోసం"!

(హాజీపూర్ గ్రామంలో
ఆడపిల్లల హత్యలకు స్పందించి) ♦

సాహిత్య ప్రస్థానం మాసపత్రికకు చందా కట్టండి!
తెలుగు భాషా సాహిత్య వికాసంలో మీరూ భాగస్వాములు కండి!!

5, 10 సంవత్సరాల చందా కట్టిన వారికి
పాత ప్రస్థానాలు ఉచితం!!

1 సంవత్సర చందా రూ. 240/- ◆ 5 సంవత్సరాల చందా రూ.1000 /-
◆ 10 సంవత్సరాల చందా రూ. 2000/-

Bank A/c Details:
A/c Name: PRASTHANAM, SBI, Governorpet, Vijayawada
A/c No. 52001500585, IFSC: SBIN0020343
చెక్కులు, డిడిలపై prasthanam అని రాయగలరు.

సాహిత్య ప్రస్థానం, 27-30-4, ఎం.బి. విజ్ఞానకేంద్రం, 3వ అంతస్తు, ఆకులవారి వీధి, గవర్నరుపేట, విజయవాడ - 520002, సెల్: 9490099059
ఇ-మెయిల్: ssprasthanam@gmail.com,

సాహిత్య ప్రస్థానం
వెబ్‌సైట్ చూస్తున్నారా?
www.prasthanam.com



*మహాత్మా గాంధీ 150వ జయంత్యోత్సవాల సందర్భంగా*

# తెలుగు సాహిత్యం, సంస్కృతి పై గాంధీజీ ప్రభావం

- అనిల్ కుమార్ దార్వేముల
9951244718

రవి అస్తమించని బ్రిటీషు సామ్రాజ్యాన్ని అహింసనే ఆయుధంగా మలచి, సత్యాగ్రహాన్ని పరమావధిగా, భారతమాతను తెల్లవారి దాస్య శృంఖలాల నుండి విముక్తి చేసి, స్వాతంత్ర్యాన్ని సిద్ధింపజేయుటలో గాంధీజీ పాత్ర అనిర్వచనీయం. స్వరాజ్య ప్రాప్తికై ఉద్దత్తమైన ఆదర్శాలు,ఉచితమైన నడవడి, బ్రిటీష్ అధికారశక్తిని నిర్భీతిగా ఎదుర్కొన్న ధీశాలి గాంధీజీ.

తాను నమ్మిన సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకు వెళ్తూ వేల కొద్ది మైళ్ళు పర్యటించి అంకురిత దీక్ష, క్రమ శిక్షణ, పట్టుదల, ఓర్పు,శాంతి, సహనాలతో ప్రజలను ప్రభావితం చేశారు. వెళ్ళిన ప్రతిచోటా గాంధీజీకి నీరాజనాలు, జేజేలు , ఉత్సాహ ధ్వనులతో స్వాగతించారు.ఎందరో కవులు, కళాకారులు, రచయితలు గాంధీజీ మార్గాలకు, ప్రసంగాలకు ప్రభావితమై తమ రచనల ద్వారా, పాటల ద్వారా, కవిత్వాల ద్వారా ప్రజలను మరింత ఉత్తేజితులను చేశారు.

స్వాతంత్రోద్యమ సమయాన మొదటిసారిగా 1921 లో గాంధీజీ ఆంధ్రా ప్రాంతంలో పర్యటించారు. గాంధీజీ ఉపన్యాసాలకు ఆకర్షితులైన ఎందరో సాహితీవేత్తలు, కవులు, తమ రచనలను, కవిత్వ రూపంలో, పాటల రూపంలో పాడుతూ, స్వాతంత్ర్య సమర శంఖారావం పూరించి ప్రజలను కార్యోన్ముఖులను చేశారు.

అట్టి వారిలో ప్రముఖులు గరిమెళ్ళ సత్యనారాయణ. వారు పండితులు, సంగీత, సాహిత్యాలలో గొప్ప సమర్థులు. మహాకవి కాళిదాసు రాసిన "అభిజ్ఞాన శాకుంతలం" ఎంత గొప్పదో గరిమెళ్ళ వారు రాసిన "మా కొద్దీ తెల్లదొరతనం" అన్న గేయ కవిత అంతటి మహోన్నతమైది.

***"మా కొద్దీ తెల్లదొరతనం, మా ప్రాణాల పై పొంచి..మానాలు హరియించె***

***వర్తకంబున కొచ్చి.. పట్టణంబులు పట్టి రాజ్యమొక్కటి అల్లినాడు***

***దాన్ని రాణీకప్పగించినాడు,రాణీ పత్రమ్ము చించేసినాడు***

***ఈ చిత్రమిదేమన్న – శిక్షిస్తానంటాడు"*** అని ఆంగ్లేయులు మనదేశానికి వర్తకానికి వచ్చి తిష్ట వేశారని, ప్రజలకు కల్లు, సారా అమ్మి వారి సంసారాలను గుల్లచేశారని, గాంధిజీ టోపీ పెట్టి బడికి వస్తే వీపుల మీద బాదినారని తెలియజేశారు.

ఆనాడు గరిమెళ్ళ వారు "మా కొద్దీ తెల్లదొరతనం" అనే గేయాన్ని పట్టణాలలో, పల్లెటూళ్లలో తిరిగి పాడుతుంటే అశేష ప్రజలు గరిమెళ్ళతో గొంతు కలిపారు. గరిమెళ్ళ వారి ఈ గేయం స్వరాజ్య సగ్రామంలో కలికితురాయింది.

అలాగే "మహాత్ముని సందేశం" అనే గేయంలో గరిమెళ్ళ

వారు

***"శాంతము తగునో జనులారా – అది శ్రేయమ్మన్నిటికి జనులారా!***

***ప్రేమ చేతనే – పగతుని గెలుతుము– రక్తపాతములు రాక్షసమతమగు***

***సత్యమహింసలు జనులారా ! మన శస్త్రాస్త్రములు జనులారా***

***సమయము కనుగొని – సత్యాగ్రమున సంపాదింతుము"*** అని గాంధీజీ సత్యాగ్రహం సత్యము ,అహింస,ప్రేమ, శాంతి మార్గాలను ప్రభోదించినారు.

మద్యపాన నిషేదం మీద గాంధీజీ ఇచ్చిన ఉపన్యాసాలకు గరిమెళ్ళ వారు ప్రభావితులై "కల్లు" అనే గేయంలో

***"కల్లు త్రాగి నీయిల్లు నెల్ల – గుల్ల చేయకు నీ వళ్ళు రోగాలకెల్ల .. వడ్డీ కీయకు***

***పిల్ల జెల్లలను తెచ్చి – వీధి బెట్టకు – ముసలి తల్లిదండ్రులను బట్టి – తన్ని కొట్టకు"*** అని హితవు పలికినారు.

గాంధీజీ ప్రభావంతో ఉద్యమంలో ఇంకా మొందుకెళ్లిన సాహితీకారుడు బసవరాజు అప్పారావు. వీరు వేణునాదం, మత్తుమందు వంటి గేయాలు రాసి, ప్రజలను స్వరాజ్య స్థాపనలో పాలిభాగస్తులను చేయుటలో ముఖ్యభూమిక వహించారు. "వేణునాదం" అను

***"భారతదేశము దాస్యము బాపగ పయనమాయే మోహన గాంధి***

***చావో జయమో , తేలందే యీ జన్మకు మళ్ళీ.. కనబడదండోయీ"*** అని గాంధీజీ స్వరాజ్య స్థాపనకు నడుం బిగించినట్లు తెలిపారు. ఇంకా భార్యభర్తలు, పిల్లలు, తమ తమ బాంధవ్యాలు విడచి స్వాతంత్రోద్యమ సాధనకై రాండోయని పిలుపునిచ్చారు.

గాంధీజీ బోధనలకు ఆకర్షితులైన కవులలో నెళ్లూరి వెంకట రామానాయుడు గారు ముఖ్యులు. వీరు పెట్టరే రాట్నం, కట్టకుమా సీమ బట్ట అనే కవిత్వాల ద్వారా ప్రజల్లో విదేశీ వస్త్ర బహిష్కరణను, స్వదేశీ వస్త్రాల తయారీని, రాట్నం వాడుకుటను గురించి తెలియజేసినారు.

***" కట్టకుమా సీమా బట్ట***

***మంచి మంచి కాపురాలు –మంటల పల్జెసి కడకు***

***కడకు కొంచమైన లేక కొంపగుల్లా జేసినట్టి***

***తగుల బెట్టు సీమా గుడ్డ – మిగుల కట్టు దేశ గుడ్డ"*** అని విదేశివస్త్ర బహిష్కరణను, స్వదేశీ వస్త్రాల వాడుకను గురించి తన గేయాల ద్వారా పిలుపునిచ్చారు.

అలాగే భారత జాతీయతని చాటుతూ చిలకమర్తి లక్ష్మీ నరసింహం.

***"భరత ఖండంబు చక్కని పాడియావు***

***హిందువులు లేగదూడలై యేడ్చుచుండ***

***తెల్లవారను గడసరి గొల్లవారు***

***పితుకుచున్నారు మూతులు బిగియగట్టి".*** అని తెల్లవారు మన సంపదను కొల్లగొట్టు విధానాన్ని వీరి గేయములో తెలియజేసినారు.

అలాగే ఆనాడు గాంధీజీ పిలుపునందుకొని మచిలీపట్నంలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న పింగళి వెంకయ్య "భారతదేశానికి ఒక జాతీయ పతాకం" అనే గ్రంధాన్ని రాసి ప్రతి భారతీయుడు గర్వించదగ్గ "మువ్వన్నెల జెండా"ను తయారు జేసినాడు. యెద్దు కంటికి ఎర్ర గుడ్డ వలె మన మువ్వనెల జెండా ఆంగ్లేయులకు గుండెపోటైంది. ఆనాడు ఆంధ్రులే కాదు యావన్మంది భారతీయులు ఈ జెండాను భుజంవేసుకొని జేజే నాదాలు చేశారు.

అలాగే "గాంధీ శతకం, నిరుద్ద భారతం"లను రాసిన మంగిపూడి వెంకటశర్మ

***"మేలుకొనుమీ భారత పుత్రుడ***

***మేలుకొనుమీ సచ్చరిత్రుడ***

***మేలుకొనవయ్యా వత్స మేలుకో"*** అని నిద్రిస్తున్న జాతిని నిద్రలేపినారు.

గాంధిజీ ప్రసంగాలకు ఆకర్షితులై తమ రచనలు, గేయాలు రాసిన వారిలో "కొండపల్లి జగన్నాధదాసు భక్తరామదాసు కీర్తనలు అనుకరిస్తూ

***అంతా గాంధీమయం.. యీ జగమంతా గాంధీమయం***

***అంతరంగమున, మహాత్మాగాంధియే,***

***వింతరూపముగా వెలిసియుండగ– అంతా గాంధీమయం***

***ఇండియాలో, ఇంగ్లాండ్‌లో, ఆఫ్రికాలో అమెరికాలో***

***అంతా గాంధీమయం"*** అని గాంధీజీని కీర్తించారు.

గాంధీజీచే విశేషంగా ప్రభావితమైన కరుణశ్రీ జంద్యాల పాపయ్య శాస్త్రి" మహాత్మాగాంధి" అను గేయంలో గాంధిగారు కొల్లాయి గట్టిన పిచ్చిపుల్లై వలేనుండుగాని ఆయన పవిత్ర దేవలయమని, విచిత్ర విశ్వవిద్యాలయం తో సమానమని,

# అలంకార ప్రాయం

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261

*స్వీయ దుఃఖానికి*
*వాచ్యమే ఈ కన్నీళ్ళు*
*సామూహిక రోదనలు*
*అక్షరాల్లో ధ్వనిస్తాయి!*
*మట్టికి రక్తం మరకలంటించే వాడెవడైనా*
*పది తలల రాక్షసుడే!*
*ఆయుధాలు వెంటేసుక తిరిగే వారు*
*చరిత్ర నిర్మాతలు కాలేరు*
*యుద్ధాల నుండి పాఠాలు నేర్వక పోతే*
*మనిషి మనుగడ ప్రశ్నార్థకమే!*
*అడవులూ మైదానాలూ*
*భిన్న సాంస్కృతిక కేంద్రాలు*
*మానవ ప్రస్థానానికి అవి ప్రతీకలు!*
*ఒకరి మీద మరొకరు గెలిచే యత్నాలన్నీ*



*ఆధిపత్య భావజాల సూచికలే*
*మానవ భవితవ్యం పై*
*నీలి నీడలు వాలుతున్నంత కాలం*
*పాలనా యంత్రాంగాలన్నీ*
*అలంకార ప్రాయాలే!!* ♦

---

ఆయనే పిలుపే ప్రభంజనమని, ఆయన శక్తి గొప్పదని తెలిపారు.

ఆత్మకథ, మహాత్ముని కథ అనే ఉత్కృష్ట గ్రంథాలు వెలువరించి "మహాత్ముని ఆస్థాన కవి"గా బిరుదాంకితులైన తుమ్మల సీతా రామామూర్తి, గాంధీజీ బోధనలకు ఆకర్షితులై అపారమైన దేశభక్తి, అఖండ స్వభాషానురక్తిని, అప్రతిహాత జాతీయాభిమానం కలవారగుటచే దేశభక్తి గేయాలను వెలువరించి ప్రజల్లో జాతీయత, స్వాతంత్ర భావాలను నూరిపోశారు.

అలాగే గుర్రం జాషువా తన బాపూజీ అనే ఖండకావ్యంలో గాంధీజీ విధానాలను తెలుపుతూ

***"గోచి పాత గట్టుకొని జాతిమానంబు***
***నిలిపినట్టి ఖద్దరు నేతగాడు***
***విశ్వసమరస్య విజ్ఞాన సంధాత"*** అని విశ్వసామరస్యాన్ని తెలియజేశారు.

గాంధీజీ సహనాన్ని '

***'పండ్లునూరుచున్న***
***బహుమతంబులలోన***
***సహనవిద్య నేర్పు సాధకుండు***
***భార్యాబిడ్డలున్న ప్రత్యక్షదైవంబు"*** అంటూ కొనియాడాడు.

♦♦♦

లేఖా సాహిత్యంలో రచనలు చేసిన శ్రీమతి కనుపర్తి వరలక్ష్మమ్మ, గాంధీజీ భావాలకు ప్రభావితురాలై గాంధీదండకము రాశారు. మూలాలు బెంగాల్ వారైనప్పటికి తెలుగింటి కోడలైన శ్రీమతి సరోజినీ నాయుడు తన రచనల ద్వారా, పాటల ద్వారా గాంధీజీ తత్వాన్ని ప్రచారం చేసి "భారత కోకిల" అనే బిరుదు పొందారు.

గాంధీజీ ప్రభావంతో ఉన్నవ వారి మాలపిల్ల, విశ్వనాథ వారి వేయి పడగలు, అడవి బాపిరాజు గారి నారాయణరావు, మహీధర రామ్మోహనరావు గారి "కొల్లాయిగట్టితేనేమీ", బుచ్చిబాబు గారి "చివరికి మిగిలేది", కొడవటిగంటి వారి "చదువు" వంటి నవలలు , నాటకాల ద్వారా ఆంధ్రుల సంస్కృతిని, స్వాతంత్రోద్యమ కాలంనాటి పరిస్థితులను తెలియజేశారు.

గాంధీజీ ప్రభావంతో ఉప్పు సత్యాగ్రం, విదేశీ వస్త్ర బహిస్కరణ, విదేశీ వస్తు బహిష్కరణ, స్వదేశీ వస్త్రాల తయారీలో, ఖాదీ వస్త్రాదరణ, దండి సత్యాగ్రహం తదితర కార్యక్రమాలలో పాల్గొనటమే కాకుండా ఆచరించారు. ఎందరో మద్యపానాన్ని, మాంసాహారాన్ని మానివేసి గాంధీజీ మరణాంతరం కూడా వారి సిద్దాంతలను ఆచరిస్తూ ప్రచారం చేసారు. ♦






మూరిశెట్టి గోవింద్

# అణిచివేతకు అద్దం పడుతున్న కతలు

- వై.హెచ్. కె. మోహన్‌రావు
8985296123

సకల శాస్త్రాల సారాన్ని అపోసన పట్టే లక్ష్యంలో భాగంగా శృంగార శాస్త్ర అధ్యయనం నిమిత్తం సన్యాసిఐన ఆదిశంకరాచార్యులు పరకాయ ప్రవేశం చేశారని జనశృతిలో వున్న కథనం. ప్రచారంలో వున్న ఈ గాధలో వాస్తవం ఎంత వుందో చెప్పలేముగానీ! కథారచయిత మూరిశెట్టి గోవింద్ తనది కానటువంటి మంగలి కులంలోకి చొచ్చుకు వెళ్ళారు. ఆయన రచించిన "మావూరి మంగలి కతలు" సంపుటిని చదివినవారెవరైనా పై విషయాన్ని నిర్ధారిస్తారు. గోవింద్ మంగలికులం ఒడిదుడుకులను ఆమూలాగ్రం అధ్యయనం చేశారు. వారి జీవన గమనాన్నీ, అనుభవించే అవమానాలూ, ఈ బాధలనూ, వ్యధలనూ క్షుణ్ణంగా ఆకళింపు చేసుకున్న గోవింద్ "మావూరి మంగలి కతలు" మకుటంతో 18 కథలను సృజనాత్మకంగా మలిచారు. ఈ మొత్తం కథలను ఆయన ఒక సంపుటిగా 2019లో ముద్రణలోకి తీసుకువచ్చారు. ఈ కథలను చదివినప్పుడు ఆ కుల స్థితిగతులను గోవింద్ అవగతం చేసుకోవడానికి ఎంతో కృషి చేశారని అర్థమౌతుంది. కుల సమాజంలో మంగలి స్థానాన్ని వాస్తవ దృక్పథంతో కథలుకథలుగా మలిచారు. గ్రామవ్యవస్థలో మంగలి కులంపై స్వారీ చేస్తున్న అగ్రకుల ఆధిపత్యం, అణిచివేతలను, గోవింద్ ఆసక్తికరంగా చెప్పుకొచ్చారు. ఆ కులస్థులపై తను సానుభూతితో రాసిన ఈ కథలను చదివిన పాఠకున్ని కూడా ఆ కులస్థులకు దన్నుగా నిలబెడతారు గోవింద్.

వాస్తవానికి మంగలి కులం కూడా శూద్రవర్ణంలోనికే చేరుతుంది. శూద్రులందరిదీ ఒకేజాతి. ఐతే అగ్రవర్ణ శూద్రులకు మానవసమాజంలో లభిస్తున్న గౌరవమర్యాదలు మంగలి కులానికి దక్కడం లేదనేది రచయిత ప్రగాఢ విశ్వాసం. ఇందులో ఎవరికీ మరో భిన్నమైన అభిప్రాయం వుండదు గాక వుండదు. శూద్ర అనేపదం మాటున నిచ్చెనమెట్ల విభజన వుంది. ఎగుడు దిగుడు శూద్ర సమాజంలో దిగువన వుండే కులాల్లో మంగలి కులం కూడా చేరింది. మంగలికులం అతిశూద్ర జాబితాలోకి వెళ్ళింది. అంతేగాకుండా మంగలి ఆధారిత కులం ఉత్పత్తి రంగాలకు దూరంగా నిలువరించబడిన కులం. ఉత్పత్తి కులాలపై ఆధారపడి జీవించే కులం మంగలి. కేవలం సేవారంగానికి మాత్రమే పరిమితమైన కులం. ఈ పూర్వ రంగంలో ఆ కులస్థులు సంపన్నులుగా ఎదగడానికి ఉన్న అవకాశాలు చాలా తక్కువేనని చెప్పాలి. ఈ నేపథ్యంలో స్థితిగతులెలా వుంటాయో ఊహకందని విషయమేమీ కాదు. ఈ లోటే ఆ కుల స్వరాన్ని ఎల్లవేళలా అదుపులో వుంచుతుంది. ఏ అదృశ్య దృశ్యహస్తమో పగబట్టినట్లుగా ఆధారితకులాలన్నీ నేటికీ అణిచివేతలోనే కొనసాగుతున్నాయి. ఈ సంగతులనే భూమికగా చేసుకుని కథలను అల్లాడు గోవింద్. అగౌరవంగా, అవమానాలతో సాగే మంగలి కుల వెతలనూ, వ్యధలనూ కలానికి ఆసరా చేసుకుని గోవింద్ "మావూరి మంగలి కతలు" హృద్యంగా రూపొందించారు. కథలన్నీ చదవడం ముగిసే సమయానికి పాఠకుని హృదయం ద్రవిస్తుంది. ఆ కులం పట్ల జాలేస్తుంది. కళ్ళు చెమరిస్తాయి కూడాను.

ఈ సంపుటిని చదువుతున్నప్పుడు తన ప్రాంతం పట్ల, తన ప్రాంతీయ భాష పట్ల గోవింద్‌కు గల గాఢమైన ఆసక్తి,

అనురక్తి, అభిలాష, మమకారం, వెల్లడౌతాయి. గ్రామ్యాలనూ, ప్రాంతీయాలనూ ఆయన, పాఠకునికి చేరుతుందా! లేదా! అనే సంశయానికి పోకుండా విశేషంగా, విరివిగా, విస్తృతంగా వినియోగించారు. కథల్లోని కొన్ని పదాలు ఇతర ప్రాంత పాఠకులకు అర్థం కాక పోయినప్పటికీ గోవింద్ చెప్పదలుచుకున్న విషయం మాత్రం హృదయాన్ని సూటిగా తాకుతూ మెలిపెడుతుంది. చదవడం ముగిసిన తరువాత ఆ కథలు, కథలలోని పాత్రలూ కొంత కాలంపాటు మిమ్మల్ని వెంటాడుతూనే వుంటాయి. గోవింద్ ప్రయోగించిన భాషలో ఆయన పుట్టి పెరిగిన మట్టి పరిమళాలు నిండి వుంటాయి. చక్కని యాస ప్రయోగం ఫలించింది. ఈ యాస ఆయన వాడతారా? లేదో! తెలియదుగానీ, ఆ ప్రాంత ప్రజల గళాన్ని తన కలంలోకి తీసుకున్నట్లుగా స్పష్టమౌతుంది.

ఈ కథలలోని అంశాల గురించి ప్రఖ్యాత కథకులు సింగమనేని నారాయణ విశ్లేషిస్తూ కథల వస్తువు నాలుగైదు దశాబ్దాల కిందటిదని చెప్పినప్పటికీ, నేటికీ అనేక గ్రామాల్లో సజీవంగా వర్ధిల్లుతున్న ఆగడాల సారాంశమేనని నా అభిప్రాయం. మంగలికులమేగాదు, పెత్తందారి కులాల ఏలుబడిలో గ్రామ్యవ్యవస్థనందు అనేక సన్నకారు, చిన్నకారు కులాలు ఇంకా ఒత్తిగిలి మెలుగుతూనే వున్నాయి. కాళ్ళు కడుపులో పెట్టుకునే మనగలుగుతున్నాయి. ఈ అవస్థలనే గోవింద్ తన కథలకు మూలాలుగా చేసుకున్నారు. ఒక వైపు మంగలి కులం అనుభవిస్తున్న వెతలను మలుస్తూనే, కొన్ని కథలలో ఆయన ఆ కులం ఎట్లా అణిచివేత నుండి వెలుపలికి రావాలో సూచించారు. కిందికులాలు ఐక్యంగా వుండవలసిన ఆవశ్యకతను గురించి గోవింద్ నొక్కి చెపుతారు. అన్ని సమస్యల పరిష్కారానికి ఐకమత్యమే అసలైన మార్గమంటూ ఆయన మార్గదర్శనం చేస్తారు. ఒకటికి అందరూ, అందరికీ ఒక్కరు అన్న తీరులో నడిచినప్పుడే చిన్నకులాలు ఎదుగుతాయని, వారికీ కూడా సమాన మర్యాదలు దక్కుతాయని ఎలుగెత్తుతారు.

"మెట్టుదిగిన మణీగౌడు" శీర్షిక గలిగిన కథలో ఐక్యతతో సాధించిన గౌరవాన్ని గూర్చి గోవింద్ విస్పష్టంగా తెలిపారు. బలవంతులూ, పెత్తందార్లూ ఎట్లా మెట్టు దిగి వస్తారో వివరించారు. గడ్డిపోచలన్నీ కలిపి నిరంకుశత్వాన్ని ఎట్లా కట్టడి చేయవచ్చో వెల్లడించారు. "ఇంటి ముందరితిన్ని" తలకట్టు గల కథలో మంగలి కులం వారికి లభించే గౌరవ సూచీని ఎరుక పరిచారు. "నోటికాడ కూడు" మకుటం కలిగిన కథలో గ్రామాల్లోని పెత్తందారులు బలహీనులను మరింత అణిచివేయడానికి ఎట్లాంటి అక్రమ మార్గాలను అన్వేషిస్తారో విప్పి చెప్పారు. ఏదో విధంగా తమ ఆధిపత్యాన్ని నిలుపుకోవడానికి ఎట్లాంటి అనుచితాలకైనా తెగబడతారని విపులీకరించారు. "మంచికాలం" శీర్షిక గల కథలో మంగలి వృత్తి అభివృద్ధి చెందిన విధానం, పెరిగిన పెట్టుబడులూ, నగరీకరణ, సుందరీకరణ గురించి విశ్లేషిస్తారు. ఈ నేపథ్యమే గతానికి భిన్నంగా అంటరానితనాన్ని అధిగమించి అన్ని కులాలకు సమాన ప్రాతిపదికన సేవలు అందుబాటులోకి వచ్చిన మంచికాలాన్ని ఆయన వివరిస్తారు. "మణీ గారి దురాగతాలు" పీఠిక గల కథలో గ్రామాల్లో బలవంతులు తమ అనుమానాలకు, అకృత్యాలకూ, బలహీనులను ఎట్లా బలి పెడతారో విశదీకరించారు. చిట్టచివరి కథ "కాలసెక్రం"లో తన రాజకీయ సైద్ధాంతిక భావజాలాన్ని ఏకరువు పెట్టారు. వామపక్ష పార్టీలు ప్రజలను ఎట్లా చైతన్య పరిచాయో, ఎట్లా ఐక్యం చేశాయో, బలహీనులందరినీ ఎట్లా కూడగట్టాయో, వామపక్షపార్టీల నేతలు చేసిన పోరాటాలనూ, సన్నకారు ప్రజలకు యిచ్చిన (ప్రోత్సాహాన్నీ), వారి రాజకీయ ఎదుగుదలకు చూపిన మార్గాలనూ పూసగుచ్చినట్లు ప్రకటించారు. ఈ కథా సంపుటిని చిత్తూరి జిల్లా అభ్యుదయ రచయితల సంఘం వారు ముద్రించారు. కథాప్రియులే గాక, పుస్తకపఠనంపై ఆసక్తి వున్న వారందరూ చదువువలసిన కథా సంపుటి "మా వూరి మంగలి కతలు" ఒక్క కులానికి సంబంధించిన విషయాలనే కేంద్రంగా మొత్తం సంపుటిని రూపొందించడం రచయిత ప్రజ్ఞను తెలియజేస్తుంది. అందుకు మూరిశెట్టి గోవింద్‌ను అభినందిస్తున్నాను.

18 కథలు 96 పుటలు కలిగినటువంటి "మావూరి మంగలి కతలు" కథా సంపుటి వెల రూ. 100/- లు ప్రతిని కోరువారు మూరిశెట్టి గోవింద్, చిన్న దొరవారి కండిగ (గ్రామం& పోస్టు). కార్వేటి నగరం, మండలం, చిత్తూరు జిల్లా అనే చిరునామాను సంప్రదించండి. సెల్ నం. 9502200749, 9440849755 నెంబర్ల ద్వారా సంపుటిలోని కథలను ఆస్వాదించిన అనంతరం రచయితతో అనుభూతిని పంచుకోండి. ♦

## కవిత

# కొత్త ఊపిరి

- చల్లగాలి బాబూరావు
09941469728

రాత్రంతా
కలల విన్యాసం
తన్మయుణ్ణి చేసింది
పండు వెన్నెలలోని
నిండు జాబిల్లిని
హృదయమంతా పరుచుకొని
జారిగిల పడినప్పుడు
కలత నిద్ర కాటు వేసింది
ఎదలోని బరువంతా కరిగి
ఆత్మీయ రాగాల్ని ఆలపిస్తూ
మనిషి తనాన్ని మేల్కొల్పింది
పాల మీగడ వంటి



వెలుతురు రేఖలు వాలి
చీకటి పొరలు విరిగి
భళ్ళున తెల్లారింది!
ఒక కొత్త ఊపిరి
నూతన రూపాన్ని ఆవిష్కరించింది
జీవన పయనంలోకి
కొత్త వెలుగులు ప్రవేశించి
జీవితాన్ని
సారవంతం వైపుగా ♦

# చెట్టుకో విన్నపం

- డా॥ వి.ఆర్. రాసాని
9848443610

ఓ చెట్టూ - నువ్వు
అందని ఆకాశంలో
గాలిగుర్రాల పై వెళ్ళే
మేఘాల పాంథుల్ని
ఆహ్వానించి, ఆశ్రయమిచ్చి
వర్షపు వరాల్ని వడ్డించే
పేదరాసి పెద్దమ్మవు

మబ్బుల ప్రియుడు రాల్చిన
చినుకుల ప్రేమలో తడిసి
పూల శిశువుల్ని కని
చిగురు పొత్తిళ్ళలో వాటిని
విత్తనాల విత్తంగా మార్చే
పెద్ద ముత్తయిదువు

కాండపు పునాది పై
కొమ్మల కుడ్యాలతో
ఆకుల పచ్చటి పెయింటింగ్‌తో
అందంగా అలంకరింపబడిన
పక్షుల ఏకశిలా భవంతివి

వాతావరణంలోని
విషపు గాలుల్ని పీల్చుకొని
ప్రాణవాయువుల్ని ప్రసాదించే
పచ్చటి వన దేవతవి

ఓ చెట్టూ-

ఆ పేదరాసి పెద్దమ్మల నడుముల్ని
ఆ ఏకశిలా భవంతుల్ని కూల్చి
ఆ వనదేవతల తలల్ని నరికి
స్వార్థంతో నరుడు పడగొడుతుంటే
అనతికాలంలోనే - నువ్వు
వృక్షశాస్త్ర ప్రయోగశాలల్లో మాత్రమే
కనిపించే
అరుదైన అంశంగా మారిపోతావు

ఓ చెట్టూ - నువ్వు

నీ కొమ్మల్ని విల్లుగా
రెమ్మల్ని శరాలుగా మార్చి
నిన్ను కూల్చడానికి వచ్చేవారి
గుండెలకు గురిపెట్టు
నిన్ను కోయడానికి తెచ్చే
రంపానికి పిడిగా మారిపో



నిన్ను నరకడానికి వచ్చే
గొడ్డలికర్రగా మారిపో
వృక్షజాతిని నాశనం చేయాలనుకునే
వారిపైన తిరగబడు - లేకుంటే...

ఓ చెట్టూ
ఈ భువనం తగలబడి
నీ జాతేకాదు
సమస్త జీవరాశులు
మాడి మసై
లోకమే స్మశానంగా
మారిపోయే కాలం
ఎంతో దూరంలో వుండదు ♦

విశ్లేషణ

# గాంధీ ప్రభావం - అంటరానితనం నిరసన కవిత్వం




- జడా సుబ్బారావు
9849031587

**భా**రతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి ఎన్నేళ్లు గడిచినా మనం ఇంకా అస్పృశ్యత, అంటరానితనం, కులం విషయంలో ఆశించినంత పురోగతి సాధించలేదు. నిమ్న కులాల వారిని పెళ్లి చేసుకుంటున్న కారణంగా పరువు హత్యలు జరుగుతున్నాయి. దళితులను అనేక గ్రామాలలో కులం పేరుతో ఇంకా వెలివేస్తూనే వున్నారు. దళిత స్త్రీల మీద అత్యాచారాలు, హత్యాకాండలు సాగుతూనే ఉన్నాయి. ఆధునికంగా ఎదుగుతున్నామని, వైజ్ఞానికంగా పురోగమిస్తున్నామని చెప్పుకుంటున్న ఈ రోజుల్లో పరిస్థితి ఇంత దారుణంగా వుంటే స్వాతంత్ర్యానికి పూర్వం వెలివేయబడిన వారి పరిస్థితుల్ని, జీవన స్థితిగతుల్ని తల్చుకుంటే ఒళ్లు గగుర్పొడుస్తుంది.

గాంధీ స్వాతంత్ర్యోద్యమంలోకి ప్రవేశించక ముందే 1909లో 'మాలవాండ్రపాట' అనే పేరుతో ఒక గేయం వచ్చింది. రచయిత పేరు తెలియని ఈ గేయం వర్ణవ్యవస్థలోని లోపాలను ఎండగట్టిన గేయంగా ప్రసిద్ధి పొందింది. ***'అందారు పుట్టిరి హిందమ్మ తల్లికి/ఈ అందారు ఒక్కటై ఉందారి/ సక్కంగా అమ్మోరు దీవించి అయిశర్యమిచ్చును'*** అంటూ సాగే ఈ పాటలో కొన్ని కులాలు ఎక్కువా, మరికొన్ని కులాలు తక్కువా అంటూ విభేదాలు ఎందుకు వస్తాయి? అందరం ఒక తల్లి బిడ్డలమే కదా అని ప్రశ్నిస్తారు. 1910లో గురజాడ రాసిన 'లవణరాజు కల'లో కూడా మనకు ఇలాంటి భావమే కనిపిస్తుంది. 'నెలవౌసంగిన వర్ణధర్మ మధర్మ ధర్మంబె' అంటూ మాలలకు శరీరాలు మాత్రమే మలినమని, వారిని అణగదొక్కే అగ్రకులాలకు మనసే మలినమైపోయిందని, కనుక వారిని కూడా మాలలనే అందామా? అంటూ వ్యవస్థలోని లోపాలు ఎండగడుతూనే 'మంచియన్నది మాలయైతే మాల నేనవుతాను' అని చెప్తాడు గురజాడు.

హిందూ సమాజంలో శూద్రులు, చండాలురు, దళితులు మొదలైన పేర్లతో పిలవబడిన వారికి సమాజంలో అన్ని సౌకర్యాలూ నిషిద్ధమే. అంటరానితనాన్ని సాకుగా చూపించి నీటిబావులలో నీళ్ళను వాడడం, దేవాలయాల్లో ప్రవేశం, చదువు మొదలైన వాటికి వారు దూరంగా నెట్టివేయబడ్డారు. కానీ గాంధీ ప్రభావంతో పై అంశాలను వస్తువుగా స్వీకరించి కవిత్వాన్ని రచించి సమాజంలో అందరూ సమానమేననే భావనను చాటిచెప్పారు కవులు.

గాంధీ పాటించిన సత్యం, అహింసలతో పాటు జాతీయోద్యమంలో అంతర్లీనంగా ఇమిడివున్న అంటరానితన నిర్మూలన, ఖాదీ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా, మద్యపాన నిషేధం మొదలైన అనేక అంశాలను కవులు తమ తమ సాహిత్యంలో ప్రతిఫలింపజేశారు. స్వాతంత్ర్యోద్యమాన్ని ఊగ్రూతలూపేలా, గాంధీతత్వాన్ని

ప్రతిబింబించేలా అనేక నవలలు, నాటకాలు, దండకాలు, శతకాలు, గీతాలు స్వాతంత్ర్యకాలం నాటి సాహిత్యంలో ప్రతిఫలించాయి.

అటు ప్రజలపైన, ఇటు సాహిత్యంపైన అమితమైన ముద్రను 'గాంధీతత్వం' వేయగలిగింది. మనిషిని మనిషే తాకనివ్వని 'అస్పృశ్యత, అంటరానితనాన్ని, గాంధీ తీవ్రంగా గర్హించాడు. వెళ్ళిన ప్రతీచోటా, ఇచ్చిన ప్రతీ ఉపన్యాసంలోనూ అంటరానితనం పట్ల గాంధీకి వున్న వైముఖ్యం వెల్లడవుతుంది. ఈ అంశాల్ని తీసుకుని అనేకమంది కవులు, కవయిత్రులు తమతమ కవిత్వంలో ఆ విషయాలను చిత్రించారు.

తొలి దళితకవిగా పేరుపొందిన కుసుమ ధర్మన్న కవి రచించిన 'హరిజనశతకం'లో "ప్రియ హరిజన సోదరా! నీవు హీనజాతివాడివా? బానిసవా? పరులకు దాస్యం చేయుటకు భగవంతుడే నిన్నిట్లు విధించినాడా? ఆహా! ఏమి యీ నిరంకుశత్వము?" అంటూ వర్ణవ్యవస్థలోని లోపాలను ప్రశ్నిస్తాడు. జాషువా తన గబ్బిలంలో 'ముసలివాడైన బ్రహ్మకు పుట్టినారు నలువురు కుమారులనుట విన్నాముగాని పసరము కన్న హీనుడభాగ్యుడైన యైదవ కులస్థు దెవరమ్మా! సవిత్రి' అంటూ ఐదవ కులాన్ని సృష్టించిన వారెవరో చెప్పమంటాడు. జాలా రంగస్వామి, బోయి భీమన్న, ఇనాక్ మొదలైన కవులందరూ కవిత్వం, గేయం, నాటకం మొదలైన ప్రక్రియల ద్వారా అంటరానితనాన్ని నిరసించారు.

హరిజనులని పిలవబడిన వారికి దేవాలయ ప్రవేశం నిషిద్ధం. దేవుడు అందర్నీ సృష్టించాడని పైకి చెప్తున్నవారు హరిజనుల దేవాలయ ప్రవేశాన్ని జీర్ణించుకోలేకపోయారు. అస్పృశ్యుల దేవాలయ ప్రవేశాన్ని సమర్థిస్తూ అనేకమంది కవులు, రచయితలు తమ రచనలు వెలువరించారు. కాటూరి వారు తమ గుడిగంటలు కవితలో 'చీకటి కొంపలో బతుకుతూ, కట్టుకోవడానికి సరైన దుస్తులు లేకుండా చింకిగుడ్డలతో కాలం గడుపుతూ, గోవుల్ని మేపుతూ, పాలను పితుకుతూ మూడు కాలాల్లోనూ పైరులు పండిస్తూ, ఆ ధాన్యంతో నీ గాదెలు నింపుతున్న 'మాలదాతనికి నేలా మోము జూపింపవో' అంటూ ఆ స్వామిని ప్రశ్నిస్తారు.

మనిషిని మనిషి అంటుకోని దౌర్భాగ్యాన్ని నిరసిస్తూ "మాలలంటరాని మానవులని సవర్ణులు తలంత్రు పాడి తొలగద్రోసి నరుడు నరునకింత కొరత విధించుచో నెట్లు సంతసించు నీశ్వరుండు' అంటూ నరులు నరుల్ని దూరం పెడితే ఈశ్వరుడు కూడా సంతసించడని చెప్తారు తుమ్మల సీతారామమూర్తి.

సాటి మానవులను అంటరాని ప్రజలుగా భావించి దూరంపెడితే దానిని భగవంతుడు కూడా మన్నింపడని భావించిన గాంధీ హరిజనాభ్యుదయం కోరుతూ గ్రామగ్రామాన తిరుగుతూ చైతన్యం తీసుకురావడానికి ప్రయత్నించాడు. 1933లో కావూరి గ్రామంలో శివుని గుడిని హరిజనులకు ఆవిష్కరించడం, కేరళలోని గురువాయూరు కోవెలను హరిజనుల ప్రవేశంకోసం తెరవాలని పట్టుపట్టడం అనేవి కీలకఘట్టాలుగా చెప్పుకోవచ్చు. అయినప్పటికీ హరిజనుల దేవాలయ ప్రవేశ విషయంలో గాంధీ చిత్తశుద్ధితో వ్యవహరించలేదన్న అపవాదు ఉంది. 1934లో వచ్చిన బీహారు భూకంపంలో చెల్లా చెదురైన ప్రజల్ని ఓదార్చడానికి వెళ్ళిన గాంధీ అక్కడి వారితో "ఈ భూకంపం కంటే దారుణమైన దురితం హరిజనులను దూరముంచడమే' అని చెప్తూ, అందువల్లే అటువంటి దారుణ పరిస్థితులు నెలకొంటున్నాయని చెప్పాడు.

ఊరిచివరి పూరిగుడిసెల్లో ఏ సౌకర్యాలకూ నోచుకోకుండా బ్రతుకీడ్చుతూ అందరిచేతా వెలివేయబడిన జాతి అంటరాని ప్రజలు, అస్పృశ్యులు, వారి గాలి సోకినా మైలపడిపోతామనే భావన కలిగిన మతఛాందసవాదుల, మనువాద కర్తల రాతలు వారిని మరింత చీకటిలోనికి, ఎదుగుదలకు అవకాశంలేని నిస్సహాయతలోకి నెట్టివేశాయి. ఈ సందర్భంలో "సవర్ణ హిందువులలోని సంస్కర్తలు ఎంతో విజ్ఞానవంతులు. అయినాగాని వారు తమ కార్యకలాపాలను బలవంతపు వైధవ్యాన్ని, బాల్య వివాహాలను రద్దుచేయడం వరకే పరిమితం చేసుకున్నారు. కులాలను రద్దుచేయవలసిన అవసరాన్ని వారు గుర్తించలేదు. సరికదా కులవ్యవస్థకు వ్యతిరేకంగా ఆందోళన జరిపే ధైర్యమూ లేకుండా పోయింది వారికి" అని చెప్పిన అంబేద్కర్ మాటలు ఇక్కడ ప్రస్తావనార్హం. తమవి ఆధిక్య కులాలని భావించినవారు తమ కింది కులాలవారిని మాటలతోనూ, చేతలతోనూ అనేక రకాలుగా అణచివేసిన విధానం మనకు ప్రస్తుతకాలంలోనూ అవగాహనలోనూ వున్న విషయమే.

## హైకూలు

- బి. గోవర్ధనరావు
9441968930



మేఘ పల్లవి
వర్ష రుతువు పాటై
ప్రవహించింది

జలపాతాలు
మనుగడనందించే
మహా స్వప్నాలు

బాతుల ఆట
అలల మెట్ల మీద
చేపల వేట

నీటి మువ్వలు
నేలతల్లి ఒడిలో
చిందులాటలు

నీటి ప్రవాహం
జీవకోటిని నడిపే
నిజ జీవితం

మహా నగరాలు
మానవ సంబంధాలకు
అవరోధాలు ♦

---

అంటరానితనానికి నిరసనగా గాంధీ ప్రయత్నాలు అనేకమంది కవులను రచయితలను ప్రేరేపించింది. గాంధీ త్యాగాలను, చిత్తశుద్ధినీ కీర్తిస్తూ, అంటరాని జీవితాల్లో వెలుగులు నింపడానికి వచ్చిన గాంధీని వేయినోళ్లు పొగుడుతూ కవితలు రాశారు. 'సంఘదోషంబుల సమయింప సమకట్టి అంటరానితనము నణచినాడు' అంటూ దేశిరాజు భారతీదేవి అశ్రుతర్పణం అనే తమ కవితలో గాంధీని కీర్తిస్తారు. ముట్టుకుంటేనే మైలపడతారని భావన నుంచి సవర్ణ హైందవులను వ్యతిరేకించి అంటరానివారి వెలుగుల కోసం పోరాటం చేసిన గాంధీని "ఛీ పో దూరము... ముట్టగూడదనే మాలమాదిగల మనుజుల హృదిలో గాంధీయున్నాడు" అంటూ ఇవ్మూనేని లీలాదేవి ప్రస్తుతిస్తారు. అసలు సిసలు గాంధేయవాదిగా పేరుపడిన జాషువా కూడా ***'నిమ్నజాతుల కన్నీటి నీరదములు పిడుగులై దేశమును కాల్చి వేయుననుచు రాట్నమును దుడ్డుకర్ర కరాన బూని దెసల దోతెంచె గుజరాతు ముసలిసెట్టి''*** అంటూ గాంధీ అంటరానితనాన్ని నిర్మూలించడానికి పూనుకున్నాడని ఆయనను కీర్తిస్తాడు.

పశుపక్ష్యాదులను అత్యంత భక్తితో పూజిస్తారు. పాములకు పాలుపోసి తమ భక్తిని చాటుకుంటారు. ఆవులకు ప్రేమతో తినిపిస్తుంటారు. కానీ సాటి మానవుని మాత్రం అంటుపేరుతో దూరం పెడతారు. అటువంటివారిని సవర్ణ హైందవులు తమలో చేర్చుకోవాలని పిలుపునిచ్చిన గాంధీని "పిల్లుల నంటుచుండ్రు మఱి ప్రేముడి నెద్దుల నంటుచుండ్రు మ / మ్మెల్లర మాలమాదిగ లి సీ / తొలగుడని తోలుచుందు రీ / యెల్లని కార్యమున్ విడువుడో యను పూజ్యులు పంచమాహ్వాయుల్ /చల్లని నీదు సేతలకు సంబరమందిరి నేడు గాంధీజీ" అని కొనియాడతారు గాంధీజీ శతకంలో దుగ్గిరాల వారు. 1915లో వచ్చిన తొలి ఛందోబద్ధ దళిత కావ్యం మంగిపూడి వెంకటశర్మ రాసిన 'నిరుద్ధభారతం'. అందులో అస్పృశ్యతను నిరసిస్తూ ''మాలలని, పంచములటంచు, మాదిగలని, శ్వపచులని, చెప్పగారాని వారటంచు మరియు చండాలురని తోడి మానవులను దురలివేయుట సాంఘిక ధర్మమగునె" అని ప్రశ్నిస్తారు.

స్వాతంత్ర్యోద్యమకాలంలో వచ్చిన సాహిత్యం గాంధీ ప్రభావంతోనూ, అంబేద్కర్ ప్రభావంతోనూ వచ్చినట్లుగా కనిపిస్తుంది. ప్రత్యేకించి అంటరానితనాన్ని నిరసిస్తూ గాంధీ ఇచ్చిన సందేశంతో దానిని స్ఫూర్తిగా తీసుకుని అనేకమంది కవులు, కవయిత్రులు, రచయితలు తమతమ రచనల ద్వారా అంటరానితనాన్ని నిరసిస్తూ సాహిత్యాన్ని పరిపుష్టం చేశారు. సమాజం మీద సాహిత్యం మీద గాంధీ ప్రభావం విలువైనది. ఆ ప్రభావం కవిత్వంలోనూ, గేయంలోనూ, నాటకాలు, నవలలు రూపంలోనూ ప్రతిఫలించి కొత్తపుంతలు తొక్కింది. సంఘానికి దిశానిర్దేశం చేసింది. సాటిమనిషిని కులం పేరుతోనో, అంటుపేరుతోనో వేరుచేసే లక్షణం నుండి కొంతవరకైనా ఆ అణచబడిన కులాల వైపునుండి తమ రచనలను పరిశీలించాలనే స్థాయికి చేరుకోగలిగాయి. మనిషిని మనిషిగా గుర్తించి గౌరవించాలనే ఆలోచనకది బీజం వేసింది. ♦



# తెలుగు భాష మనది..హిందీ ఆధిపత్యాన్ని సహించం

### విజయవాడ సదస్సులో వక్తలు

'తెలుగు భాష మనది..హిందీ ఆధిపత్యాన్ని సహించం ' అంశంపై ప్రజాశక్తి సాహితీ సంస్థ, విశాలాంధ్ర విజ్ఞాన సమితి, మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె), సాహితీ స్రవంతి సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో సెప్టెంబర్ 18న విజయవాడ ఎంబివికెలో సభ జరిగింది. సభకు ప్రజాశక్తి సంపాదకులు ఎంవిఎస్ శర్మ, విశాలాంధ్ర సంపాదకులు ముత్యాల ప్రసాద్ అధ్యక్షత వహించారు. స్థానిక భాషలను కాదని దేశమంతటా హిందీనే రాజ్య భాషగా రుద్దేందుకు కేంద్రం కుట్రలు పన్నుతోందని ఎంవిఎస్ శర్మ అన్నారు. అమిత్‌షా ప్రకటనపై దక్షిణాది రాష్ట్రాలు మండిపడుతోంటే తెలుగు రాష్ట్రాల్లోని పాలక పార్టీలు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నాయన్నారు. కన్నడ భాష ఉనికిని కాపాడుకునేందుకు కర్నాటక బిజెపి ముఖ్యమంత్రి యడ్యూరప్ప బలవంతపు హిందీకి వ్యతిరేకంగా మాట్లాడుతుంటే తెలుగు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న ముఖ్యమంత్రులు స్పందించకపోవడం విచారకరమన్నారు. ప్రజలే ప్రభుత్వాలకు బుద్ధిచెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. లేకుంటే తెలుగు అస్తిత్వానికే ప్రమాదం ఏర్పడుతుందని హెచ్చరించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన వెంటనే తమ సొంత అజెండా అమలుకే ప్రాధాన్యం ఇస్తోందని ముత్యాల ప్రసాద్ అన్నారు. ఇది ప్రాంతీయ భాషలపై దాడి తప్ప మరొకటి కాదన్నారు. ప్రజలపై భాషా పెత్తందారీ తనం మంచిది కాదన్నారు. తెలుగు భాషను కాపాడుకునేందుకు తెలుగు జాతంతా నడుం బిగించాలన్నారు. అన్ని భాషల మాదిరిగానే హిందీ కూడా ఒక భాషగా రాజ్యాంగంలో గుర్తించారని, అంతేకానీ దాని కంటూ అదనపు ప్రాధాన్యత ఏమీ లేదని ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు అన్నారు. భారత దేశం జాతుల సమాహారమన్నారు. దేశం సమైక్యంగా అభివృద్ధి సాధించాలంటే ఏక భాషా పెత్తనం ఉంటే కుదరదన్నారు. నిరంతరం ప్రజలను విచ్ఛిన్నం చేయడమే బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ ప్రధాన అజెండా అని సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షులు తెలకపల్లి రవి విమర్శించారు. స్వాతంత్ర్య ఉద్యమంలో హిందీ అనుసంధాన భాష అని, దేశాన్ని ఏకం చేసే శక్తి హిందీకే ఉందని అమిత్‌షా అన్న మాటలు శుద్ధ తప్పన్నారు. గాంధీతో సహా వివిధ ప్రాంతాలు, వివిధ భాషల నేపథ్యం కలిగిన నేతలు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారన్నారు. గతంలో బలవంతంగా భాషను రుద్దాలని చూస్తే విద్వేషాలు, కాల్పులు జరిగాయని గుర్తు చేశారు. వేల ఏళ్ల చరిత్ర కలిగిన స్థానిక భాషలకు, చరిత్ర క్రమేణా ఏర్పడిన హిందీకి పోలిక లేదన్నారు. వందేమాతరం కానీ, జాతీయ గీతం జనగణమన కానీ హిందీలో లేవన్నారు. హిందీతో బిజెపి దాడి యాధృచ్ఛికం కాదని, ముందస్తు ప్రణాళికతోనే చేస్తున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో ఎంబివికె కార్యదర్శి మురళీకృష్ణ, అమ్మనుడి సంపాదకులు సామలరమేష్ బాబు, ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రావి శారద, విమర్శకులు సిఎస్ఆర్ ప్రసాద్, విద్యారక్షణ కమిటీ కన్వీనర్ రమేష్‌పట్నాయక్, సాహితీ విమర్శకులు గుమ్మా సాంబశివరావు, సమన్విత బాధ్యులు ఉషారాణి, దివికుమార్ తదితరులు ప్రసంగించారు. ఈ సదస్సులో రాజభాషగా హిందీని వ్యతిరేకిస్తూ ప్రజాశక్తి బుక్‌హౌస్ సంపాదకులు ఎస్. వెంకట్రావు ప్రవేశపెట్టిన తీర్మానానికి వక్తలందరూ

♦

## తీర్మానం



# తెలుగు భాష మనది హిందీ ఆధిపత్యాన్ని సహించం

### 18-09-2019 విజయవాడ సభ తీర్మానం

హిందీని జాతీయ అనుసంధాన భాషగా అందరూ అంగీకరించాలనీ, దాన్ని దేశంలోని అన్ని ప్రాంతాలకూ విస్తరిస్తామనీ సెప్టెంబర్ 14 న జరిగిన జాతీయ హిందీ దినోత్సవం సందర్భంగా కేంద్ర హోమ్ శాఖ మంత్రి అమిత్ షా చేసిన ప్రకటనను ఈ సమావేశం తీవ్రంగా ఖండిస్తోంది. భారత దేశంలో ఏకైక జాతీయ భాష లేదు. దేశంలోని జాతులన్నీ స్వంత భాషలు కలిగి ఉన్నాయి. తమ మాతృభాషలను అభివృద్ధి చేసుకునే హక్కు వాటికి ఉంది. రాజ్యాంగం ప్రకారం ప్రతి జాతీ తమ భాషలో వ్యవహారాలు నడుపుకోవడమే కాకుండా ఇతర భాషలను నేర్చుకునే హక్కు కలిగి ఉంది. వాస్తవానికి దేశంలోని అనేక భాషలకు హిందీకన్నా గొప్పదైన చరిత్ర ఉంది. భారత దేశంలో భాషా ప్రయుక్త రాష్ట్రాలకోసం జరిగిన పోరాటం దేశ స్వాతంత్ర్య పోరాటాన్ని మరింత బలోపేతం చేసింది. భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు తెలుగునేల నాంది పలికిన విషయం, విశాలాంధ్రలో ప్రజారాజ్యం కావాలంటూ పుచ్చలపల్లి సుందరయ్య రాసిన పుస్తకం ఈ ఉద్యమానికి ప్రేరణ ఇచ్చిన విషయం విదితమే. రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్డ్ 22 భారతీయ భాషలను షెడ్యూల్డ్ భాషలుగా గుర్తించింది. అందులో హిందీ కూడా ఒకటి. మన దేశంలో 25 శాతం మంది ప్రజలకు మాత్రమే హిందీ మాతృభాష. అన్ని మాండలికాలనూ కలుపుకున్నా హిందీ మాట్లాడేవారు 40 శాతం మంది మాత్రమే. రాజ్యాంగంలోని 17 భాగం హిందీని అధికార భాషగా గుర్తించినప్పటికీ ఇంగ్లీషును అనుసంధాన భాషగా కొనసాగిస్తామని కేంద్ర పాలకులు హామీ ఇవ్వడం జరిగింది. పార్లమెంటు వ్యవహారాలు, కేంద్ర రాష్ట్రాల మధ్య సమాచారం, న్యాయ వ్యవహారాల్లో ఇంగ్లీషునే ఉపయోగిస్తున్నారు. అందువల్ల హిందీని బలవంతంగా ఇతర భాషలపై రుద్దడం అంటే రాజ్యాంగాన్ని ఉల్లంఘించడమే కాకుండా దేశంలోని భిన్నత్వాన్ని నాశనం చేయడమేనని సమావేశం భావిస్తోంది.

ఒకే దేశం, ఒకే భాష అనే ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాన్ని అమలు చేయడం కోసమే కేంద్ర ప్రభుత్వం దేశంలోని అన్ని జాతుల ప్రజల మీద హిందీ ఆధిపత్యాన్ని నెలకొల్పడానికి ప్రయత్నిస్తోంది. ఇటువంటి భాషాధిపత్యానికి వ్యతిరేకంగా 1965లో దేశ వ్యాపితంగా హిందీ వ్యతిరేక ఆందోళనలు చెలరేగిన విషయం మరిచిపోకూడదు. ఇప్పటికే మతం, ప్రాంతం వంటి భావోద్వేగ అంశాల ఆధారంగా విభజన రాజకీయాలు చేస్తున్న బిజెపి-ఆర్ఎస్ఎస్ నేతృత్వంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పుడు భాష ఆధారంగా కూడా దేశాన్ని విభజించడానికి పూనుకుంటున్నది. ఒకే జాతీయ భాషను అన్ని భాషల ప్రజలు ఆమోదించడం ద్వారా దేశ సమైక్యత బలపడుతుందని అమిత్ షా చేస్తున్న వాదన సరైంది కాదు. భాషాధిపత్యం విభజన వాదానికి దారితీస్తుంది. నిజానికి బంగ్లాదేశ్ విభజనకు భాషా సమస్య ప్రధాన కారణం అన్న విషయం ఆయన మరిచిపోయినట్లున్నారు.

ప్రపంచీకరణ విధానాల వల్ల ఇప్పటికే ప్రాంతీయ భాషలు ఆదరణ కోల్పోతున్నాయి. ఇప్పుడు హిందీ దాడి వల్ల దేశంలోని వివిధ జాతులు తమ భాష అస్తిత్వాన్ని కోల్పోయే ప్రమాదం ఉంది. అదీగాక జాతీయ భాష పేరుతో కేంద్ర ప్రభుత్వ, ప్రభుత్వ రంగ ఉద్యోగాలను హిందీ మీడియంలోకి మారిస్తే ప్రాంతీయ భాషలు మాట్లాడే ప్రజలకు తీవ్రమైన నష్టం కలుగుతుంది. మహారాష్ట్ర, బెంగాల్, ఒడిషాలతో సహా దక్షిణాదిలోని తమిళనాడు, కేరళ చివరికి కర్నాటకలో బిజెపి ముఖ్యమంత్రి కూడా అమిత్ షా ప్రకటనను ఖండించారు. కానీ మన తెలుగు రాష్ట్రాల ప్రభుత్వాలు దీనిపై పెదవి విప్పక పోవడం గర్హనీయం. పార్టీ పేరులో తెలుగు ఉన్న తెలుగు దేశం పార్టీగానీ, రెండు రాష్ట్రాల్లో అధికారంలో ఉన్న వైఎస్ఆర్‌సిపి, టిఆర్ఎస్ పార్టీలు గానీ, ప్రభుత్వాలు గానీ ఇంతవరకు స్పందించక పోవడం తెలుగు జాతికే అవమానం.

ఆర్ఎస్ఎస్ ఎజెండాలో భాగంగా దేశంలోని ఇతర భాషలకు హానికరంగా హిందీని విస్తరింపజేయడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను విరమించుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఈ సమావేశం డిమాండ్ చేస్తున్నది. రాష్ట్రంలో అమలు చేస్తున్న త్రిభాషా సూత్రాన్ని సమీక్షించాలని ఈ సమావేశం కోరుతున్నది. పార్టీలు, సంఘాలు, సంస్థలకు అతీతంగా ప్రజాతంత్ర వాదులు, మాతృభాషాభిమానులు ముందుకు వచ్చి కేంద్ర ప్రభుత్వ చర్యను ఖండించాలని కోరుతున్నది. ♦

# వెలుగు బావుటా

- బి. హనుమారెడ్డి
94402 88080



ప్రియమైన భారతీయుడా
ప్రపంచం విస్తరిస్తుంది
నిన్ను ఆవర్తించుకుంటుంది
నీ అస్థిత్వానికి విపత్తు వచ్చింది
నీవాళ్ళంతా విదేశాల్లో కుదురుకున్నారు
నీకు సొంతదేశం లేని ఆపత్తు వచ్చింది
దేశభక్తి గతకాలపు కుందనపు జ్ఞాపికైంది

"ఇండియా ప్రజలమైన మనము"
ఇది నీదేశపురాజ్యాంగం ప్రస్తావనలో మొదటిమాట
వెన్వెంటనే
"ఇండియా అనగా భారత్"
ఇది నీదేశపు రాజ్యాంగంలో మొదటి అధికారణంలో మొదటిమాట
"ఇండియా" ఏ దేశపు భాషో నీకు తెలియదు
ఈ పేరెవరు పెట్టారో నీకు తెలియదు
అందుకేనేమో "ఇండియా అనగా భారత్" అని
వివరణ రాసుకున్నాం

నీ దేశపు సంస్కృతి - సంప్రదాయాలు
నీ దేశపు నాగరికతలు - పవిత్రతలు మాయమైనాయి
నీ దేశపు గగనంపై వీచే గాలిలో
నీ రేగళ్ళ పరిమళం స్ఫురించదు
నీ దేశపు జీవన విధానం - ధర్మమూలాలు
నీ దేశపు వ్యవస్థలు పాదులు మారాయి
నీ స్వేదం - శోణితం, నీ తోడు - నీడ
నీ బాధ్యతలు - బంధాలు ప్రకృతులు మార్చుకున్నై
నీ ఆహారం - ఆహార్యం, నీ విద్య - ఉద్యోగం
నీ భాష - భాజనము నిన్ను వీడాయి
ఆహవంలో
నీ దేశాన్ని రక్షించాల్సిన నీ చేతిలోని గన్
నీవు నడిపే యుద్ధవిమానం నీ దేశానివి కావు

ఈ పరాయి ప్రకల్పనక్రింద ఎన్నాళ్ళు అలమటిస్తావు?
70 ఏళ్ళకు పైగా స్వతంత్ర చరిత్రవున్న దేశంలో
మేక్ - ఇన్ - ఇండియా నినాదం అవమానంగా లేదా?
మేడ్-ఇన్-ఇండియా అంతస్థు అసాధ్యమా?
నీ దేశాన్ని ఆర్థికమాంద్యం ముసురుకుంది
నిన్నావరించిన ప్రపంచం తిరుగుముఖం పడుతుంది

డియర్ భారతీయుడా !!
నీవు ఆకాశపుటంచుల్ని దాటినా
భారతీయుడవేనని మరువకు
భారతీయతను విడువకు
నిన్ను నీవు నిర్మించుకో
నీకోసం నీవై పదిలపడు
నీదేశం కోసం నీవై పరిఢవిల్లు
వెలుగు బావుటా ఆవిష్కరించు ♦

# స్వీకారం

## మహోబి నిష్క్రమణం రైతు కనుమరుగు

**సడ్లపల్లె చిదంబర రెడ్డి**

వెల : 100/- పేజీలు: 104

ప్రతులకు : 9440073636




సడ్లపల్లె కవితలలో చాలా కవితలు మట్టిచుట్టూ తిరుగుతాయి. తిండి గింజలను పండించే నేల, దానిని నమ్ముకున్న శ్రామికవర్గం ప్రపంచం పెట్టుబడిదారుల వ్యాపారంలో తమ రూపాలను, దారులను కోల్పోతున్న సమయంలో పాలకులు ఇందుకు నిరభ్యంతరంగా సహకరిస్తున్న నేపథ్యంలో కవి ఇలా మట్టిచుట్టు సంచరించడం 'దిద్దుబాటు' చర్యే అవుతుంది.

**- ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి**

## ముంబయి మేరీ జాన్ కథలు

**సంగెవేని రవీంద్ర**

వెల : 150/- పేజీలు: 135

ప్రతులకు: 09987145310



ఇందులో ఇరవై కథలున్నాయి. ఈ కథల్లోని పాత్రల ద్వారా సమాజంలో పెరుగుతున్న స్వార్థ చింతన, మితిమీరిన ధనాపేక్ష, క్షీణించిపోతున్న మానవ సంబంధాలు లాంటి అంశాలెన్నింటినో చెప్పించాడు రవి. అణగారిన వ్యక్తులు, పేదవాడిలో పెల్లుబికే కోపం, కసి లాంటి పలు మానసిక అలజడుల్ని ఎత్తి చూపి సమర్థుడైన కథకుడిగా మనముందుకు వస్తున్నాడు.

**- డా॥ తాటి నరహరి**

## తన్మయధార కవిత్వం

**ఉండవిల్లి సుజాతామూర్తి**

వెల : 50/- పేజీలు: 44

ప్రతులకు: 7416605529




ఉండవల్లి సుజాత విశాఖ సాహిత్య సభల్లో ఒక సందడి. తనకు సాహిత్యం అంటే ఇష్టం. కవిత్వం రాయాలనే అభిలాష. రాసే ఎందరిలోనో మిన్నగా నిలవాలీ అంటే, ఉత్సాహంతో పాటు అధ్యయనం, శ్రద్ధా కూడా ఒకదానితో ఒకటి పోటీ పడుతూ ఉండాలి. వీటన్నిటికీ తొలిదశ సాధకురాలు సుజాత. ఈ చిన్న పుస్తకంలో, తను మనకి అందిస్తున్న భావ వల్లరి, ఆమె వలనే అల్లరి చేస్తున్నాయి.

**- రామతీర్థ, జగద్ధాత్రి**

## కవితా కుసుమాలు

**వెల్లాల ఉమామహేశ్వర శర్మ**

వెల :అమూల్యం పేజీలు: 70

ప్రతులకు: 9290590653




వీరి దృష్టిలో ''సమకాలీన సమాజంలోని లోపాలను ఎత్తి చూపుతూ, తన కలాన్ని కరవాలంగా మార్చుకొని, తనదైన శైలితో, పాఠకుల గుండెల్లో సూటిగా ఆలోచింపచేసేది అసలైన కవిత్వం''. స్వ వచోవ్యాఘాతానికి చోటివ్వని రీతిలో ఇందలి అంశాలన్నీ నిడుదాట సాగినాయి.

**- డా॥ ఆశావాది ప్రకాశరావు**

## కవితా కుసుమాలు - 2

**వెల్లాల ఉమామహేశ్వర శర్మ**

వెల :అమూల్యం పేజీలు: 66

ప్రతులకు: 9290590653




వీరి 'కవితా కుసుమాలు' తొలి సంపుటి ప్రజల చేతుల్లోకి వెళ్ళి మంచి పేరు పొందింది. వారి మలి సంపుటి కవితా కుసుమాలు -2 వ భాగం. దాన్ని ప్రస్తుతం వారు మన ముందుకు తెచ్చారు. ఇందులో 51 కవితలున్నాయి. అన్ని మేల్బంతులే. చక్కటి విషయాన్ని అందించి పాఠకుడికి జ్ఞానోదయం కలిగిస్తాయి.

**- కల్లూరు రాఘవేంద్రరావు**

## నీళ్ళగోస కవితా సంకలనం

**సంపాదకుడు: బైస దేవదాసు**

వెల :150/- పేజీలు: 104

ప్రతులకు: 040-27662477




వర్తమాన ప్రపంచం అనేక ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొంటున్న విషయం అందరికీ తెలిసిందే. వాటిలో అతిముఖ్యమైన నీటి సమస్యను తీసుకుని తెలుగులో లబ్ధ ప్రతిష్టులైన కవుల దగ్గర్నుంచి ఔత్సాహిక కవుల వరకూ రాసిన కవితల సమాహారమే ఈ 'నీళ్ళగోస' కవితా సంకలనం. నేటినిజం పత్రిక సంపాదకులు బైస దేవదాసు సంపాదకత్వం వహించిన ఈ పుస్తకంలోని కవితలు నీళ్ళ సమస్య తీవ్రతను అనేక కోణాల్లో ఆవిష్కరించాయి. ఇది ఒక మంచి ప్రయత్నం.

## నివేదిక

# శాంతినారాయణ పుస్తకావిష్కరణ సభ



అనంతపురంలోని వాల్మీకి భవనంలో సెప్టెంబర్ 15న ప్రముఖ రచయిత డా॥ శాంతినారాయణ రచించిన 'నాలుగు అస్తిత్వాలు – నాలుగు నవలికలు', 'నాగలకట్ట సుద్దులు' రెండవ భాగం పుస్తకాల ఆవిష్కరణ సభ జరిగింది. వాల్మీకి భవన వ్యవస్థాపక అధ్యక్షులు వి.పి. ఆదినారాయణ వాల్మీకి భవన ప్రాంగణంలో ఒకొక్క రచయితతో ఒక మొక్కను నాటించి దాదాపు 45 మంది రచయితల పేర్లతో పాటు, మొక్కలను గురించి వాళ్లు పంపిన క్యాప్షన్స్‌తో తయారు చేయించిన ట్రీగార్డులను పాతించిన తర్వాత అతిథులను సభకు ఆహ్వానించారు. 'జలస్వప్న' కవి మల్లెల స్వాగత వచనాలూ తిప్పేస్వామి 'దేశమును ప్రేమించుమన్నా' ప్రారంభ గీతమూ ముగిసిన తర్వాత ఆచార్య రాచపాళెం చంద్రశేఖర రెడ్డి అధ్యక్షతన సభ ప్రారంభమయ్యింది. ముఖ్య అతిథులు తలారి రంగయ్య, డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ లు పుస్తకాలను ఆవిష్కరించారు. ముఖ్య అతిథి తలారి రంగయ్య మాట్లాడుతూ మంచి పుస్తకాలు సమాజాన్ని చైతన్యవరుస్తాయని, శాంతినారాయణ రచనలన్నీ ఆ కోవకు చెందినవని, అనంతపురం నుంచి గొప్ప సాహిత్యం వస్తుండడం గర్వించదగిన విషయమని అన్నారు. సాహిత్యం ద్వారానే మంచి సమాజం ఏర్పడుతుందని అన్నారు. మరొక ముఖ్యఅతిథి డా॥ దీర్ఘాసి విజయభాస్కర్ మాట్లాడుతూ, మంచి రచయితల సాహిత్యం సమాజానికి అద్దంలాంటిదని, శాంతినారాయణ రచనలన్నీ అట్టడుగు వర్గాల, రైతుల జీవనగతులన్నింటినీ చిత్రించిన కళాఖండాలని కొనియాడారు. రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ శాంతినారాయణ మాండలిక రచనలు రెండు తెలుగు రాష్ట్రాల సాహిత్యలోకంలో ఒక ప్రత్యేకతను సంతరించుకున్నాయని అన్నారు. విశిష్ట అతిథిగా పాల్గొన్న వి.పి. ఆదినారాయణ మాట్లాడుతూ శాంతినారాయణ తమ వూరివాడు కావడం తనకే కాదు తమ ప్రాంతానికే గర్వకారణమని, ఆయన నాగలకట్ట సుద్దులు సమాజచైతన్యదీపికలని అన్నారు. ఆచార్య మేడిపల్లి రవికుమార్, కె.పి. అశోక్‌కుమార్ రెండు పుస్తకాలనూ సమీక్షించారు. నవలికలలోని వస్తుశిల్పాలను, రచయిత తాత్విక దృక్పథాన్ని రవికుమార్ ఆవిష్కరించగా, నాగల కట్ట సుద్దులలోని అధిక్షేపాన్ని, ప్రాసంగికతనూ, సంఘటలన పట్ల, సమకాలీన సమస్యల పట్ల, ప్రభుత్వాల పట్ల రచయితకున్న దృక్పథాన్నీ అశోక్‌కుమార్ విశ్లేషించారు. ప్రజాపక్షం వహించిన మహాసాహస రచయిత శాంతినారాయణ అని ప్రశంసించారు. ఆత్మీయ అతిథి బండి నారాయణస్వామి, సడ్లపల్లి చిదంబరరెడ్డి, ఉప్పరపాటి వెంకటేశులు రచయితతో తమకున్న అనుబంధాన్ని పంచుకున్నారు. మధ్యాహ్న భోజనానంతరం, సూతరంగస్థలి, అస్తిత్వ సాహిత్య ప్రాముఖ్యత అనే అంశాలపైన రెండుగంటల పాటు ఆలోచనాత్మకమైన చర్చ జరిగింది. ప్రసిద్ధ సాహిత్య విశ్లేషకుడు తూముచెర్ల రాజారాం అనుసంధాన కర్తగా వ్యవహరించారు. దీర్ఘాసి విజయభాస్కర్, సూతరంగస్థలి రూపాన్నీ, ఆవశ్యకతనూ వివరించారు. ఈ చర్చా గోష్ఠిలో సాహితీస్రవంతి జిల్లా కన్వీనర్ కుమారస్వామి, కంబదూరి షేక్‌నబి రసూల్, జూటూరు షరీఫ్, దాదా ఖలందర్, ఆవుల వెంకటేశులు, కోగిర తదితరులు పాల్గొన్నారు.

**- డా॥ జూటూరి షరీఫ్**

## నవ్యాంధ్ర రచయితల సంఘం తొలి వార్షికోత్సవ సభ



విజయవాడలోని ఠాగూర్ స్మారక గ్రంథాలయంలో సెప్టెంబర్ 8న నవ్యాంధ్ర రచయితల సంఘం తొలి వార్షికోత్సవ సభ జరిగింది. ఈ కార్యక్రమానికి కొలకలూరి ఇనాక్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ చీకటి గుహల్లోకి సైతం కవిత్వాన్ని నవ్యాంధ్ర రచయితల సంఘం పంపిస్తున్నదని అభినందించారు. ఆత్మీయ అతిథిగా వచ్చిన రాచపాళెం చంద్రశేఖర రెడ్డి మాట్లాడుతూ కవులు వస్తువును చేయడం నేర్చుకోవాలని అన్నారు. సాహితీస్రవంతి గౌరవ అధ్యక్షులు తెలకపల్లి రవి మాట్లాడుతూ ఆర్థిక సరళీకరణలు కాదు భాషా సరళీకరణలు కావాలన్నారు. భావ ప్రకటనా స్వేచ్ఛ మీద, మీడియా మీద, రచయితల మీద ఆంక్షలు విధించటాన్ని భారత రాజ్యాంగం ఒప్పుకోదన్నారు. పెరుమాళ్ మురగన్ నాలో రచయిత మరణించాడని పోస్టు పెట్టిన సందర్భంలో రచయిత మరణించడానికి వీల్లేదని శాసించిన న్యాయవ్యవస్థకు జేజేలు అర్పిస్తున్నానని అన్నారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఆకుల వెంకట శేషసాయి మాట్లాడుతూ సాహిత్యం సమాజాభివృద్ధికి సూచికగా వుండాలన్నారు. సభకు నవ్యాంధ్ర రచయితల సంఘం అధ్యక్షులు బిక్కి కృష్ణ అధ్యక్షత వహించారు. సభలో నవమల్లెతీగ సాహిత్య మాసపత్రిక సెప్టెంబర్ సంచికను, నీలిరాగం కవితా సంపుటిని జస్టిస్ ఆకుల వెంకటశేషసాయి ఆవిష్కరించారు. బిక్కి కృష్ణ రాసిన కొత్తకోణం విమర్శా గ్రంథాన్ని ఆచార్య కొలకలూరి ఇనాక్ ఆవిష్కరించారు. సభలో లయన్ డా. ఎ. విజయకుమార్, శ్రీరామకవచం సాగర్ మాట్లాడారు. తొలుత నవ్యాంధ్ర రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి కలిమిశ్రీ వార్షికోత్సవ నివేదికను చదివి వినిపించారు. కోశాధికారి చొప్పా రాఘవేంద్రశేఖర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు. మధ్యాహ్నం సభలో సాహితీ విమర్శకులు విహారి ఆధునిక సాహిత్యం – తెలుగు భాషా పరిరక్షణ అంశంపై ప్రసంగించారు. అనంతరం మహా కవిసమ్మేళనంలో వివిధ ప్రాంతాలకు చెందిన వందమంది కవులు తమ కవితల్ని వినిపించారు. ♦

***పిళ్లా విజయ్ రచించిన శుక సప్తతి కథలు పుస్తకాన్ని సెప్టెంబర్ 25న కదిరి అభివృద్ధి వేదిక ఆధ్వర్యంలో అనంతపురం జిల్లా కదిరిలోని మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో ఆవిష్కరించారు. చిత్రంలో పిళ్ళా విజయ్, కె. వి. రమణ, నందవరం కేశవరెడ్డి, వెంట్రామిరెడ్డి తదితరులు.*** **కవులు భోగినేని మునీంద్ర, శంకర్ నారాయణ రాజు, రఫీ, కదిరి అభివృద్ధి వేదిక నాయకులు రియాజుల్లా, యన్ ఆర్ శ్రీనివాసులు, యాకోబ్ ఖాన్, రచయిత ఆదినారాయణ, లాయర్ నాగేంద్రతదితరులు పాల్గొన్నారు**





***విజయనగరంలో గురజాడ స్వగృహంలో సెప్టెంబర్ 22న వివిధ సాహిత్య, సాంస్కృతిక సంస్థల ఆధ్వర్యంలో 'హిందీని రుద్దవద్దు.. మాతృభాషే ముద్దు' అంశంపై జరిగిన సభలో ప్రసంగిస్తున్న ప్రముఖ రచయిత అట్టాడ అప్పల్నాయుడు. చిత్రంలో గంటేడ గౌరునాయుడు, డా॥ డి.వి.జి. శంకరరావు, ద్వారం దుర్గాప్రసాద్ ఉన్నారు.***

## డా॥ వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం-2019

డా॥ వేదగిరి రాంబాబు బాలసాహిత్య పురస్కారం - 2019 కి గాను బాలసాహిత్యంలో విశేషకృషి చేస్తున్న 'శ్రీవాణి పలుకు' సంపాదకులు ఎమ్.వి.వి. సత్యనారాయణ (విశాఖపట్నం) ను ఎంపికచేసినట్లు కన్వీనర్ సింహప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. వేదగిరి రాంబాబు పుట్టినరోజు అక్టోబర్ 14న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో ఐదువేల రూపాయల నగదు బహుమతితో పురస్కార గ్రహీతను సత్కరిస్తామని ఆ ప్రకటనలో తెలిపారు.

## పట్టాభి అవార్డ్స్ - 2019

డా॥ పట్టాభి కళాపీఠం 9వ వార్షికోత్సవం సందర్భంగా ఇచ్చే 'పట్టాభి అవార్డ్-2019' కోసం 'నెల్లుట్ల స్మారక కవితా పురస్కారం - 2019' కోసం 2018 సంవత్సరంలో ప్రచురించిన 3 కవితా సంపుటాలను, 'మక్కెన రామసుబ్బయ్య స్మారక కథా పురస్కారం - 2019' కోసం 2018లో ప్రచురించిన 3 కథా సంపుటాలను అక్టోబర్ 30లోపుగా పంపించవలసిందిగా సంస్థ అధ్యక్షులు డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్ ఒక ప్రకటనలో కోరారు. రచయితలు తమ పుస్తకాలను డా॥ తూములూరి రాజేంద్రప్రసాద్, వ్యవస్థాపక అధ్యక్షులు, డా॥ పట్టాభి కళాపీఠము, ఎఫ్.ఎఫ్.3, నాగేంద్ర టవర్స్, దుర్గాపురం, విజయవాడ - 520 002 చిరునామాకు పంపించవలసిందిగా విజ్ఞప్తి చేశారు. ఇతర వివరాలకు 9490332323 ద్వారా సంప్రదించవచ్చును.



*విశాఖపట్నంలో మహాకవి గురజాడ 157వ జయంతి సెప్టెంబర్ 21 ఉదయం ఆర్.టి.సి కాంప్లెక్స్ ప్రాంతంలోని గురజాడ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న సాహితీస్రవంతి, ఐద్వా విశాఖ నగర కమిటీల బృందం. ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సాహితీస్రవంతి అధ్యక్షులు ఎవి రమణారావు, కార్యదర్శి ఎన్.శ్రీనివాస్, ఐద్వా నాయకులు మాధవి, ఆర్.వరలక్ష్మి, కె.మణి, అరసం నాయకులు అనంతరావు, శ్యాంసుందర్, సమాజచైతన్య వేదిక నాయకులు రాంప్రభు, మూర్తి జె.వి.వి. నాయకులు చిలకామూర్తి, శివనాగేశ్వరరావు, యుటిఎఫ్ నాయకులు వై.ఆర్.కె ప్రసాద్, ప్రజానాట్యమండలి కార్యదర్శి జి.రమణ తదితరులు పాల్గొన్నారు. గురజాడ రచించిన దేశభక్తి గేయాన్ని ఆహూతులందరూ ఏకకంఠంతో ఆలపించారు.*

## అంపశయ్య నవీన్ లిటరరీ ట్రస్ట్ నవలల పోటీ

కొత్తగా నవలలు రాసే రచయితలను ప్రోత్సహించాలనే ఉద్దేశ్యంతో రచయితలు రాసిన మొదటి నవలకు బహుమతులు అందించనున్నట్లు ట్రస్టు కార్యదర్శి డి. స్వప్న ఒక ప్రకటనలో తెలిపారు. రచయితలు 2015 - 2018 సంవత్సరాల మధ్య కాలంలో రచనను చేసి ఉండాలని, ప్రింట్‌లో 100 పేజీలకు తగ్గకుండా 250 పేజీలకు మించకుండా ఉండాలని కోరారు. పోటీకి అందిన నవలలో రెండు నవలలకు బహుమతి అందివ్వనున్నట్లు తెలిపారు. మొదటి బహుమతిగా పదివేల రూపాయలు, రెండవ బహుమతిగా ఐదువేల రూపాయలు అందజేస్తామన్నారు. డిసెంబర్ 24న జరిగే అంపశయ్య నవీన్ జన్మదినం రోజు బహుమతులను అందజేస్తారు. అక్టోబర్ 31వ తేదీలోపుగా డి.స్వప్న, కార్యదర్శి, నవీన్ లిటరరీ ట్రస్ట్, 2-7-7, ఎక్సైజ్ కాలనీ, హనుమకొండ, వరంగల్ - 506 001 చిరునామాకు పంపించవలసిందిగా కోరారు. ఇతర వివరాలకు 0870-2456458 ద్వారా సంప్రదించవచ్చును.

## కథ - కవితల పోటీ

నవమల్లెతీగ మాసపత్రిక నిర్వహణలో పుప్పాల ఫౌండేషన్ కవిత, కథ పురస్కారాలు ఇవ్వనున్నట్లు పుప్పాల ఫౌండేషన్ ఛైర్మన్, రచయిత్రి పుప్పాల సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. కథకు రూ.1500 ల చొప్పున ఐదు కథలకు, కవితకు రూ. 1000 ల చొప్పున ఐదు కవితలకు పురస్కారం ప్రకటించనున్నట్లు తెలిపారు. డిటిపిలో 4 పేజీలు, చేతిరాతలో 6 పేజీలకు మించరాదని, కవితలు 30 లైన్లకు మించకుండా పంపించవలసిందిగా కోరారు. కొత్తదనానికి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. రచనలను పుప్పాల సూర్యకుమారి, 68-2-6/1బి, అశోక్‌నగర్, కాకినాడ - 533 003 చిరునామాకు అక్టోబర్ 20వ తేదీలోపుగా పంపాలి. ఇతర వివరాలకు 9701973843 ద్వారా సంప్రదించవచ్చును.

Printed, Published and owned by **V. Krishnaiah** 1-1-298/4, Street No-1, Ashoknagar, Hyderabad-20,
Printed at Prajashakti Daily Printing Press, 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad,
Published at **Shaitya Prasthanam** 1-1-60/2, M.B. Bhavan, Musheerabad, Hyderabad-20. **Editor. T. Ravi**

# ఆహ్వానం

**సామాజిక తత్వవేత్త**

## పోతులూరి వీరబ్రహ్మం

**రాష్ట్రస్థాయి సాహిత్య సాంస్కృతిక సమ్మేళనం**

**వేదిక: లలిత కళాసమితి, కర్నూలు**

**12.10.2019, శనివారం**

**ఉదయం 10 గంటల నుండి**

**సాయంత్రం 7.30గంటల వరకు**

### ప్రారంభ సభ

ఉదయం : 10 గం. - 1 గంట వరకు

సభాధ్యక్షులు: తెలకపల్లి రవి

ప్రారంభోపన్యాసం - పత్తి ఓబులయ్య, ఆహ్వాన సంఘం అధ్యక్షులు

సందేశం: జి.పుల్లయ్య గౌరవాధ్యక్షులు, ఆహ్వానసంఘం.

ప్రధాన కార్యదర్శి నివేదిక: కెంగార మోహన్

**ముఖ్య అతిథులు:**

డా॥ సంజీవ్‌కుమార్, పార్లమెంటు సభ్యులు, కత్తి నరసింహారెడ్డి ఎం.ఎల్.సి., వై.శ్రీనివాసులు రెడ్డి ఎం.ఎల్.సి, ఇక్బాల్ హుసేన్ యం.ఎల్.సి, ఎం.ఏ.హఫీజ్‌ఖాన్ ఎమ్మెల్యే, యస్వీ మోహన్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే, గేయానంద్ మాజీ ఎమ్మెల్సీ, షేక్ హుస్సేన్ సత్యాగ్ని మాజీ ఎమ్మెల్సీ, కేతు విశ్వనాథ రెడ్డి, కొలకలూరి ఇనాక్, కె.రాజశేఖర్, కెవి సుబ్బారెడ్డి, బిసి రాజారెడ్డి, విట్టారమేష్, కురాడి చంద్రశేఖర కల్కూర.

**ప్రజాశక్తి బుక్‌హౌస్ ప్రచురించిన పుస్తకాల ఆవిష్కరణ:**

1. కర్మయోగి వీరబ్రహ్మం - ఆచార్య ఎన్. గోపి
2. పోతులూరి వీరబ్రహ్మం- డా॥ ఎం.ఎం. వినోదిని
3. కాళికాంబ సప్తశతి
4. పోతులూరి వీరబ్రహ్మం పద్యాలు - డా॥ రాచపాళెం
5. వేమన-వీరబ్రహ్మం-ఒక సంభాషణ - జి.కళ్యాణరావు
6. బ్రహ్మంగారి రచనలు-సామాజిక స్పృహ-డా॥ఎం. మల్లిఖార్జున రెడ్డి
7. విప్లవ కవియోగి వీరబ్రహ్మం- ఆచార్య పులికొండ సుబ్బాచారి
8. పోతులూరి వీరబ్రహ్మం తాత్వికత - తులనాత్మకత
9. సామాజిక విప్లవకారుడు పోతులూరి వీరబ్రహ్మం
10. వీరబ్రహ్మం గారి కవిత్వం, కవిత్వాంశాలు

ప్రజానాట్యమండలి ఆధ్వర్యంలో వీరబ్రహ్మం రూపకం ప్రదర్శన, నృత్యాలు, గీతాలాపన : **నిర్వహణ: యంపి బసవరాజు**

వందన సమర్పణ: జెయన్ శేషయ్య

**భోజన విరామం: 1గం. - 1.30 గం. వరకు**

1.30 గం. - 3.30 గంటల వరకు **అంశం: పోతులూరి వీరబ్రహ్మం - నాటి సమాజం**

సభాధ్యక్షులు: రాచపాళెం చంద్రశేఖర రెడ్డి, వక్తలు: మేడిపల్లి రవికుమార్, కొలకలూరి మధుజ్యోతి, పులికొండ సుబ్బాచారి, మూల మల్లిఖార్జున రెడ్డి, యస్.యం.డి.ఇనాయతుల్లా, డా.వి.పోతన్న, మధుసూధనాచార్యులు

వందన సమర్పణ: యు.నరసింహ.

3.30 గం. - 5.30: **అంశం: వీరబ్రహ్మం తత్వాలు, బోధనలు ప్రాధాన్యత**

సభాధ్యక్షులు: నగ్నముని, వక్తలు: ఎం.వి.ఎస్. శర్మ, కె. ఆనందాచారి, ఎం.ఎం. వినోదిని, దార్ల వెంకటేశ్వర రావు, గంటేడ గౌరునాయుడు, చీకటి దివాకర్, జెయస్పార్కె శర్మ, సిద్దయ్య, డి.శంకర్రావు, గన్నమరాజు సాయిబాబా,

వందన సమర్పణ: జి.మధు

5.30 గం. - 7.30. గం.ల వరకు **అంశం: వీరబ్రహ్మం భావాలు - నేటి కర్తవ్యాలు**

సభాధ్యక్షత: జంధ్యాల రఘుబాబు, వక్తలు: శాంతినారాయణ, ఎస్. వెంకట్రావు, కోయి కోటేశ్వర రావు, ప్రసాదమూర్తి, వొరప్రసాద్, పిళ్ళా కుమార స్వామి, ఎం.ప్రగతి, గౌరెడ్డి హరిశ్చంద్రారెడ్డి, రొక్కం కామేశ్వరరావు.,

వందన సమర్పణ: యండి ఆనంద్‌బాబు.

**సామాజిక తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం రాష్ట్రస్థాయి సాహిత్య సాంస్కృతిక సమ్మేళనం ఆహ్వాన సంఘం**

**వివరాలకు: కెంగార మోహన్ 9000730403, జంధ్యాల రఘుబాబు 9441623557**

SAHITYA PRASTHANAM RNI N0.APTEL/ 2004/18396 Postal Regd. No.VJ/187/2017-19
Date of Posting : 1st &2nd of Every Month ▪ Date of Publication: 28.09.2019


# ప్రజాశక్తి బుక్‌హౌస్ తాజా ప్రచురణలు










సామాజిక తత్వవేత్త పోతులూరి వీరబ్రహ్మం
రాష్ట్రస్థాయి సాహిత్య, సాంస్కృతిక సమ్మేళనం

కర్నూలులో లలిత కళాసమితిలో
2019 అక్టోబర్ 12న ఆవిష్కరణ

పోతులూరి వీరబ్రహ్మంపై సామాజిక దృష్టితో పరిశోధన చేసి వెలువరిస్తున్న
ప్రామాణిక రచనలు. సాహిత్య ప్రస్థానం పాఠకులకు ప్రత్యేక తగ్గింపు కలదు.

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ - 520002, ఫోన్: 0866 - 2577533

బ్రాంచీలు: విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, కాకినాడ, ఏలూరు,
విజయనగరం, ఒంగోలు, నెల్లూరు, కర్నూలు, అనంతపురం


If Un delivered please return to: Prasthanam, C/o M.B. Vignana kendram, 27-30-4, 3rd Floor
Akulavari veedhi, Governorpet, Vijayawada - 520002. Ph: 0866-2577248, Cell: 9490099059